నెపోలియన్
రూ: 180/-
పేజీలు: 190



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ఉత్తరాదిలో భారీ వర్షాలు

విమాన ప్రమాదంలో కుట్ర కోణంపై దర్యాప్తు : కేంద్రం

పాకిస్థాన్ సైన్యానివి తప్పుడు ఆరోపణలు : భారత్ ఖండన

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 210 | సోమవారం | 30 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## డిఎంఇలో 16,448 మందికి పదవీకాలం పొడిగింపు

మరో ఏడాది కాలం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్



వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, గౌరవ వేతనం, మల్టీ టాస్కింగ్ విధానంలో పనిచేస్తున్న 16,448 మంది పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. డైరక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో రాష్ట్రంలో కాంట్రాక్ట్ విధానంలో 4772 మంది, అవుట్ సోర్సింగ్ విధానంలో 8615 మంది, గౌరవ వేతనం పొందే విధానంలో 3056 మంది, ఎంటిఎస్ విధానంలో ఐదుగురు పనిచేస్తున్నారు. వీరి పదవీకాలాన్ని మరో ఏడాది పెంచుతూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదివారం

తరువాయి 2లో

## బిఆర్ఎస్ నేతలపై కేసు

- మహా న్యూస్ ఛానల్‌పై దాడి ఘటనలో పోలీసు చర్యలు
- బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌సహా పోలీసుల అదుపులో ఇతర నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ భవన్ వద్ద పోలీసులను అడ్డుకున్న బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేశారు. మహా న్యూస్ ఛానల్ పై బిఆర్ఎస్ నేతలు శనివారం దాడి చేసి.. నేరుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అయితే దాడిపై మహా న్యూస్ ఛానల్ యాజమాన్యం

తరువాయి 2లో



## బిఆర్ఎస్ పని ఖతం

- ఆ పార్టీ జెండాను రాష్ట్ర ప్రజలు ఎప్పుడో పీకేశారు
- గత ప్రభుత్వం కాళేశ్వరంతో ప్రజాధనాన్ని లూటీ చేసింది
- 2026 మార్చి లోపు నక్సలిజాన్ని అంతం చేస్తాం
- తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి
- కేంద్రమంత్రి అమిత్‌షా హెచ్చరిక
- నిజామాబాద్‌లో పసుపుబోర్డు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పని అయిపోయిందని, రాష్ట్ర ప్రజలు ఆ పార్టీ జెండాను ఎప్పుడో పీకేశారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజాధనాన్ని లూటీ చేయడమే కాకుండా టిఎస్‌పిసి లాంటి వాటితో అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. అయితే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి తెలంగాణను ఎటిఎంలా మార్చేసిందని ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన నిజామబాద్‌లో పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దివంగత నేత ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత స్థానిక పాలిటెక్నిక్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో అమిత్ షా ప్రసంగించారు. మావోయిస్టులు (నక్సలైట్లు) తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. 'పహల్గామ్‌లో ఉగ్రదాడితో పాకిస్థాన్ మనల్ని భయపెట్టాలని చూసిందని ఆ తర్వాత భారత్ శక్తి ఏమిటో ఆదేశానికి, ప్రపంచానికి తెలిసింది అని అమిత్‌షా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని మాత్రమే కాకుండా దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యమని స్పష్టం చేశారు. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండని అక్కడ ఉన్న సభికుల్ని ఉద్దేశించి అమిత్‌షా అన్నారు. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కోరారు. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలని అమిత్‌షా పిలుపునిచ్చారు. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని, వారంతా జన జీవన స్రవంతిలోకి వచ్చేసినట్లు గుర్తుచేశారు.

**పసుపు పంటకు నిజామాబాద్ రాజధానిలాంటిది**

తెలంగాణ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పసుపు పంటకు నిజామాబాద్ రాజధానిలాంటిదని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ రైతులు పసుపుబోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారని అమిత్ షా గుర్తు చేశారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్‌లో ప్రపంచమంతా ఎగుమతి అవుతుందన్నారు. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయని ఆయన చెప్పారు. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే

తరువాయి 2లో



## సమ్మె నిర్ణయం ఉపసంహరణ

- జూనియర్ డాక్టర్ల ప్రకటన
- స్టైఫండ్ పెంచడంతో సమ్మె చేయడంలేదని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో తెలంగాణ జూనియర్ డాక్టర్లు సమ్మె నిర్ణయం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. మెడికోలకు ఇచ్చే స్టైఫండ్‌ను సుమారు 15 శాతం పెంచింది. అలాగే మెడికల్, డెంటల్ స్టూడెంట్స్ తో పాటు సీనియర్ రెసిడెంట్స్ కూడా పెంచుతున్నట్టు తెలిపింది. జూడాలు సమ్మె నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో వారితో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లో

తరువాయి 2లో

## జనగణనతోనే కులగణన

- డిసెంబరు 31కి పరిపాలనా యూనిట్ల సరిహద్దుల స్తంభన
- ఏవైనా మార్పులుంటే చేసుకోండి
- రెండు దశల్లో నిర్వహణ
- రాష్ట్రాలు... యుటిలకు కేంద్రం లేఖ



**న్యూఢిల్లీ :** జనగణన నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మతుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. జనాభా లెక్కల ప్రక్రియకు తుది తేదీగా పరిగణించే ఈ ఏడాది డిసెంబర్ 31కి ముందు పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అందులో కోరారు. జనగణన కోసం అన్ని గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాక్‌లుగా విభజించామని పేర్కొన్నారు. జనగణన సమయంలో ఎటువంటి తప్పిదాలు పునరావతం కాకుండా ఉండటానికి ప్రతి బ్లాక్‌కు ఒక గణకుడిని నియమిస్తామని వెల్లడించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్లు, సూపర్ వైజర్లు, గణకుల నియామకం, వారి మధ్య పని విభజన జరుగుతుందని మతుంజయ్ కుమార్ తెలిపారు. 2027 ఫిబ్రవరి 1 నాటికి జనగణన ప్రారంభమవుతుందని వెల్లడించారు. డిసెంబర్ 31 లోపు మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ గ్రామాలు, సబ్ డివిజన్లు, జిల్లాల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అన్ని విభాగాలను ఆదేశించాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లను కోరారు. రాబోయే జనాభా లెక్కల కోసం గహాల గుర్తింపు (హౌస్ లిస్టింగ్) కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఇది జనాభా లెక్కల మొదటి దశ ప్రారంభాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. పర్యవేక్షకులు, గణకుల నియామకాలు రాష్ట్రాలు, జిల్లా పరిపాలన సహకారంతో జరుగుతుందని వెల్లడించారు. జనాభా లెక్కింపు కార్యక్రమం రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో గణకులు ఇంటింటికి వెళ్లి గహాల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో ప్రతి ఇంటి గహ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం

తరువాయి 2లో



## కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితం త్యాగం చేసిన ధీర వనిత సుగుణమ్మ

- ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని కాంక్షించిన ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి
- భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి
- సంస్మరణ సభలో పలువురు వక్తలు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు, అణగారిన వర్గాలకు ప్రాణం పోసేందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని కాంక్షించిన శాకమూరి సుగుణమ్మ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఆసన్నమైందని పలువురు వక్తలు అన్నారు. సుగుణమ్మ స్ఫూర్తితో భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని వారు పిలుపునిచ్చారు. హైదరాబాద్, కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో 'తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకురాలు శాకమూరి సుగుణమ్మ' సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ హాజరై మాట్లాడుతూ రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో సుగుణమ్మ అజ్ఞాతంలో పని చేశారని, తన జీవితం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమానికి త్యాగం చేసిన ధీర వనిత అని కొనియాడారు. ఆమె మరణం మహిళా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. సుగుణమ్మ తన చివరి ఊపిరి ఉన్నంత వరకు కూడా ఉద్యమాల కోసం పని చేశారని గుర్తు చేశారు. సమాజం మనకు ఏం ఇచ్చిందనే భావనతో కాకుండా, మనం సమాజానికి ఏం చేశామనే ఆలోచనతోనే ఆమె ఉద్యమంలో పాల్గొన్నారని నారాయణ అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సుగుణమ్మ పోరాట యోదురాలు అని, ఆమె ఆదర్శవంతమైన



తరువాయి 12లో

## బనకచర్లపై రేపు పవర్‌పాయింట్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల గోదావరి అంశంపై జూలై 1 వ తేదీన ప్రజా ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. జులై 1న ప్రజా భవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరుకానున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ,లోకసభ సభ్యులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలతో పాటు కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్ లు,సభ్యులు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులందరికీ నిజ నిజాలు తెలిపే విధంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 'పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో భాగంగా బనకచర్ల ప్రాజెక్ట్ తాజా పరిస్థితులు, తదితర అంశాల పైన ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించారు. కాగా ఈ ప్రాజెక్టు నిర్మించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బ తింటున్నాయనే విషయమై సమగ్రంగా వివరించేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు.



## పూరి జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

- ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మృతి మరో 50 మందికి గాయాలు
- ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ క్షమాపణలు
- భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ
- పూరి కలెక్టర్ సిద్ధార్థ్, ఎస్‌పి బినిత్ అగర్వాల్‌పై బదిలీ వేటు

**పూరి :** ఒడిశాలో పూరి జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకున్నది. గుండిచా ఆలయం వద్ద జరిగిన తోపులాటలో ముగ్గురు భక్తులు మృతి చెందారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. జగన్నాథుడు, అతని తోబుట్టువులు బలభద్రుడు, సుభద్రా దేవితో కూడిన రథాలు ప్రధాన ఆలయానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకున్నాయి. రథాలను లాగేందుకు, జగన్నాథుడిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా తొక్కిసలాట చోటుచేసుకున్నది. దీంతో ముగ్గురు భక్తులు

తరువాయి 2లో



## 'మేకిన్ ఇండియా' కాదు... 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ'



- అదే మా నినాదం, మా లక్ష్యం...
- 'ఐఐటిఇఎక్స్ – 2025' ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

'మేకిన్ ఇండియా' కాదు... 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' అన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం హైటెక్స్ లో 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టిసిసిఐ)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో(ఐఐటీఈఎక్స్) – 2025' ముగింపు వేడుకలకు శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్(ఐఐపి) కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు(సిఎంజిఆర్) 2.9 శాతం. అదే జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే. ఆరు రెట్లు తెలంగాణలో అధికంగా నమోదయ్యింది. 2024–25లో

తరువాయి 2లో

## పూర్ణచందర్‌రావుపై పోక్సో కేసు

స్వేచ్ఛతో పాటు ఆమె కూతురికీ వేధింపులు

ప్రజాపక్షం/హైదరాబాద్



యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసు కొలిక్కి వచ్చింది. స్వేచ్ఛ ఆత్మహత్యకు పూర్ణ చందర్ కారణం అంటూ మృతురాలి కూతురు, తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పూర్ణ చందర్.. తన లాయర్‌తో వచ్చి.. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు

తరువాయి 12లో

## గాజాలో యుద్ధ విరమణకు ట్రంప్ యత్నాలు ముమ్మరం!

అమెరికా ప్రయాణానికి నెతన్యాహూ సన్నాహాలు

**టెల్‌అవీవ్ :** గాజాలో త్వరగా యుద్ధం ముగించి సంధి చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోరారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ మీడియాలో ఆదివారంనాడు పోస్టింగ్ పెట్టారు. ''గాజాలో ఒప్పందం చేసుకోండి, బందీలను వెనక్కు తెచ్చుకోండి'' అని ఆయన పేర్కొన్నారు. 21 నెలలుగా జరుగుతున్న యుద్ధం ముగించి హమాస్‌తో సంధి చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూపై ఆయన ఒత్తిడి చేశారు. గడచిన శుక్రవారంనాడే ట్రంప్ ఈ విషయాన్ని ప్రస్తావించి, వచ్చే వారం కాల్పుల విరమణ ఒప్పందం ఉంటుందని సూచనాప్రాయంగా చెప్పారు. ఇటీవలి కాలంలో ట్రంప్ గాజాలో యుద్ధ విరమణ గురించి తరచు మాట్లాడుతున్నారు. ''గాజా సమస్యపై పనిచేస్తున్నాం, ఆ ప్రయత్నాల్లో ఉన్నాం'' అని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై దాడుల తర్వాత ఆయన అటువైపే దృష్టిపెట్టినట్లు అమెరికా మీడియా పేర్కొంది. గాజాలో యుద్ధం ముగుస్తుందని మెల్లిగా ఆశలు రేకెత్తిస్తున్నారు. రాబోయే వారాల్లో వాషింగ్టన్ డిసిలో పర్యటనకు నేతన్యాహూ సన్నాహాలు చేసుకుంటున్నారని అదేసమయంలో ఇజ్రాయెలీ ప్రధానమంత్రి కార్యాలయం కూడా తెలియజేసింది. దీంతో గాజాలో సయోధ్య కుదిరి యుద్ధ విరమణకు అవకాశాలు ఏర్పడతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఐతే నేతన్యాహూ



తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఎవిన్ జైలుపై దాడిలో 71 మంది మృతి
### ఇరాన్ న్యాయ శాఖ ప్రకటన

**టెహ్రాన్ :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఎవిన్ జైలుపై ఇజ్రాయెల్ ఈనెల 23న చేసిన దాడిలో 71 మంది చనిపోయినట్లు అక్కడి న్యాయశాఖ అధికార ప్రతినిధి జహంగీర్ ఆదివారం వెల్లడించారు. వైమానిక యుద్ధం ముగింపు క్రమంలో రాజకీయ ఖైదీలను ఉంచే టెహ్రాన్ జైలుపై ఇజ్రాయెల్ దాడి చేసింది. తద్వారా కేవలం సైనిక స్థావరాలు, అణు కేంద్రాలే తమ లక్ష్యాలు కాదని చెప్పే ప్రయత్నం చేసింది. కాగా, మృతుల్లో ఖైదీలతో పాటు వారిని కలిసేందుకు వచ్చిన కుటుంబ సభ్యులు, సైనిక శిక్షలో ఉన్న యువత, సిబ్బంది, జైలు పరిసరాల్లో ఉన్న కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు జహంగీర్ తెలిపారు. జైలులోని కొంత భాగం ధ్వంసం కాగా, మిగతా ఖైదీలను టెహ్రాన్ పరిధిలోని వేరే జైళ్లకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. ఫ్రెంచ్ పౌరులు ఇద్దరు మూడేళ్లుగా ఎవిన్ జైలులో ఉన్నారు. ఇంకొందరు విదేశీయులు కూడా ఉన్నారు.



## ఉక్రెన్ ఎఫ్–16 యుద్ధవిమానం కూల్చివేత
### రష్యా సామూహిక గగనతల దాడులు

**కీవ్ :** ఉక్రెన్‌పై రష్యా చాలా తీవ్రస్థాయిలో సామూహిక గగనతల దాడులు చేసింది. ఈ దాడుల్లో ఉక్రెన్ ఎఫ్–16 యుద్ధ విమానాన్ని రష్యా కూల్చివేసింది. దీంతో ఉక్రెన్ పైలట్ మరణించాడు. 60 క్షిపణులు, 477 డ్రోన్లు సహా 537 గగనతల ఆయుధాలను రష్యా ప్రయోగించింది. ఈ దాడులను తిప్పికొట్టే ప్రయత్నంలో తమ యుద్ధవిమానాన్ని రష్యా కూల్చివేసినట్లు ఉక్రెన్ అధికారికంగా ప్రకటించింది. రష్యా ప్రయోగించిన 249 గగనతల ఆయుధాలను మార్గమధ్యలోనే కూల్చివేసినట్లు అధికారులు చెప్పారు. మరికొన్నింటిని సాంకేతిక పద్ధతుల్లో జామ్ చేసినట్లు చెప్పారు. 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చేసిన అతిపెద్ద సామూహిక దాడుల్లో ఇదొకటి. అనేక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఖెర్సాన్ ప్రాంతంలో ఈ దాడుల వల్ల ఒక పౌరుడు మరణించాడని ఖెర్సాన్ ప్రావిన్స్ గవర్నర్ ఒలెక్సాండర్ ప్రొకుడిన్ చెప్పారు. ఖార్కివ్ ప్రాంతంలో ఒక డ్రోన్ కారును ధ్వంసం చేసింది. ఛెర్కసీ ప్రాంతంలో ఆరుగురు ప్రజలు డ్రోన్ దాడిలో గాయపడ్డారు. కాగా డ్రోన్ ప్రొడక్షన్ కేంద్రాలపైన, తాత్కాలిక యుద్ధ కేంద్రాలపైన దాడులుచేసి ఆయుధ సంపదను ధ్వంసం చేసినట్లు ఆదివారంనాడు రష్యా ప్రకటించింది. 133 ప్రాంతాలపై దాడులు చేశామని, విదేశీ కిరాయి సైనికులుండే ప్రాంతాలు, డ్రోన్లు ఇతర ఆయుధాలు నిల్వచేసిన కేంద్రాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణశాఖ చెప్పిందని టాస్ వార్తా సంస్థ ప్రకటించింది.

## ట్రంప్ 'బ్యూటిఫుల్ బిల్'పై నేడు ఫైనల్ ఓటింగ్!
### సెనేట్‌లో రెండు రోజుల చర్చ ప్రారంభం

**వాషింగ్టన్ :** పొదుపు చర్యలు–పన్నుల్లో కోతలు విధించేందుకు డోనాల్డ్ ట్రంప్ మెగా బిల్లుపై అమెరికా పార్లమెంటులో చర్చ మొదలైంది. సోమవారంనాడు ఈ బిల్లుపై ఫైనల్ ఓటింగ్ జరుగుతుంది. కానీ దీనికి ఇంకా చాలా ఆటంకాలు ఉన్నాయి. ట్రంప్ రెండో విడత పాలనలో నిర్దేశించుకున్న ఎజెండాలో ఈ బిల్లుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రధానంగా దేశీయ వ్యవహారాలపైనే బిల్లు దృష్టిసారించింది. బిల్లులోని నిబంధనలు ఆసియా దేశాలకు ఆందోళన కలిగించాయని స్టాక్ మార్కెట్ సమాచార వేదిక 'నిక్కీ ఏసియా' ప్రకటించింది. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టేందుకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని, ఈ బిల్లు ఆమోదం పొందకపోతే జాతిద్రోహమే అవుతుందని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు సిఎన్‌బిసి తెలియజేసింది. జూలై నాలుగో తేదీ నాటికి అన్ని లాంఛనాలూ పూర్తిచేసుకుని ఈ బిల్లు బయటకు రావాలని ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. 940 పేజీలతో కూడిన ఈ సుదీర్ఘమైన మెగాబిల్లుపై చర్చ ప్రారంభించడానికి 51–49 ఓట్ల తేడాతో సెనేట్ ప్రాథమిక ఆమోదం లభించింది. డెమోక్రటిక్‌పార్టీకి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు రాండ్ పాల్, థోమ్ టిల్లిస్‌లు ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ బిల్లు వల్ల 70.80 లక్షలమంది బీమా కోల్పోతారని బడ్జెట్ కార్యాలయం అంచనావేసింది.




ప్రత్యేకించి బిగ్ బ్యూటిఫుల్ బిల్ చట్టంలోని రెవెన్యూ విభాగంలో 899వ నిబంధన కొత్తగా చేరుస్తారు. దీని ప్రకారం అమెరికా అన్యాయం అని భావించిన దేశాలలో కంపెనీలపై, వ్యక్తులపై అదనపు పన్నుల భారాలు వేస్తుంది. కార్పోరేట్ బాండ్లపై వడ్డీలను, స్టాక్ డివిడెండ్లపై లేవీని కూడా పెంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సెనేట్‌లోకి వచ్చేసరికి ఏడాదికి ఐదు నుండి 15 పాయింట్ల మేరకు ఈ పెరుగుదల అవకాశాలున్నాయి. చాలా దేశాలకు సంబంధించిన కంపెనీలపై తక్కువ పన్నులు విధిస్తున్నారని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికాలో భారీ షేర్లు ఉన్న కంపెనీలకు ప్రధానంగా ఇది శరాఘాతం కానున్నది. ఈ చట్టంలోని కొత్త నిబంధనపట్ల చైనా కంపెనీ నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ దీనిని బ్యూటిఫుల్ బిల్‌గా అమెరికావ్యాప్తంగా ప్రచారం చేశారు. ఈ పన్నుల కోత బిల్లు ప్రధానంగా సామాజిక భద్రతకు ప్రయోజనం కలిగిస్తుందని ఆయన చెబుతున్నారు. ఈ బిల్లు వల్ల గ్రామీణ ఆసుపత్రులకు పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయని రిపబ్లికన్లు ప్రచారం చేస్తున్నారు. ప్రాథమిక గండాలు దాటి బిల్లు ముందుకు వెళ్ళడంతో ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియా (ట్రూత్ సోషల్)లో ఒక పోస్ట్ పెడుతూ, "గ్రేట్, సెనేట్‌లో గ్రేట్ విక్టరీ, ఈ ఆదివారంనాడు సెనేట్‌లో బ్యూటిఫుల్ బిల్లు గొప్ప విజయం సాధించింది" అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా ఈ బిల్లుపై చర్చ జరుగుతోంది. "సెనేట్ ఆమోదించిన ఈ బిల్లు దేశంలో లక్షలమంది అమెరికన్ల ఉద్యోగాలను నాశనం చేస్తుంది, దేశానికి చాలా వ్యూహాత్మకమైన హాని చేస్తుంది" అని ఎలాన్ మస్క్ వాదించారు. కాలంచెల్లిన పరిశ్రమలకు ఈ బిల్లు సబ్సిడీలు సమకూర్చనుందని, భవిష్యత్తుపై దృష్టిసారించిన రంగాలకు హాని చేస్తుందని విమర్శించారు. న్యూయార్క్ ప్రతినిధి మైక్ లాలెర్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. చాలాసేపు ఉద్ధృతమైన సంప్రదింపులు, బుజ్జగింపుల తర్వాత అనేకమంది జిఒపి సభ్యులు బిల్లును ముందుకు తీసుకువెళ్ళేందుకు వీలుగా మనసు మార్చుకున్నారు.




## ప్రధానమంత్రి పదవికి షినవత్ర అన్‌ఫిట్
### బ్యాంకాక్‌లో వేలాదిమంది నిరసన ప్రదర్శన

**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్‌లో నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్ర(38) రాజీనామా చేయాలని కోరుతూ ప్రజలు బ్యాంకాక్‌లో భారీ ప్రదర్శన చేశారు. 2023లో అధికార ఫాయే థాయ్ పార్టీ సారథ్యంలోని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంత భారీ నిరసన ప్రదర్శన ఇప్పటివరకూ జరగలేదు. ప్రజలు స్వచ్ఛందంగా వెళ్ళి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రధానమంత్రిని "అన్‌ఫిట్"గా వారు అభివర్ణిస్తున్నారు. ఆమెను, ఆమె తండ్రిని కాంబోడియా మాజీనేత హున్‌సేన్ తీవ్రంగా ప్రభావితం చేస్తూ తప్పుతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పదవీచ్యుతుడైన థాయ్‌లాండ్ మాజీ ప్రధానమంత్రి తక్షిన్ షినవత్ర కుమార్తె పేటోంగ్టార్న్. రెండు దశాబ్దాలుగా దేశంలో షినవత్ర వారసుల పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న జాతీయవాద కార్యకర్తలు అత్యధికంగా ఉన్న యునైటెడ్ ఫోర్స్ కూటమి ఈ ప్రదర్శనకు నాయకత్వం వహించింది. కాంబోడియా మాజీ దేశనేత హున్‌సేన్‌తో షినవత్ర ఫోన్ సంభాషణలో థాయ్‌లాండ్ జాతి అభ్యంతరకరంగా భావించిన అంశాలు బయటకు పొక్కడంతో తీవ్ర ఆగ్రహజ్వాలలు ఎగసిపడుతున్నాయి. కొద్దిరోజులుగా థాయ్‌లాండ్ నిరసన ప్రదర్శనలతో అట్టుడుకుతున్నది. రెండుదేశాల మధ్యా సరిహద్దు ఉద్రిక్తతల సందర్భంగా ఫోన్ సంభాషణలో హున్‌సేన్‌ను షినవత్ర "అంకుల్" అని సంబోధించడం ప్రజల ఆగ్రహానికి ప్రధాన కారణమైంది. ప్రజలు వ్యతిరేకంగా మారడంతో షినవత్ర కూటమి ప్రభుత్వం నుండి భాగస్వామ్యపార్టీ కూడా వైదొలగింది. ఫోన్ సంభాషణలో వాడిన పదజాలంపై ప్రధాని ప్రజలకు క్షమాపణ చెప్పారు. ఆ విధంగా ఫోన్ మాట్లాడటం దౌత్యపరమైన సంప్రదింపుల మార్గాలలో ఒకటని ఆమె వివరణ ఇచ్చారు. ఉత్తర థాయ్‌లాండ్‌లో వరదల బారిన పడిన ప్రజలను పరామర్శించేందుకు వెళ్ళేముందుగా షినవత్ర పాత్రికేయులతో మాట్లాడుతూ, నిరసన ప్రదర్శనలు చేయడం ప్రజలకు ఉన్న మౌలికమైన హక్కు అనీ, శాంతియుతంగా కొనసాగినంతకాలం ఆ హక్కుకు ఎలాంటి భంగం వాటిల్లబోదనీ చెప్పారు.

## ఐఎఇఎకు సహకరించం
### ఇరాన్ పార్లమెంటు తీర్మానం

**టెహ్రాన్ :** అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ)కు ఎలాంటి సహకారం ఇవ్వకూడదని ఇరాన్ పార్లమెంటు తీర్మానించింది. ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఆపేసిన తర్వాత ఇరాన్ శాంతియుత ప్రయోజనాలకోసం అణు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్న తన లక్ష్యాన్ని మరింత బలంగా నిర్దేశించుకున్న తర్వాత ఆ దేశ పార్లమెంటు ఈ తీర్మానం ఆమోదించింది. అదేవిధంగా ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ గ్రాస్సీని కూడా ఇరాన్‌లోకి అడుగుపెట్టనీయకూడదనీ, తమ అణుశుద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కేంద్రాలలో నిఘా నేత్రాల ఏర్పాటును, పర్యవేక్షణను కూడా అనుమతించకూడదని పార్లమెంటు తీర్మానించింది. అంగీకృత నియమ నిబంధనలను ఇరాన్ ఉల్లంఘించిందని, శాంతియుత ప్రయోజనాలకు వీలుగా ఉపయోగించే శుద్ధి చేసిన యురేనియం కంటే చాలా ఎక్కువ మోతాదులో యురేనియంను నిల్వ చేసి ఉంచిందని ఐఎఇఎ విమర్శలు గుప్పించింది. ఐఎఇఎ మొదటి నుండీ వివక్షపూరిత ధోరణి అనుసరిస్తోందని ఇరాన్ విమర్శిస్తున్నది. నాన్–మెంబర్స్ అణ్వాయుధాలు సమకూర్చుకోకుండా ఐఎఇఎ అడ్డుపడుతున్నదని విమర్శించగా, ఎలాంటి సాక్ష్యాలూ చూపించకుండా ఇరాన్ దేశం అణ్వాయుధాల నిర్మాణానికి అణుప్రణాళికలు చేస్తోందని ఇజ్రాయెల్ కూడా ఎప్పటినుండో విమర్శిస్తున్నది.

ఇరాన్‌లోని మూడు ప్రధానమైన అణుకేంద్రాలను తాము ధ్వంసం చేశామని ట్రంప్ ప్రభుత్వం ప్రపంచమంతా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ అందులో ఎలాంటి నిజం లేదని ఇరాన్ అనుకూలదేశాలు స్పష్టం చేశాయి. అమెరికా గూఢచారిసంస్థ కూడా ఇరాన్ అణుకేంద్రాలను సంపూర్ణంగా ధ్వంసం చేశామా? లేదా? అనే విషయంపై పూర్తి ధృవీకరణ ఇవ్వలేదు. సందేహాలు వ్యక్తం చేసింది. మరోవైపు ఇరాన్‌లో ధ్వంసమైన అణుకేంద్ర ప్రాంతాలను తనిఖీ చేయడం అసాధ్యమైన విషయమని నిపుణులు కూడా చెబుతున్నారు.

ఒబామా పరిపాలనాకాలంలో ఇరాన్ 2015లో జెసిపిఒఎ (సమగ్ర ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక) ఒప్పందంపై సంతకాలు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డోనాల్డ్ ట్రంప్ తన మొదటివిడత పరిపాలన సందర్భంగా 2018 మే నెలలో ఇరాన్‌తో ఆ ఒప్పందాన్ని రద్దుచేశారు. రెండోవిడత అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఇరాన్‌ను లొంగదీస్తామని, మరిన్ని అణునియంత్రణ పరిమితులు విధించి ఇంకా మెరుగైన ఒప్పందం చేసుకుంటామని ప్రజలకు ట్రంప్ వాగ్దానం చేశారు.

పదవి చేపట్టాక ఆ మేరకు ఇరాన్‌తో చర్చలు ప్రారంభించి బాంబు దాడులు చేస్తామని హెచ్చరించి, చివరకు అన్నంతపనీ చేశారు. భూగోళంపై అణ్వస్త్ర వ్యాప్తి నియంత్రణలో వివక్ష చూపించకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ఐఎఇఎదే. కానీ యూరప్, అమెరికా తొత్తుగా వ్యవహరిస్తోందని ఐఎఇఎ ముద్రవేయించుకుంది. 1968లో మొదటిసారి ఎన్‌పిటి (అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం)పై వివిధ దేశాలు సంతకాలు చేశాయి. ఐదు సంవత్సరాల తర్వాత దానిని సమీక్షించాయి.

## ఇరాన్ యురేనియం శుద్ధి కొద్దినెలల్లో పునఃప్రారంభం!

**జెనీవా :** అణుబాంబులు తయారు చేయడానికి వీలుగా ఇరాన్ దేశం రాబోయే కొద్ది నెలలోనే యురేనియం శుద్ధి చేసే కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తుందని అణు నిఘా సంస్థ ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ చెప్పారు. జూన్ 22వ తేదీన ఇరాన్‌లోని ప్రధాన అణుకేంద్రాలు ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లపై అమెరికా బాంబర్లు దాడులు చేసినప్పటికీ ఆ విధ్వంసం సంపూర్ణంగా లేదని ఆయన అన్నారు. నివేదికలన్నీ ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు చాలా భిన్నంగా ఉన్నాయన్నారు. ఇరాన్‌లోన ప్రధాన అణుకేంద్రాలలో అన్నీ ధ్వంసమైపోయాయనీ, ఏదీ కనిపించకుండా పోయాయనీ ఏ ఒక్కరూ చెప్పలేరన్నారు. ఇరాన్‌లో ధ్వంసమైన అణుకేంద్రాలలో వాస్తవాలేమిటో పరిశీలించడం కూడా సాధ్యంకాని విషయమని నిపుణులు చెపుతున్న విషయాన్ని కూడా ఆయన ఉటంకించారు. అమెరికా–ఇరాన్ మధ్య ఆరో విడత పరోక్ష చర్చలు మస్కట్‌లో జూన్ 15వ తేదీన ప్రారంభం కావాల్సి ఉండగా, దీనికి రెండు రోజులు ముందుగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడంతో మొత్తం పరిస్థితులన్నీ తలక్రిందులయ్యాయి. తర్వాత పది రోజులకు అమెరికా కూడా యుద్ధంలో చేరింది. వారు కోరుకుంటే కొద్ది నెలల్లోనే యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని గ్రాస్సీ చెప్పారు.

## బిఆర్‌ఎస్ నేతలపై కేసు
(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, సహా ఇతర నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు పెద్ద ఎత్తున్న బిఆర్‌ఎస్ భవన్ వద్దకు చేరుకోవడంతో నేతలు పోలీసులను అడ్డుకున్నారు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయంలోకి సెర్చ్ వారెంట్ లేకుండా.. ఎలా వస్తారని నిలదీశారు. ఈ క్రమంలో పోలీసులకు, బిఆర్‌ఎస్ నేతలకు వాగ్వాదం ఏర్పడింది. దీంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే న్యూస్ ఛానల్ దాడి కేసు నిందితులను అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, సుమోటోగా తీసుకుని, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి, మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్ పై సహా పలువురు బిఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు.

## కులగణన
(మొదటి పేజీ తరువాయి)

సేకరిస్తారు. ఆ తర్వాత రెండో దశలో ఇంటింటికి వెళ్లి జన గణన చేపడతారు. ప్రతి ఇంట్లోని జనాభా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను తీసుకుంటారు. ఇది 2027 ఫిబ్రవరి 1 నాటికి జరగనుంది.

**జనగణనతో పాటు కులగణన :**
జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటనలో తెలిపింది. జనగణన కార్యకలాపాల కోసం 34 లక్షలకు పైగా గణకులు, పర్యవేక్షకులు, సుమారు 1.3 లక్షల జనాభా గణన కార్యకర్తలను నియమించనున్నారు. మరికొద్ది రోజుల్లో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదవది. రాబోయే జనాభా గణనను మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గెపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటిరీయల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

**పదేళ్లకొకసారి జనగణన :** సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. తాజాగా 16వ జనగణనకు సిద్ధమైంది కేంద్రం.

## బిఆర్‌ఎస్ పని ఖతం
(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటవుతున్నాయని వివరించారు. భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుందని అమిత్ షా వెల్లడించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎంపి అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు సాధించారని చెప్పారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నామని అమిత్ షా వెల్లడించారు. పసుపు బోర్డు చైర్మన్‌గా నిజామాబాద్‌కు చెందిన రైతుబిడ్డను ఎంపిక చేయడం జిల్లాకు దక్కిన గౌరవమని చెప్పారు.

మోదీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారని ఆయన అన్నారు. తెలంగాణలో బిజెపి తప్పక అధికారంలోకి వస్తుందని షా దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బిజెపి విజయం ఖాయమైందని తెలుస్తోందని వివరించారు.

**కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఘనస్వాగతం**
నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేంద్ర హోంమంత్రి మధ్యాహ్నం 2.15 గంటలకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమిత్‌షాకు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెపి జాతీయ నాయకులు కె. లక్ష్మణ్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సిపి సాయిచైతన్య తదితరులు అమిత్‌షాకు సాదర స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్‌లో కేంద్ర హోంమంత్రి వినాయక్‌నగర్ చేరుకుని నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. అక్కడి నుండి కాన్వాయ్ ద్వారా బస్వా గార్డెన్ చేరుకుని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో పాల్గొని పసుపు రైతులు, బోర్డు అధికారులనుద్దేశించి మాట్లాడారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పసుపు బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పై చర్యలు లేవా?
### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఎటిఎం తరహామారిందని చెబుతున్న కేంద్రహోం మంత్రి, దీనిపైన ఎందుకు విచారణ చేపట్టడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపైన కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపేందుకు ఏం అడ్డొస్తుందని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గొంతుకగా నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న బిఆర్‌ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకనే తెలంగా సిఎం రేవంత్‌ను బిజెపి ఒక పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లడం అత్యంత దురదృష్టకరమని, ఎనిమిది మంది ఎంపిలను గెలిపించినప్పటికీ, కేంద్రంలో తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వకుండా, కనీసం ఒక్క ఐఐటి, ఐఐఎం, మెడికల్ కాలేజీ వంటి ఉన్నత విద్యాసంస్థలు మంజూరు చేయకుండా తెలంగాణకు బిజెపి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉన్నారని మండిపడ్డారు.

## తొక్కిసలాట
(మొదటి పేజీ తరువాయి)

అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో ప్రభాతి దాస్, బసంతి సాహూ అనే ఇద్దరు మహిళలు ఉండగా, ప్రేమ్‌కాంత్ మొహంతి అనే 70 ఏండ్ల వృద్ధుడు ఉన్నారు. వీరంతా ఒడిశాలోని ఖుర్దా జిల్లాకు చెందినవారని, పూరి రథయాత్రను తిలకించేందుకు వచ్చారని పోలీసులు తెలిపారు. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. కాగా, భక్తుల రద్దీకి తగిన విధంగా పోలీసులు ఏర్పాట్లు చేయలేదని స్థానిక మీడియా వెల్లడించింది.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పూరీ జగన్నాత రథయాత్ర ఈ నెల 27న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ రథయాత్రలో అధిక వేడి, రద్దీ కారణంగా తొలిరోజే పలువురు భక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 600 మందికిపైగా భక్తులు అస్వస్థతో ఆసుపత్రిలో చేరారు. 'శుక్రవారం జరిగిన రథయాత్ర సందర్భంగా దాదాపు 625 మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఎండ, ఉక్కపోత, రద్దీ కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

వారిని ఆసుపత్రుల్లో చేర్పించాల్సి వచ్చింది. రథాలను లాగేందుకు పోటీపడి పలువురు స్వల్పంగా గాయపడ్డారు' అని అధికారులు తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం పలువురు డిశ్చార్జ్ అయినట్లు చెప్పారు. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు.

**పూరీ రథయాత్ర తొక్కిసలాటపై సిఎం క్షమాపణలు**
పూరి జగన్నాథ రథయాత్రలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్నాథ్ భక్తులందరికీ ప్రభుత్వం తరపున క్షమాపణలు చెబుతున్నట్లు మాఝి ప్రకటించారు. ఈ భద్రతా నిర్లక్ష్యం క్షమించరానిదన్న ముఖ్యమంత్రి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ప్రకటించారు. పూరి కలెక్టర్ సిద్ధార్థ్, ఎస్‌పి బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పూరీ డిసిపి బిష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజయ్ పధిని సస్పెండ చేస్తున్నట్లు తెలిపారు.

**రాజకీయ దుమారం :** ఇక, రథయాత్ర ఆలస్యం కావడంపై రాజకీయ వివాదం రాజుకుంది. బిజెడి అధినేత, మాజీ సిఎం నవీన్ పట్నాయక్ ఈ పరిస్థితిని దారుణమైన గందరగోళంగా అభివర్ణించారు. "మనం చేయగలిగింది ప్రార్థించడం మాత్రమే. ఈ ఏడాది ఈ దివ్యమైన ఉత్సవానికి నీలినీడలు అలుముకునేలా చేసిన ఈ గందరగోళానికి బాధ్యులైన వారందరినీ మహాప్రభు జగన్నాథుడు క్షమించాలి" అని ఆయన అన్నారు. నవీన్ పట్నాయక్ వ్యాఖ్యలపై ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథివిరాజ్ హరిచందన్ పరోక్షంగా స్పందించారు. బిజెడి అనవసరంగా రాజకీయ ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. "గతంలో బిజెడి ప్రభుత్వం తప్పులు చేసి జగన్నాథుడిని అవమానించింది. 1977 నుంచి రథాలు ఎప్పుడూ రెండో రోజే గుండిచా ఆలయానికి చేరుకునేవి" అని ఆయన తెలిపారు.

**ఖర్గే, రాహుల్ విచారం :** మరోవైపు పూరీ తొక్కిసలాట దుర్ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి పూర్తిగా నిర్లక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే జరిగిందని ఆరోపించారు. మతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. క్షతగాత్రులకు సరైన సహాయం అందించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ తొక్కిసలాట ఘటనపై పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్‌దేవ్ విచారం వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావత్తం కాకుండా సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పూరీ జగన్నాథ్ రథయాత్రకు మరిన్ని ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు. అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సమ్మె నిర్ణయం ఉపసంహరణ
(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం చర్చలు జరిపారు. ప్రభుత్వం సానకూలంగా స్పందించడంతో సమ్మె నిర్ణయం ఉపసంహరించుకుంటున్నట్లు జూడాలు ప్రకటించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఈ నెల 30(సోమవారం) నుంచి సమ్మెకు వెళ్తామని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మెడికోలకు స్టైఫండ్‌ను పెంచారు. ఆ తర్వాత జూడాలను చర్చలకు ఆహ్వానించారు. జూడాలు చేసిన డిమాండ్‌లో కళాశాలలు,అనుబంధ ఆసుపత్రుల్లో మౌలికసదూపాయాలు పెంచుతామని మంత్రి హామీనిచ్చారు. స్టైఫెండ్‌ను పెంచడం,స్టైఫెండ్‌ను రెగ్యులరైజేషనుకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బిఆర్‌ఒ) జారీ, సీనియర్ రెసిడెంట్ల,గవర్నమెంట్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదవీకాలాన్ని పొడిగించారని, అలాగే రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు, ఆస్పత్రులలో వసతులు, మౌలిక సదుపాయాల కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతోనే తాము సమ్మెను విరమిస్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం డాక్టర్ జె.ఇసాక్ న్యూటన్ వెల్లడించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. హౌస్ సర్జన్ మెడికల్ రూ.రూ.29,792, పిజి డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.67,032, సెకండ్ ఇయర్‌కు రూ.70,757, ఫైనల్ ఇయర్‌కు రూ. 74,782 చొప్పున స్టైఫండ్ అందనుంది. ఇక సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.1,06,461,సెకండ్ ఇయర్‌లో రూ.1,11,785, ఫైనల్ ఇయర్‌లో రూ.1,17,103, ఎండిఎస్‌లో ఫస్ట్ ఇయర్‌లో రూ. 67,032, సెకండ్ ఇయర్‌లో రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.74,482, సీనియర్ రెసిడెంట్స్‌కు గౌరవ వేతనం రూ. 1,06,461 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## పదవీకాలం పొడిగింపు
(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రభుత్వ వైద్య కళాశాల, టీచింగ్ ఆస్పత్రులు, నర్సింగ్, డెంటల్ కాలేజీలలో పలువురు విధులను నిర్వర్తిస్తున్నారు. ఇందులో టీచింగ్ ఫ్యాకల్టీ, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డిఇఒలు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉన్నారు. డైరక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

## 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ'
(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రియల్ (గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్‌జిఎస్ విఎ) రూ.2.77 లక్షలకు చేరింది. ఇంధన వినియోగంలో 15.6 శాతం,జిఎస్‌టి వసూళ్లలో 9.8 శాతం, పే రోల్ ఎన్ రోల్ మెంట్స్‌లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది' అని వివరించారు.

**ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రంగా ప్రత్యేక జోన్లు...**
'తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి. 51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్ ను అభివృద్ధి చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్‌ఆర్‌ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం' అని చెప్పారు.'మేం అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదు. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నాం. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్‌ఎంఈలు ప్రారంభమయ్యాయి. మన జీఎస్ డీపీలో ఎంఎస్ ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు డా.సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటిఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సమగ్ర సాంస్కృతిక విధానంపై నేడు సదస్సు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలని రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల సదస్సు ఈనెల 30వ తేదీన హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబ శివ రావు, ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ఇప్టా నాయకులు కందిమళ్ళ ప్రతాప రెడ్డి, సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెలక్క కళారంగ ప్రముఖులు, కవులు, కళాకారులు పాల్గొంటారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పల్లే నర్సింహా తెలిపారు.

## ‘ఆలయ నిర్మాణం’ పుస్తకాన్ని ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : శిల్పాగమ శాస్త్రాలను అనుసరించి, ఆలయ నిర్మాణ పద్ధతులను, డిజైన్లతో సహా రచించిన ‘ఆలయ నిర్మాణం’ పుస్తకాన్ని ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. భూ పరీక్ష నుంచి ప్రతిష్ఠ వరకు గల వివిధ నిర్మాణ దశలు, ఉపపీఠం నుంచి కలశం వరకు, గర్భాలయం నుంచి గోపురం వరకు వివరాలతో పాటు చిత్రాలను కూడా పొందుపరిచిన రచయిత డాక్టర్ పి. సుబ్రమణి, సంపాదకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిలను, ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డిని వేం నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం దేవాదాయ శాఖ, టిటిడి దేవస్థానాలు, ఇంకా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయ నిర్మాణ శిల్పులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఆగమ, శిల్పా శాస్త్రాల్లోని విషయాలతో పాటు, ఆలయ వివిధ భాగాలను ప్రమాణ సహితంగా వేసిన చిత్రాలు తెలుగు శిల్పలకు అందుబాటులోకి తేవాలని ఈ పుస్తకం ముద్రించినట్లు మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శిల్పి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# అధికారం కోసమే బిజెపి దైవ జపం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/ నేలకొండపల్లి : అధికారం కోసమే బిజెపి రామ జపం, దైవ జపం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. దేవుని మాటున ప్రజలను వంచిస్తూ మతం పేర ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తుందన్నారు. బిజెపికి అధికార యావ తప్ప దేశభక్తి అసలే లేదని కూనంనేని స్పష్టం చేశారు. సిపిఐ నేలకొండపల్లి మండల 17వ మహాసభ ఆదివారం మండల పరిధిలోని ముటాపురం గ్రామంలో జరిగింది. సీతారాములు, అశోక్, తాళ్లూరి శ్రీమతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో కూనంనేని మాట్లాడుతూ దేశం కోసం బిజెపి ఏమి చేసిందో చెప్పాలన్నారు. 2002 వరకు జాతీయ జెండాను గౌరవించని బిజెపి దేశం గురించి మాట్లాడటం అక్షేపనీయమన్నారు. దేశం కోసం పేదల అభ్యున్నతి కోసం సంక్షేమం, హక్కుల కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని త్యాగాల చరిత్ర కమ్యూనిస్టుల స్వంతమన్నారు మోడీ రైతు, కార్మిక వ్యతిరేకి అని కార్పొరేట్ల కోసమే మోడీ ప్రధానిగా పని చేస్తున్నారని కూనంనేని తెలిపారు.

**సంపద సృష్టించాలి :**

రాష్ట్రాన్ని పాలించిన గత పాలకులు అప్పులు చేశారని అందువలన అభివృద్ధి, సంక్షేమం ఆశించిన స్థాయిలో జరగదని అనడం సరికాదని కూనంనేని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అధికారానికి ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మావోయిస్టులను హత మార్చడం రాజ్యహింస అని దీనిని అమిత్‌షా లాంటి నేతలు ప్రోత్సహించడం అమానుషమన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని కూనంనేని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శత వసంతల ముగింపు సందర్భంగా ఐదు లక్షల మందితో చారిత్రిక సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, సిద్దినేని కర్ణకుమార్, కర్నాటి భానుప్రసాద్ తదితరులు ప్రసంగించగా అజ్మీర రామ్మూర్తి, మిడికంటి వెంకటరెడ్డి, తోట రామాంజనేయులు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, పాల్తీయా శ్రీను, రాంకోటి తదితరులు పాల్గొన్నారు. మల్లేబోయిన ఉపేందర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

## ‘హైదరాబాద్‌లో మా మనుషులు ఉన్నారు.. కాసేపట్లో నిన్ను చంపేస్తాం’

రఘునందన్ రావుకు మావోయిస్టుల మరో హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్: ‘‘హైదరాబాద్‌లో మా మనుషులు ఉన్నారు.. కాసేపట్లో నిన్ను చంపేస్తాం’’ అంటూ బిజెపి మెదక్ ఎంపి రఘునందన్ రావుకు మరోసారి బెదిరింపు కాల్ వచ్చింది. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపకపోతే చంపేస్తామని అందులో మావోయిస్టులు పేర్కొన్నారు. తమ మనుషులంతా హైదరాబాద్‌లో ఉన్నారని.. దమ్ముంటే కాపాడుకోవాలని సవాల్ విసిరారు. కాగా, రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో రఘునందన్ కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఈ ఫోన్ కాల్ వచ్చింది. జూన్ 23న మొదటి బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో తెలంగాణ డిజిపితో పాటు సంగారెడ్డి, మెదక్ ఎస్‌పిలకు రఘునందన్ ఫిర్యాదు చేశారు. ఈ బెదిరింపు కాల్స్ క్షుణ్ణంగా దర్యాప్తు చేసిన పోలీసు శాఖ, ఆయనకు అదనపు భద్రత అవసరమని నిర్ణయించింది. ఈ మేరకు రఘునందన్ రావుకు అదనపు భద్రత కల్పించాలని మెదక్ జిల్లా ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే.. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రారంభం నిమిత్తం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చారు. అమిత్ షా రాష్ట్రంలో ఉన్న వేళ రఘునందన్ రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపుతోంది.

## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో సిపిఐ విజయానికి కృషి



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నరసింహ పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో సిపిఐ జెండా ఎగరవేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ అన్నారు. సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గం నాలుగవ మహాసభ ఆదివారం లాలాపేట్‌లోని నఫీజ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ జెండాను సీనియర్ నాయకులు సోమయ్య ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ఈ.టి. నరసింహ మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో సిపిఐకి ప్రాతినిధ్యం లేకపోవటం మూలంగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వివిధ రాజకీయ పార్టీలు అనేక తప్పుడు వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఏ సమస్య కూడా పరిష్కరించకుండా కోట్లాది రూపాయలు దండుకోవటం కోసం మాత్రమే కార్పొరేటర్లు పనిచేస్తున్నారని విమర్శించారు. సిపిఐ హైదరాబాద్‌లో లక్ష మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు విరామం లేకుండా రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతామన్నారు. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో సిపిఐ ప్రాతినిధ్యం కోసం ఇప్పటి నుంచే డివిజన్ల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు విశ్రాంతి లేకుండా పని చేస్తేనే ఫలితం దక్కుతుందన్నారు. చెరువులు, కుంటలు కబ్జాల మూలంగా హైదరాబాద్ నగరం చిన్న వర్షానికే ముంపునకు గురవుతుందన్నారు. మరోవైపు నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో నగరంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతుందన్నారు. పర్యావరణం పూర్తిగా దెబ్బ తినడంతో నివసించలేని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఈ.టి. నరసింహ సూచించారు. ఈ మహాసభకు నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, రాజశేఖర్ రెడ్డి, కొమురెల్లి బాబు, ఎం.డి.ఉమర్‌ఖాన్, సయ్యద్ గౌస్, శ్రీహరి, యాదగిరి, గౌరి నాగరాజ్, గడ్డం చందర్, సునీత, రాజు, కొండల్, వెంకటేశ్, హుస్సేన్, లెనిన్, రాములమ్మ,రూప, నాగమణి, పద్మ పాల్గొన్నారు.

## కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు



మల్లికార్జున ఖర్గే సభను జయప్రదం చేయాలి

హైదరాబాద్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జూలై 4న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 4న హైదరాబాద్‌కు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం గాంధీభవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎల దానం నాగేందర్, ఎంఎల్‌సిలు బలమురి వెంకట్, అమీర్ అలీఖాన్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్ కుమార్ యాదవ్, అజారుద్దీన్, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్‌గౌడ్, మెట్టు సాయి కుమార్, కాల్వ సుజాతతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క నియోజకవర్గం నుండి జన సమీకరణ చేపట్టాలన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను పార్టీ కోసం కష్టపడిన నాయకులతో భర్తీ చేస్తామన్నారు. దేవాలయ, మార్కెట్ కమిటీలు ఇతర నామినేటెడ్ పదవులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. జిహెచ్ ఎంసి ఎన్నికలకు ఇప్పటి నుండే సన్నద్ధం కావాలని, జిహెచ్‌ఎంసి మేయర్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయం చేసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఖాళీ స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, కొత్త రేషన్ కార్డులు కూడా వస్తున్నాయని, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఇప్పటి నుండి క్షేత్రస్థాయి ప్రణాళిక ద్వారా ముందుకు పోవాలని సూచించారు.

## ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా.. చంద్రశేఖర్ వేముల ఎన్నిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సి.ఎ. చంద్రశేఖర్ వేముల ఏకగ్రీవంగాఎన్నికైయ్యారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు సి.ఎ.హితేశ్ జైన్ అధ్యక్షతన జరిగిన వార్షిక సాధారణ సభలో 2025–2026 సంవత్సరానికి కార్యవర్గానికి ఎన్నికల అధికారిగా అమృత్ కుమార్ వ్యవహరించారు. నూతన అధ్యక్షులుగా సి.ఎ.చంద్రశేఖర్ వేములతో పాటు ఉపాధ్యక్షులుగా సి.ఎ.పివి.నారాయణ రావు, కార్యదర్శిగా సి.ఎ.ఆశిష్ జోషి, సంయుక్త కార్యదర్శిగా ఐటిపి అజయ్ కుమార్ భవలే, కోశాధికారిగా ట్యాక్స్ అడ్వకేట్ సోమేశ్వర్ నెమానిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సి.ఎ.చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ట్యాక్స్ బార్ అసోసియేషన్‌ను బలోపేతం చేయడం, కొత్త సభ్యులను చేర్చడం, వర్క్‌షాప్‌లు, సెమినార్‌ల ద్వారా విద్యా వేదికలను అందించడం, రెగ్యులేటరీ అధికారుల మధ్య వారధిగా వ్యవహరించడం, ప్రభుత్వ వేదికలపై ప్రోయాక్టివ్ పాత్ర పోషించడం, అసోసియేషన్‌కు మరింత గుర్తింపు తీసుక వచ్చేందుకు ప్రధాన లక్ష్యాలు అన్నారు. ఈ సభలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు సి.ఎ.రాందేవ్ భుటాడా, సి.ఎ.పూర్ణ చంద్ర రావు, ఐటిపి మధుసూదన్ బోజ్జా, సి.ఎ. వెంకట్ రామ్, తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారావు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## ఫోన్ ట్యాపింగ్‌కు ఆజ్యం పోసిందే కాంగ్రెస్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌కు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ అని, సిఎం ఆదేశాలతోనే బిఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం జరుగుతోందని బిఆర్‌ఎస్ నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పోలీసులు కాంగ్రెస్ కుట్రలో పావులు కావొద్దని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో అంతర్గత భద్రత, శాంతి భద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి సున్నితమై అంశంలో రాజకీయాలు తగవని, సిట్ అధికారులు, లేదా కమిషనర్ అవసరమైతే మీడియా సమావేశం ద్వారా వివరాలు చెప్పాలని సూచించారు. ట్యాపింగ్‌పై విచారణ చేస్తున్నది సిట్ అధికారులా?, లేదా గాంధీభవన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులా అని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ నిజంగానే ఫోన్ ట్యాపింగ్ నిబంధనలకు విరుద్ధంగా జరిగితే, ఆనాటి ఇంటెలిజెన్స్ డిజిపి, హోం శాఖ ముఖ్య కార్యదర్శిని ఎందుకు ప్రశ్నించడం లేదని, వారి పేర్లను ఎందుకు బయటకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కేవలం ఒక ప్రభాకర్ రావును మాత్రమే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని, ఆయన తన ప్రాణాలకు తెగించి ఎన్నో త్యాగాలు చేసి అవార్డులు, పథకాలు సాధించినందుకా అని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.

# పత్తి సాగుకే రైతన్న మొగ్గు



వరి తర్వాత కాటన్‌కే ప్రాధాన్యం

రెండవ పంటగా మొక్కజొన్న

ప్రజాపక్షం/ఖమ్మం : గతేడాది పత్తి సాగు చేసిన రైతులకు కష్టాలు, నష్టాలే మిగిలిన ఈ ఏడాది కూడా రైతాంగం పత్తి వైపే మొగ్గు చూపడం గమనార్హం. ఖమ్మం జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా వాణిజ్య పంటల్లో పత్తికే ప్రాధాన్యతనిస్తున్నారు. వరి సాగు తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తికే ప్రాధాన్యత లభిస్తుంది. ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే స్వల్పంగా తగ్గిన ద్వితీయ స్థానం మాత్రం పత్తికే దక్కింది. గతేడాది పత్తి దిగుబడులతో పాటు ధర కూడా రైతులను నష్టపరిచింది. అధిక వర్షాలకు ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి రాలేదు. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర ప్రకటించిన క్షేత్ర స్థాయిలో ఆ ధర అమలు కాలేదు. రక రకాల కొర్రీలు పెట్టి సిసిఐ పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరించింది. రైతాంగం దగ్గర నుంచి కొనుగోలు చేసేందుకు నిరాకరించిన సిసిఐ అధికారులు ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి మాత్రం అధికంగా పత్తిని కొనుగోలు చేశారన్న ఆరోపణలు వినవచ్చాయి. గతేడాది నష్టపోయిన రైతులు ఈ ఏడాది కూడా పత్తిని గణనీయమైన సంఖ్యలో సాగు చేయడం వెనక ప్రత్యామ్నాయ పంటల సాగు లేక పోవడమేనన్నది వాస్తవం. గతంలో పునాస పంటలుగా పెసర, మినుము, కంది, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారు. ఇప్పుడు అపరాల సాగు పూర్తిగా తగ్గిపోయింది. అననుకూల వాతావరణం కారణంగా అపరాలను సాగు చేసిన ఫలితం దక్కడం లేదు. అతివృష్టో, అనావృష్టో అపరాల పంటను దెబ్బతీస్తుంది. వరి సాగు తర్వాత రైతులు పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది మిర్చి సాగు తగ్గే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం క్వింటా రూ. 20వేల వరకు పలికిన మిర్చి గతేడాది క్వింటా రూ.10వేలకు మించి ధర పలక లేదు. ఇదే సమయంలో రెండేళ్ల క్రితంతో పోలిస్తే దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయింది. దిగుబడి తగ్గడం ధర లేకపోవడంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోసారి మిర్చి సాగు చేసేందుకు జంకుతున్నారు. మిర్చి సాగుకు జంకడం కూడా పత్తి వైపు మొగ్గు చూపేందుకు కారణమవుతుంది. పత్తి తర్వాత నవంబర్, డిసెంబర్ మాసాల్లో మొక్కజొన్న సాగుకు రైతు ఆసక్తి చూపుతున్నాడు. గడిచిన ఐదేండ్లుగా మొక్కజొన్న సాగు రైతాంగానికి లాభసాటిగా ఉంది. గతేడాది మరింత మంచి ఫలితాలను మొక్కజొన్న సాగు ఇచ్చింది. 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం రూ. 2200పైబడి ధర పలకడంతో మొక్కజొన్న లాభసాటిగా మారింది. ఈ ఏడాది కూడా యాసంగిలో మెట్ట పొలాల్లో మొక్కజొన్న సాగుకు రైతులు సంసిద్ధమవుతున్నారు. వరి తప్ప మరో సాగు చేయడానికి వీలులేని మాగాణి భూముల్లో రైతులు తిరిగి వరినే సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. లాభ నష్టా లు లేని పంటగా చెప్పుకునే వరి సాగు గతేడాది రైతులకు లాభాలను చేకూర్చింది. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఒకప్పుడు వరి దండగ అన్న భావనలోఉన్న రైతులు తిరిగి వరి సాగు వైపుకు మొగ్గు చూపుతున్నారు. కాకపోతే ఈ ఏడాది ఇప్పటి వరకు వాతావరణం ఆశాజనకంగా లేదు. ప్రధా న ప్రాజెక్టులైన నాగార్జున సాగర్ సహా అటు గోదావరి ఇటు కృష్ణా పరివాహక ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టులలో ప్రస్తుతానికి నీరు లేదు. జూరాల శ్రీశైలానికి వరద చేరిందన్న వార్తలు వచ్చిన ప్రాజెక్టులు నిండలేదు. తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరితే నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గోదావరి పరివాహక ప్రాజెక్టుల్లో కూడా నీరు చేరలేదు. భారీ, మధ్యతరహా, చిన్నతరహా నీటి ప్రాజెక్టులకు కూడా సాగు నీరు అందించేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. జులై మాసంలో భారీ వర్షాలు కురిస్తే వరి సాగుకు సమాయత్తమయ్యే అవకాశం ఉంది.

## బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి బిసిలకే ఇవ్వాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా జనాభాలో 60 శాతం ఉన్న బిసిలకే అవకాశం కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని బిజెపి పార్టీ ప్రకటించి, ఎన్నికల తరువాత బిజెపి శాసనసభ పక్ష నేతగా అగ్రకులాలకు చెందిన వ్యక్తికి అవకాశం కల్పించిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ఇప్పటి వరకు కూడా అగ్రకుల సామాజిక వర్గం వారికే రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు అప్పాచెప్పిందన్నారు. ఇప్పటికైనా బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బిసిలకు అవకాశం కల్పించి, భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తే బిసిని ముఖ్యమంత్రిని చేస్తామనే సంకేతం బిసిలకు ఇవ్వాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. తెలంగాణలో బిసి కులగణన జరగడం, కాంగ్రెస్ పార్టీ కూడా ఆ పార్టీ అధ్యక్షునిగా బిసిలకే అవకాశం కల్పించడం, ఇటీవల ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా బిసి ఎస్‌సి, ఎస్‌టిలకు అవకాశం ఇవ్వడానికి కారణమన్నారు. బిసిలలో రాజకీయ చైతన్యం రోజు రోజుకు గ్రామస్థాయి వరకు పెరిగిన విషయాన్ని బిజెపి అధిష్టానం పెద్దలు ఆలోచించాలన్నారు. రాజకీయ సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని బిజెపిలోని బిసి భావజాలం ఉన్న వ్యక్తికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా అవకాశం కల్పించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ బిజెపి అధిష్టానాన్ని కోరారు.

## దశాబ్దాల పోరాటానికి హైడ్రాతో రోజుల్లో పరిష్కారం



ఎల్లారెడ్డిగూడ పార్కులో ఆక్రమణలు తొలగించిన హైడ్రా

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝులిపిస్తోంది. ప్రభుత్వ స్థలాలు, చెరువులపై ఆక్రమణలను ఎక్కడికక్కడ కూల్చేస్తూ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోని మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఎల్లారెడ్డిగూడ పార్కులో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఆక్రమణలు తొలగించి 1533 గజాల విస్తీర్ణంలో పార్కును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సాయి సారధి నగర్ లేఔట్‌లో 1961 నుంచి ఆక్రమణలు ఉన్నాయని, సాయి సారధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు చేపట్టింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు ఆక్రమణలు తొలగించారు. 1961లో 5 ఎకరాల విస్తీర్ణంలో సాయి సారధి నగర్ పేరిట 35 ప్లాట్లతో లేఔట్ ఏర్పాటు చేశారని, 1533 గజాల స్థలాన్ని పార్కుగా చూపించారని అధికారులు నిర్ధారించారు. నారాయణ ప్రసాద్ వారసులు పార్కు స్థలంలో షెడ్డు వేసి, ఖాళీ చేయకుండా ఆక్రమణలో ఉన్న స్థలంలో లేఔట్ వేసినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేసుకొని ఇంటి నెంబర్ కూడా తెచ్చుకున్నట్లు తెలిపారు. ఈ లేఔట్‌లో 6 రోడ్లను అభివృద్ధి చేసి పార్కును మాత్రం ఖాళీ చేయించలేదని, పలుమార్లు జిహెచ్‌ఎంసికి కూడా ఫిర్యాదు చేసినట్లు స్థానికులు చెప్పారు. స్థానికుల ఫిర్యాదుతో క్షేత్ర స్థాయిలో వివిధ శాఖలతో కలసి పూర్తి స్థాయి విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు, కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. అనంతరం పార్కు స్థలంగా గుర్తించి, ప్రొటెక్టెడ్ బై హైడ్రా బోర్డు పెట్టారు. దశాబ్దాల పోరాటం హైడ్రాతో రోజుల్లో పరిష్కారం అయ్యిందంటూ స్థానికులు హైడ్రాకు కృతజ్ఞతలు చెప్పి, హర్షం వ్యక్తం చేశారు.



# సాహితీ విహారి

# బడుగుజీవి ఆత్మబంధువు...

'విప్లవాల యుగం మనది... విప్లవిస్తె జయం మనదె' అంటూ తన పోరాటతత్వాన్ని నలుదిశలా వెదజల్లిన చెరబండరాజు గురించి చెప్పాల్సింది ఏముంది? ఆయన రచనల్లో సైద్ధాంతిక జ్వాలను వెతకాల్సిన పనేముంటుంది? జాగ్రత్తగా చూడండి.. కష్టజీవుల చెమటలో.. శ్రామికుల శక్తిలో... సామాన్యుడి శ్వాసలో ఇమిడిపోయి కనిపిస్తాడు. దోపిడిపై ధిక్కార స్వరమై వినిపిస్తాడు. రైతన్నల స్వేదంతో తడిసిన భూమి నుంచి పుట్టుకొచ్చిన ప్రతి మొలకలోనూ తానై ఉంటాడు. దారిద్ర్యం ఉన్నంతకాలం... ఆకలి కేకలు వినిపిస్తున్నంతకాలం... లేనివాడిని ఉన్నవాడు దోచుకుతింటున్నంతకాలం చెరబండరాజు బడుగుజీవుల కళ్లల్లో ఆశాకిరణమై మెరుస్తునే ఉంటాడు. చెరబండరాజు... ఒక అక్షరయోధుడు. అతనిది రక్తంతో రాసిన కథ కాదు.. సమస్యలపై నినదించిన అక్షర విప్లవం. గూడు కోల్పోయి... గుండె జారిపోయి.. నిలువునా కుంగిపోతున్న వారికి ఓదార్పునిచ్చే ఆపన్న హస్తం. చెరబండరాజు అంటేనే ధైర్యం కోల్పోయి, దైన్యం నింపుకున్న గళాలను అక్షరాల్లో ఇముడ్చుకున్న పోరాటం. వివేకానికి ఓ సైనికుడు. సమాజ చైతన్యానికి రక్షకుడు. అతనికి అక్షరాలే ఆయుధాలు.. భావనలే బాణాలు. చెరబండరాజు రచనలు అతనికి విజయతిలకం అద్దుతాయి. అందుకే ఆయన చరిత్ర రక్తాక్షరాలతో లిఖించిన శిలా శాసనం. అతను రెప్పల వెనుక దాగిన స్వప్నాలని గుర్తించగలడు. భ్రాంతులపై సత్యాన్ని గెలిపించగలడు. నిరాశ గూటిలోంచి ఆశల పక్షికి, పోరాటాల రెక్కలు తొడిగే ధీరుడు. గీతాల గలగలలే చెరబండరాజు పోరాట రేచుక్కలు. అక్షరాన్ని విస్ఫోటనంలా పేల్చగలిగే శక్తి ఉంది కాబట్టే, చెరబండరాజు ఆధిపత్య వర్గాలకు కాలభైరవుడు. చెరబండరాజు.. దోపిడీ వర్గాలకు వెన్నులో చలిపుట్టించే పేరు. పీడిత, తాడిత వర్గాలకు గొంతుకైన రూపు. అణచివేతపై ధిక్కారం.. సామాజిక రుగ్మతలపై ప్రశ్నించే గుణం... దోపిడీ వర్గాలను నిలదీసే నైజం ఆయనకే సొంతం. ఆయన గీతాలు అగ్ని కెరటాలై ఉవ్వెత్తున ఎగసిపడతాయి. అన్యాయంపై అలుపెరుగని పోరాటం సాగిస్తాయి. అతని రచనలు చదవాలంటే నిజాన్ని నిర్భయంగా అంగీకరించే ధైర్యం ఉండాలి. ఆ రచనలు సృష్టించే మేధోకల్లోలాన్ని తట్టుకునే గుణం ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, అసలుసిసలైన మనిషై ఉండాలి. దిగంబర కవుల్లో ఒకడైన చెరబండరాజు (బద్దం భాస్కర్ రెడ్డి) భౌతికంగా జీవించింది 38 సంవత్సరాలు మాత్రమే. కానీ, తన రచనలతో తరతరాలకు మార్గదర్శకుడయ్యాడు. కష్టం ఒకడిది... భోగం మరొకరిదిగా కొనసాగుతున్న తరతరాల దుర్మార్గాన్ని...

'కొండలు పగిలేసినం, బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు గట్టినం
శ్రమ ఎవడిదిరో, సిరి ఎవడిదిరో' అంటూ నిలదీశాడు. శ్రమ దోపిడీని ఎదిరించాడు. ఎవరి భుజాల మీద ఎవరెక్కి కూర్చున్నారో మన కళ్లకు కట్టాడు.

'బంజర్లను నరికినం, పొలాలనూ దున్నినం
మా చెమటలు ఏరులుగా పంటలు పండించినం
గింజెవడిదిరో, గంజెవడిదిరో' అని రైతన్న ఆవేదనను అర్థవంతంగా ఆవిష్కరించాడు. ఈ వాక్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎన్ని విశేషణాలు జోడించినా కరువే.



> ఒక గురజాడ, ఒక శ్రీశ్రీ... ఒక ఆరుద్ర, ఒక చెరబండరాజు... ఇలాంటి మహా దార్శనికులు.. ప్రేరణకర్తల గురించి ఎన్నిసార్లయినా మాట్లాడుకోవచ్చు... వారి రచనలను ఎంత లోతుగానైనా విశ్లేషించుకోవచ్చు. వారి సాహితీ భాండాగారం ఎన్నటికీ తరగదు. వారి రచనల పరిమళాలు ఎప్పటికీ ఇగిరిపోవు. అందుకే చెరబండరాజును ఆయన వర్ధంతి సందర్భంగా తలచుకోవడం, రచనలను ప్రస్తావించుకోవడం 'చర్విత చర్వణం' కానేకాదు. ప్రతిసారీ ఆయన కవితా ఝరిలో నుంచి కొన్ని అక్షరాలను మాత్రమే తీసుకోగలుగుతాం. ఎందుకంటే అది అనంతం. ఇది నిజం. ముమ్మాటికీ ఇదే నిజమైన నిజం.

'మగ్గాలను పెట్టినం, పోగు పోగు వడికినం
మా నరాలె దారాలుగ గుడ్డలెన్నొ నేసినం
ఉడుకెవడిదిరో, వణుకెవడిదిరో' అని నేతన్నల ఆవేదనను వర్ణించినా, 'యంత్రాలను తిప్పినం, ఉత్పత్తులు పెంచినం
మా శక్తే విద్యుత్తుగ ఫ్యాక్టరీలు నడిపినం
మేడెవడిదిరో గుడిసెవడిదిరో' అంటూ శ్రామికుల కష్టాన్ని కళ్లకు కట్టినా, అది చెరబండరాజు కలమే అవుతుంది. అందుకే ఆయన మాటలు నినాదాలయ్యాయి. కవితలు నిత్యస్మరణీయాలయ్యాయి. నిజానికి చెరబండరాజు గురించి కొత్తగా చెప్పడానికి ఏముంది? ఏ కష్టజీవి చెమట చుక్కను తట్టినా తెలుస్తుంది. ఏ రైతన్న నాగలిని కదిలించినా చెప్తుంది. ఏ మగ్గం దారపుపోగును స్పృశించినా వివరిస్తుంది. ఎర్ర జెండా.. కమిలిన గుండె.. ఎక్కడ చూసినా చెరబండరాజే కనిపిస్తాడు. అన్యాయాలను కడిగేస్తాడు. అక్రమాలకు వ్యతిరేకంగా నినదిస్తాడు. ఎన్నాళ్లీ దోపిడీ అంటూ గర్జిస్తాడు. నిజం చెప్పాలంటే, అణచివేత మిగిల్చిన గుండె మంట రగిలిరగిలి ఎగసిపడే అక్షర దావాలం 'చెరబండరాజు' గీతాల రూపాన్ని సంతరించుకుంటుంది. చెరబండరాజు.. కష్టాల కడలి కడుపు మీటినవాడు. తిరుగుబాటు కెరటాలపై లేచినవాడు... ప్రజలను మేల్కొల్పిన వాడు.... ప్రజల గొంతుకైనవాడు... మానవ హక్కుల కోసం పరితపించిన వాడు... సమసమాజం కోసం పలవరించిన వాడు. ఉద్యమాలకు ఊపిరిపోసి, పోరాట నెగళ్లు రగిలించే శక్తి అతని కలానికి ఉంది. అతను తాడిత, పీడిత, పేదల ప్రతినిధి. అతని ప్రతి మాటా ఓ నిప్పు కణిక. ప్రతి గీతం అణగారిన వర్గాల ఆశాదీపం. దేశాన్ని పట్టిపీడిస్తున్న ఎన్నో సమస్యలు.. మరెన్నో రుగ్మతలను చెరబండరాజు నిప్పులు చెరిగాడు. దేశ దుస్థితిని చూసి...

'ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన
అందం నీది సంపన్నుల చేతుల్లో మైమరిచి నిద్రిస్తున్న
యవ్వనం నీది' అంటూ బాధపడ్డాడు. న్యాయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతున్నదని ఇటీవల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. న్యాయమూర్తులు లంచావతారులుగా మారిన వైనాన్ని మనం ఇప్పుడు చూస్తున్నాం. కానీ, ఈ న్యాయ వ్యవస్థ తీరుతెన్నులను చెరబండరాజు అర్ధశతాబ్దం క్రితమే ప్రశ్నించాడు, 'నన్నెక్కనివ్వండి బోను' కవితలో.

'మనిషిమీద నమ్మకం పోగొడుతున్న మీరు
దేవుడిమీద ప్రమాణం చేయమంటారెందుకు?
దోషికి నిర్దోషికి ఒకటే సూత్రం
వల్లించిందే వల్లించి వాదిస్తారు
ఫీజు కుడితి కుండలో
న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు
మీ ఉద్యోగాలకు ప్రమాణాలేమిటి?' అంటూ తనను బొనెక్కనివ్వమని అంటాడు. కలాలు కాగితాలు సర్దుకొని, లా బుక్కుల్లో తన సందేహాలు రాసుకోవాలంటాడు.

'న్యాయానికి దేశాలేమిటి? యెల్లలేమిటి?
మనిషీ, రక్తం ప్రాణం ముఖ్యం
లింగ భేదాలు వాదాలు తప్పితే
మందిర్, మస్జిద్, చర్చి,
మతాధికారుల మతాలు యెందుకు?
ఆకలి, కామం, కలలూ, కన్నీళ్లు
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మ యెవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే' అని తేల్చిచెప్తాడు. సమాజంలో అడుగడుగునా కనిపించే మూఢ నమ్మకాలను ఉద్దేశించి..

'మూఢనమ్మకాల ఉక్కు కౌగిళ్లలో
నంగనాచి నాయకుల దొంగ వేషాల్లో నలిగే కృంగే జనం
కళ్లగంతలు చించుకొని బయటికి రావాలి
మహావ్యవస్థ రూపొందించని నాయకులు
జనాన్ని జేజమ్మలుగా వాజమ్మలుగా
పురుగులుగా వెధవలుగా ఎట్లా దిగజార్చారో
ఒక్కసారి వెన్నుతట్టి కళ్ళారా చూపించాలి' అంటూ 'యాభై కోట్ల మంటలు' కవితలో మండిపడతాడు. కర్తవ్య బోధ చేస్తాడు. అదే విధంగా

'చీకటి బజారు జలగల్ని
రాజకీయ బొద్దింకల్ని
పదవీ మదాంధుల్ని
సాహిత్య వందిమాగధుల్ని
అభయహస్తంతో కాపాడే కంకణం కత్తుకున్నారు
నిర్వీర్యాన్ని దేశం నలుమూలలా
కాలవలనిండా పారిస్తున్నారు
భయంకర కుష్ఠ సంస్కృతిని దేశమంతా పంచుతున్నారు' అంటూ బాబాలు... మతాధీశులనూ కడిగిపారేస్తాడు. 'జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త' అని హెచ్చరిస్తాడు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' కవితలో

'మహోన్నత మానవత్వపు సూర్యోదయాన్ని
ఆదిలోనే అడ్డుకొనే
మానవ చరిత్రనిండా మారణహోమాలు రేపిన
మనిషి మనిషిని క్రూరంగా విడదీసిన
హేతురహిత అశాస్త్రీయ
జాతిమతాల్నొప్పుకునే
విషపానీయ సేవ్యం వద్దు
అక్కడ అన్నదమ్ముల ప్రసక్తి వద్దు' అంటూ జీవిత సత్యాన్ని విప్పిచెప్తాడు.

'ఏ దేశపు సంపదైనా
పుట్టిన పుట్టబోయే బిడ్డల జన్మహక్కుగా
సమ సమానంగా వితరణ చెందాల్సిందే
ఒక్కొక్కడూ ఒక్కో మృగరాజై
నక్కల తోడేళ్ళ డొక్కలు చీల్చి రక్తంలో
త్రివర్ణపతాకం ఆసాంతం ముంచి రంగు మార్చాల్సిందే' అని కర్తవ్యబోధ చేస్తాడు. ఒకటి రెండని ఏమిటి? ఇలా చెప్తూ పోతే చెరబండరాజు కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం ఒక మహాగ్రంథంలా గోచరిస్తుంది. మార్గదర్శనిగా సాక్షాత్కరిస్తుంది. 1944లో జన్మించి... తీవ్ర అనారోగ్యంతో 1982 జులై 2న మనకు దూరమైన చెరబండరాజు 'కనలి కనలి చావవద్దు' అని కష్టజీవులను కోరాడు. 'శ్రమజీవుల శక్తి ముందు ఏ శక్తులు నిలువగలవు' అని ప్రశ్నిస్తూ, ప్రతి బాధిత గుండెనూ జాగృతం చేశాడు. 'కష్టజీవుల నెత్తురెరుపూ.. కమ్యూనిస్టు జెండ ఎరుపూ... దోపిడీ లేనట్టి బతుకులకెవడు ఆయుధమెత్తినాడో వాడి మాటలు ఎరుపు ఎరుపూ.. వాడి చేతలు ఎరుపు ఎరుపూ' అంటూ 'ఊపిరి' కవిత సాగుతుంది. మహాకవి శ్రీశ్రీ తన 'మరోప్రస్థానం' కావ్యాన్ని చెరబండరాజుకు అంకితమిచ్చాడంటే, శ్రమజీవుల కవిగా అతని విలువ ఏమిటో అర్థమవుతుంది. ప్రజాసాహిత్యం చెరబండరాజు చెంతచేరి మురిసిపోయింది. జనంపాట ఆయన కలం నుంచి జాలువారి సార్థకతను పొందింది.

– బిఎల్

## చదవాల్సిన పుస్తకం

### అమృతం కురిసిన రాత్రి..

ఎంపిక చేసుకునే గుణం... ఏరుకునే ఓపిక ఉండాలేగానీ 'అమృతం కురిసిన రాత్రి'లో ప్రతి అక్షరం వజ్రసమానమే. దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన ప్రతి పదం మనసుల్ని చీల్చి... మెదళ్లను తొలిచి ఆలోచింపచేసేదే. కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందిన ఈ కవితా సంకలనంతో కొన్నివేల అనుభూతులు... లక్షలాది కన్నీటి చుక్కలు... కోట్లకొద్దీ ప్రశ్నలు. అందుకే అజరామరమైంది. 'అమృతం కురిసిన రాత్రి' సంకలనంలోని మొదటి కవిత 'నా కవిత్వం'లో




'నా కవిత్వం కాదొక తత్వం
మరికాదు మీరనే మనస్తత్వం
కాదు ధనిక వాదం, సామ్య వాదం కాదయ్యా అయోమయం జరామయం' అంటూ తిలక్ తన సాహిత్య ఒరవడిని పరిచయం చేశాడు. కవిత స్వరూపమే కాదు... నిర్వచనం కూడా ఎప్పటికప్పుడు మారుతూ, విస్తృమవుతుందని, కాబట్టి ఛందస్సు సంకెళ్లను తెచ్చుకుంటేనే కవిత అచ్ఛమైన రూపం సంతరించుకుంటుందని అంటాడు. మరో సందర్భంలో 'ఈ నాటి కవిత చురుకైన ఆవేశాన్ని, సాంద్రతరమైన అనుభూతి వత్తిడినీ, సూక్ష్మమైన భావననీ, అనుసరించడానికి, తన స్థానాన్ని ప్రత్యేకించు కుంది... కవి దృష్టి నేడు ఒక లాంతరు పట్టుకొని నలు వైపులా వెళ్ళి ఓపికగా పరిశీలించడం లాంటిది కాదు. వస్తు స్వరూపాలకూ, సంఘర్షణలకూ, శక్తులకూ, కీలక స్థానం మీద శక్తి వంతమైన బ్యాట్రీ లైటు ఫోకస్ చెయ్యడం లాంటిది' అని తన ఆలోచనలను తేల్చిచెప్తా డు. ఈ ఆలోచనలే 'అమృతం కురిసిన రాత్రి'లో ఆవిష్కృతమవుతుంది. అవిత్వంలో అస్పష్టత పనికిరాదన్నాడు తిలక్. ఆధునిక పేరుతో తమకే డెలియని అస్పష్టపు అనుభూతిని, అర్థంలేని ఇమేజనరీలతో కలిపి, కలగాపులగపు వర్ణనలతో, చేతకాని అనుకరణలతో రాయడం తగదని హితబోధ చేస్తాడు. 'సైనికుడి ఉత్తరం' రెండో ప్రపంచ యుద్ధ సమయాన్ని దృష్టిలో ఉంచుకొని రాసినప్పటికీ, అందులో స్పృశించిన అంశాలు నేటికీ సజీవంగానే ఉంటాయి.

'నేనిదివరకటి నేను కాను
నాకు విలువల్లేవు
నాకు అనుభూతుల్లేవు
చంపడం, చావడం
మీసం దువ్వడం లాంటి అలవాటయ్యింది.
కనిపించే ఈ యూనిఫారం క్రింద
ఒక పెద్ద నిరాశ, అనాగరికత
బ్రిడ్జీ క్రింద నది లాగా రహస్యం గా వుంది.
వదల లేని మోపు ఊబిలాగా వుంది
నేనంటే నాకే అసహ్యం
అందుకే మరీ మరీ చంపుతాను, మరీ మరీ తాగుతాను
ఇంకేం చేసినా ఎవరూ ఒప్పుకోరు' అంటూ యుద్ధ సమయంలో ఒక సైనికుడి ఆవేదనను, ఎదుర్కొంటున్న సమస్యలను, చుట్టూ ముసురుకున్న పరిస్థితులను అద్భుతంగా వివరిస్తాడు. ఇక 'ఆర్త గీతం' ఒక హృదయ విదారక మైన కవిత. ఇందులో తిలక్ హృదయ వ్యధకు దారి తీసిన కారణాలు పాఠకుణ్ణి సైతం అత్యంత వేదనకు గురిచేస్తాయి.




'నా దేశాన్ని గూర్చి పాడ లేను,
నీ ఆదేశాన్ని మన్నించ లేను,
ఈ విపంచికకు శ్రుతి కలుప లేను
ఈ రోజు నాకు విషాద స్మృతి,
విధి తమస్సులు మూసిన దివాంధరుతి
నా ఎడద మ్రోడైన ఒక దుస్థితి.
నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను,
సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగును,
మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను' అంటూ బాధ వ్యక్తం చేస్తాడు.
తన వ్యధకు కారణాలను వివరిస్తూ...
'నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి
మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి..
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన
వంతెన కింద నిండుచూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని..
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ మురికికాల్వ పక్కన
నిద్రించిన మూడేళ్ల పసివాణ్ణి' అంటాడు. దైన్యాన్ని, అందుకు కారణమైన దోపిడీ వ్యవస్థను నిగ్గదీస్తాడు. అతను మూర్తీభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని, క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛిత్ శవాకార వికారుల్ని చూశాడు. ఇలా పుస్తకం మొత్తం తిలక్ కవితా హృదయం... మానవతా వాదం ఉట్టిపడతాయి. దోపిడీ వ్యవస్థలపై ప్రత్యక్ష దాడి చేస్తాడు. బల్లి.. ఫెరన్ మొక్క.. కీచురాళ్ల శబ్దం... అన్నీ తిలక్ తన చుట్టూ వున్న ప్రకృతిలోనే, తన అవేశాన్ని సూచన ప్రాయంగా వర్ణిస్తూ, సంకేతాల ద్వారా తన పారవశ్యాన్ని నిరూపిస్తాడు. తన అనుభూతివాదాన్ని చాటుకున్నాడు. ఆధునిక కవితా యుగంలో కావ్య వస్తువు పరిధిని విస్తృత పరచి సర్వ జీవిత తరంగాలకూ వ్యాపింప జేయడానికి నిరంతరం శ్రమించాడు. సంకుచితమైన జాతి మతాల సరిహద్దును చెరిపివేసే ప్రయత్నం చేశాడు. ఈ పుస్తకం చదవండి. 'అమృతం కురిసన రాత్రి'లో విహరించండి.

## పుస్తక పరిచయం

# 'వెలుగుల వెనుక' వేల్పుల అనుభవాలు..

అభ్యుదయ రచయిత వేల్పుల నారాయణ కథల సంపుటం 'వెలుగుల వెనుక' పాఠకులకు సింగరేణి కార్మిక బతుకుల్లో ముసురుకున్న చీకటి కోణాన్ని కళ్లకు కడుతుంది. రచయిత స్వయంగా సింగరేణిలో పనిచేసిన అనుభవం ఈ కథలకు సహజత్వాన్ని అద్దింది. బొగ్గు గనుల్లో పని చేసే శ్రామికుల బతుకులు బాగుపడాలన్న ఆకాంక్ష దాదాపు ప్రతి కథలోనూ ఆవిష్కృతమవుతుంది. మొత్తం 15 కథలు.. భూమి అడుగున పొరల నుంచి బొగ్గుగని కార్మికులు వెలికితీసే నల్ల వజ్రమే విద్యుత్ రూపంలో వెలుగులు నింపుతున్నది. కానీ, ఆ వెలుగుల వెనక ఎవరికీ తెలియని బాధలు, గాథలు... కష్టాలు, కన్నీళ్లు... నరక యాతనలు, భావోద్వేగాలు ఎవరికీ కనిపించవు. వాటిని పరిచయం చేస్తాయి కాబట్టే ఈ పుస్తకంలోని కథలు పాఠకుల హృదయాలను స్పృశిస్తాయి. వాస్తవాలు తెలుసుకునేలా ప్రేరేపిస్తాయి. స్పందించే మనసు ఉండాలేగానీ, బొగ్గుబావుల లోతుల్నేకాదు... అక్కడ పని చేస్తున్నవారి జీవన్మరణ పోరాటాలూ అనుభవంలోకి వస్తాయి. పెత్తందార్ల హూంకరింపులు... పేదరికపు ఆర్తనాదాల హోరు వినిపిస్తుంది. అధికారుల కరకుదనానికి చిక్కిశల్యమైన జీవితాలు పలకరిస్తాయి. ఒకటి రెండు మినహా, ఈ కథలన్నీ బొగ్గు గని కార్మికుల జీవితాలపై ఆధారపడినవే. రచయిత ప్రత్యక్షంగా చూసిన




ఘటనలే. ఈ పుస్తకం ముందుమాటలో డాక్టర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి చెప్పినట్టు, సింగరేణి బొగ్గు గనుల కార్మికుల జీవిత పోరాటాన్ని, వాళ్ల కుటుంబ పరిణామాలను, కార్మికుల పట్ల పైఅధికారులు, యాజమాన్యాలలోగల వ్యతిరేక ధోరణులు, కార్మికుల ఐక్యత, పోరాట శక్తి, గని ప్రాంతంలో స్త్రీ పురుష సంబంధాలు ఈ కథల్లో మరిచయమవుతాయి. మొదటి కథ 'అగ్గి రాజుకుంటుంది'లో గని కార్మికుల ఆరోగ్యం, వైద్యం పట్ల యాజమాన్య నిర్లక్ష్యం ప్రతిబింబిస్తాయి. అధికారులకు ఒక న్యాయం... కార్మికులకు మరో న్యాయం అనే ధోరణి కనిపిస్తుంది. 'మృత్యు కుహరం'లో కార్మికుల పని విధానం మాత్రమేకాదు... బొగ్గు గని బావుల్లో జరిగే ప్రమాదాలు, వాటి పరిణామాల అద్భుత వివరణ ఉంటుంది. 'నైలు నది నాగరికతలో సామాన్యుని జీవిన మెట్టిది, తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అన్న మహాకవి శ్రీశ్రీ కవితా సూక్తి, 'ఆ చల్లని సముద్ర గర్భం.. దాచిన బడబాలనమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' అన్న ప్రజాకవి దాశరథి కవితా సూక్తి బొగ్గుగని కార్మికులకు వర్తిస్తాయని రచయిత మాటలే, ఈ పుస్తకంలోని కథలకు పరిచయ వాక్యాలు. సింగరేణికి వేలకోట్ల రూపాయల లాభాలను ఆర్జించిపెడుతూ, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న కార్మికుల బాధాతప్త గాథలన్నీ తాను స్వయంగా చూసిన ఘటనలపై ఆధారపడినవేనంటూ వేల్పుల పాఠకులకు ఆ కథలను పరిచయం చేస్తారు. దీనిని కేవలం కథా సంకలంగా చూడడానికి వీల్లేదు. ఇది బొగ్గుగని కార్మికుల జీవితాల సమగ్రరూపం. శ్రామికులు చిందించే చెమటకు... గాయాలు స్రవించే రక్తానికి... దినదినగండంగా సాగే దుర్భర జీవితాలకు అద్దం పట్టే వాస్తవ చరిత్ర.




**పుస్తకం పేరు**

**వెలుగుల వెనుక (కథలు)**
**వెల : రూ.160**
**'అమృతం కురిసిన రాత్రి'**
**వెల : రూ.260**
**ప్రతులకు**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)**
**జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.**
**(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## ఈ వారం కవితలు

### ఇక్కడే... ఈ దేశంలోనే..

ఇక్కడే... ఈ పవిత్ర దేశంలోనే..
ఎంతమంది ఆడపడుచులు
వివస్త్రలయ్యారో? ఎందరి అభి'మానం'
మంటగలిసిందో?
ఎన్ని కంఠాలు ఉరితాళ్లకు వేల్లాడాయో!

ఇక్కడ.. ఈ ధర్మ రాజ్యంలోనే..
అధర్మం ఎంతగా వేళ్లూనుకుందో
దోపిడీ ఎంతలా పెరుగుతున్నదో?
మత ద్వేష వికృత రూపం
ఎంత విషం కక్కుతున్నదో?

ఇక్కడే.. ఈ కర్మ భూమిలోనే..
చెమటచుక్క రాల్చని
ధనవంతులు ఎందరో
కష్టాల కొలిమిలో కాలుతూ
సమస్యల ఊబిలో కాగుతూ



చావలేక.. చావురాక..
అల్లాడుతున్న బడుగుజీవలెందరో!

ఇక్కడే ఈ వేద పుడమిలోనే
విద్వేషాలు ఎలా బుసకొడుతున్నాయో
మత హత్యలు ఎలా పెరుగుతున్నాయో..
దేవుడినే అపహాస్యం చేస్తున్న
బాబాల బాగోతాలు ఎన్నో... ఎన్నెన్నో...

– ఎన్. మహాలక్ష్మి

### అరుణ దండాలు కామ్రేడ్ సుగుణమ్మ

జోహార్ జోహార్ సుగుణమ్మ
ఉద్యమ జోహార్లు సుగుణమ్మ
సాయుధ పోరులో కీలకంగా మారి
కమ్యూనిస్ట్ పార్టీకి అంకితమైనావు
అందుకో జోహార్లు సుగుణమ్మ
గుణమున్న కామ్రేడా సుగుణమ్మ
నువు ధనవంతుల బిడ్డవు సుగుణమ్మ
గుణవంతురాలువి సుగుణమ్మ

స్వాతంత్ర్య సమర యోధురాలా
తెలంగాణ సాయుధ
పోరు ధీరురాలానీ
త్యాగం అజరామరం
నీ సేవలు అమోఘం
అందుకో వందనాలు
కామ్రేడా సుగుణమ్మ
విప్లవాల తొలి పొద్దువు
అస్తమించిపోతివా..

నేల రాలిన తారవై నింగిలోన చేరితివా
ఎక్కడున్నవు సుగుణమ్మ
ఒక్కసారి వచ్చిపోవా

ఉద్యమాన్ని ప్రేమించి
ప్రాణాలకు తెగించి
పోరుపిడికిలెత్తినావు
పోరాటం చేసినావు
పండుటాకులా రాలిపోయి
శోకసంద్రంలో ముంచినావు

రహస్య స్థావరాన్ని
బాధ్యతగా చూసినావు
జంగ్ నడిపే దారిలోన
జైలు అనుభవించినావు
జై జై అంటూ నడిచినావు

సనాతన ధర్మాన్ని
సమతోన్మాద భూతాన్ని
అవినీతిని ఎండగట్ట
ముక్కలైన ఎర్ర జెండా
ఏకమవలంటివి పరితపిస్తుంటివి

మొదటి తరం యోధులతో
కలిసి పని చేసినావు
నమ్ముకున్న ఆశయాల
కడవరకూ మోసినావు
అమరజీవివి నీవు సుగుణమ్మ
సిఆర్ ఫౌండేషన్ అంటున్నది
అందరికీ ఆదర్శం నీవమ్మా..
ఎన్నటికీ మరువము నిన్నమ్మా

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

(తెలంగాణ సాధన పోరాట యోధురాలు కామ్రేడ్ సుగుణమ్మకు అక్షర నివాళి)

### ఆమె ఓడిపోలేదు



గెలుపును గుర్తించలేని సమాజం
ఓటమిని ఒప్పుకోలేని
ఆమె నిస్సహాయత
ప్రోత్సాహం అందించలేని
మిత్ర బృందం
మన అనుకోవడం తప్ప
చెయ్యందించలేని స్నేహం

ప్రేమగా మేమున్నామని
గుండెలకు హత్తుకునే
మనిషులు అరువై
చుట్టూ మానవత్వం కరువై
మనిషితత్వం చచ్చిపోయిందని తెలిసి

ఎడారిలో ఒంటరిగా నడుస్తూ
కవిత్వంతో సహవాసం చేస్తూ
తాను రచించే కథలో తానొపాత్రయై
తనను తాను నూతనంగా చెక్కుకుంటూ

శిథిలమైన గతాన్ని విడిచి
రేపటికి రెక్కలు తొడుగుకొని
వహ్వా అనిపించుకుంటున్న ఆమె
ఓడిపోలేదు నమ్మలేని ఒక నిజాన్ని
భుజాలపై మోస్తూ
మౌనానికి చెయ్యందించింది
తప్ప ఆమె ఓడిపోలేదు

వాసి జ్యోత్స్న
9866843005



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ప్రకృతి విలయాలతో పాక్ కకావికలం

### ఓ వైపు వర్షాలు, వరదలు మరోవైపు భూకంపం

**ఇస్లామాబాద్:** ప్రక్రియ విలయాలతో పాకిస్థాన్ కకావికలమవుతోంది. ఒకవైపు వర్షాలు, వరదలు ముంచేస్తుంటే, మరోవైపు భూకంపం వణికిస్తోంది. ఆదివారం తెల్లవారు జామున 3.30 గంటలకు బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి తమ ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. రరా షైమ్, ఖింగ్రీ, వాస్తు సహా అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం ధాటికి చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. బర్కన్ పట్టణం నుంచి 60 కిమీల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. కాగా, 5.5 తీవ్రతతో భూకం పం సంభవించినట్లు కొన్ని వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

**వర్షాలు వరదల్లో 38 మంది మృతి**

వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. 63 మందికి గాయాలయ్యాయి.ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 78 ఇళ్లు ధ్వంసం కాగా, 30 పశువులు చనిపోయినట్లు తెలిపింది. ఖైబర్ పఖ్‌తుంఖ్వా ప్రావిన్స్ పరిస్థితి దారుణంగా ఉందని, అక్కడ 19 మంది చనిపోగా, 41 మందికి గాయాలయ్యాయని వెల్లడించింది.

## విమాన ప్రమాదంలో కుట్ర కోణంపై దర్యాప్తు: కేంద్రం

**న్యూఢిల్లీ:** ఎయిరిండియా విమాన ప్రమాదంలో కుట్రకోణంపై కూడా దర్యాప్తు చేయిస్తున్నట్లు కేం ద్ర ప్రభుత్వం తెలిపింది. ఇటీవల గుజరాత్ రా ష్ట్రం అహ్మదాబాద్‌లో ఎఐ 171 విమానం కూలిపోయి 279 మంది మరణించిన ఘటనలో కుట్ర కోణంపై కూడా తాము దష్టి సారించామని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ చెప్పారు. ఈ విమాన ప్రమాదం కేసు ను ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూ రో దర్యాప్తు చేస్తోందని మంత్రి తెలిపారు. పుణేలో జరుగుతున్న ఓ సమావేశంలో మంత్రి మాట్లాడా రు. ప్రమాదం స్థలం నుంచి రికవరీ చేసిన బ్లాక్‌బాక్స్ ఎఎఐబి ఆధీనంలో ఉందని, విశ్లేషణ కోసం దానిని విదేశాలకు పంపబోమని స్పష్టంచేశారు. 'విమాన ప్రమాదంపై ఎఎఐబి పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. కుట్ర ఏదైనా ఉందా... అనే అం శంపై కూడా దష్టిపెట్టారు. సీసీటీవీ దశ్యాలను విశ్లేషిస్తున్నారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది అరుదైన కేసు. దర్యాప్తు నివేదిక వస్తే గానీ రెండు ఇంజిన్లు విఫలం అయ్యాయా... లేక ఇంధన సరఫరాలో సమస్య తలెత్తిందా అనేది తేలుతుంది. బ్లాక్ బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణ నిక్షిప్తమై ఉంది. నివేదిక మూడు నెలల్లో వస్తుంది. ఇప్పుడే దానిపై మాట్లాడటం తొందరపాటు అవుతుంది' అని మురళీధర్ చెప్పారు. విశ్లేషణ కోసం బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నారనే ప్రచారాన్ని మంత్రి కొట్టిపారేశారు. అది ఎక్కడికీ పోదని, దర్యాప్తు సంస్థల కస్టడీలోనే ఉందని చెప్పారు. దేశంలో వినియోగిస్తున్న 33 డ్రీమ్‌లైనర్ విమానాలను డీజీసీఏ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారని తెలిపారు. ప్రజలు భయపడటం లేదని, వారు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని అన్నారు.

## రోడ్డు పక్కన బుట్టలో నవజాత శిశువు

### 'ఆర్థిక పరిస్థితి బాగోలేదు క్షమించండి' అంటూ లేఖ

**ముంబై:** మహారాష్ట్రలోని నవీ ముంబైలో మూడు రోజుల నవజాత శిశువును ఒక ప్లాస్టిక్ బుట్టలో ఉంచి రోడ్డు పక్కన వదిలేశారు. 'మా ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇలా చేయాల్సి వచ్చింది. క్షమించండి' అంటూ ఒక నోట్‌ను అందులో ఉంచారు. ఆ శిశువును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే... పన్వేల్ ప్రాంతంలోని టక్కా కాలనీలో రోడ్డు పక్కన నీలిరంగు బుట్టలో మూడు రోజుల కిందట పుట్టిన నవజాత శిశువును తల్లిదండ్రులు వదిలేశారు. ఇంగ్లీషులో రాసిన నోట్ కూడా అందులో ఉంచా రు. తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, దీనివల్ల ఆడ బిడ్డను తాము పెంచలేమని పేర్కొన్నారు. తమకు మరో మార్గం లేక ఇలా చేయాల్సి వచ్చిందని, క్షమించాలని ఆ లేఖలో కోరారు. కాగా, రోడ్డు పక్కన నీలిరంగు బుట్టలో నవజాత శిశువు ఉండటం చూసి స్థానికులు షాక్ అయ్యారు. పోలీసులకు ఈ సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఆడపిల్లను స్వాధీనం చేసుకున్నారు. పిల్లల డాక్టర్‌కు చూపించగా ఆ శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల ఆడపిల్లను రోడ్డు పక్కన బుట్టలో వదిలేసిన తల్లిదండ్రుల కోసం వెతుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## పాకిస్థాన్ సైన్యానివి తప్పుడు ఆరోపణలు: భారత్ ఖండన

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో శనివారం జరిగిన ఆత్మాహుతి దాడి వెనుక భారత్ హస్తం ఉందని పాక్ సైన్యం చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ఆదివారం ఓ ప్రకటలో ఖండించింది. ఆ దాడితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. దాడి వెనుక తమ హస్తం ఉందంటూ పాకిస్థాన్ సైన్యం చేస్తున్నవి పూర్తిగా తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పాక్‌లోని ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం ఈ ఆత్మాహుతి దాడి జరిగిందని, ఈ దాడి నేపథ్యంలో భారత్‌పై నిందలు వేస్తూ పాకిస్థాన్ సైన్యం చేసిన అధికారిక ప్రకటన తమ దష్టికి వచ్చిందని విదేశాంగ పేర్కొంది. పాక్ సైన్యం ప్రకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేసింది. కాగా పేలుడు పదార్థాలున్న వాహనంతో ఓ ఉగ్రవాది ఆర్మీ కాన్వాయ్‌పైకి దూసుకెళ్లాడు. దాంతో వాహనంలో భారీపేలుడు సంభవించింది. 13 మంది పాక్ సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పౌరులు, ప్రభుత్వాధికారులు కలిపి మరో 24 మందికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, పాకిస్థాన్‌లోని తాలిబన్ హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్‌అల్‌హర్బ్ ఈ పేలుడుకు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

# ఉత్తరాదిలో భారీ వర్షాలు



### ఢిల్లీలో ముందస్తుగా రుతుపవనాలు
### ఉత్తరకాశీలో మేఘాల విస్ఫోటనం
### ముగ్గురు మృతి, ఏడుగురు గల్లంతు
### పలు రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండి

**న్యూఢిల్లీ/సిమ్లా/ఉత్తరకాశి :** ఈ ఏడాది రుతుపవనాలు సాధారణం కంటే దాదాపు వారం ముందుగానే దేశమంతటా వ్యాపించాయి. ఫలితంగా దేశ రాజధాని, ఇతర ఉత్తరాది రాష్ట్రాలలో వర్షాలు కురిశాయి. అనేక కొండ ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన మేఘాల విస్ఫోటనం కారణంగా ఇద్దరు నిర్మాణ కార్మికులు మరణించగా, ఏడుగురు గల్లంతయ్యారు. ఆది, సోమవారాల్లో ఉత్తరకాశీ, రుద్రప్రయాగ, డెహ్రాడూన్, తెహ్రీ, పౌరి, హరిద్వార్, నైనిటాల్‌తో సహా ఉత్తరాఖండ్‌లోని వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. యాత్రికుల భద్రత దృష్ట్యా అధికారులు చార్‌ధామ్ యాత్రను ఒక రోజు పాటు నిలిపివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని 12 జిల్లాల్లోనూ భారీ నుండి అతి భారీ వర్షాల కురుస్తాయని ఐఎండి రెడ్ అలర్ట్ జారీచేసింది. ఈ రాష్ట్రంలో ఈనెల 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి వర్ష సంబంధిత ఘటనల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లో మేఘాల విస్ఫోటనం కారణంగా సంభవించిన భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడి ఉత్తరకాశీ జిల్లాలోని యమునోత్రి జాతీయ రహదారి వెంబడి హోటల్ నిర్మాణంలో నిమగ్నమై ఉన్న కార్మికుల ఆశ్రయాలు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో కార్మికల శిబిరాలు హైవేకు దాదాపు 10 మీటర్ల దూరం కొట్టుకుపోయాయి. ఆ సమయంలో శిబిరాల్లో 29 మంది కార్మికులు ఉన్నారు. వారిలో ఇరవై మందిని సురక్షితంగా తరలించారు. తొమ్మిది మంది గల్లంతయ్యారని జిల్లా అత్యవసర ఆపరేషన్ సెంటర్ తెలిపింది. కొండచరియలు విరిగిపడిన ప్రదేశం నుండి దాదాపు 18 కి.మీ దూరంలో ఉన్న తిలాడి షహీద్ స్మారక్ సమీపంలోని యమునా నది ఒడ్డున తప్పిపోయిన ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీసినట్లు పోలీసులు తెలిపారు. ఆ కార్మికులు నేపాల్‌కు చెందినవారని చెబుతున్నారు.

**రంగంలోకి ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్**

ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది ఘటన స్థలంలో గాలింపు, రక్షణ చర్యలు చేపడుతున్నారని జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో హైవే మూసుకుపోయిందని, దీంతో యమునోత్రి నుండి తిరిగి వస్తున్న యాత్రికురు సురక్షిత ప్రదేశాలలో ఉండాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ముందు జాగ్రత్త చర్యగా చార్‌ధామ్ యాత్రను ఒక రోజు వాయిదా వేశామని, సోమవారం మార్గాల్లో వాతావరణ పరిస్థితులను సమీక్షించిన తర్వాత తదుపరి ప్రయాణంపై నిర్ణయం తీసుకుంటామని గర్హ్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో రాత్రిపూట కురిసిన వర్షాల కారణంగా బండరాళ్లు, చెట్లు పట్టాలపై పడటంతో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద అయిన సిమ్లా–కల్కా రైలు మార్గంలో సేవలు ఆదివారం నిలిపివేశారు. సోలన్‌లోని బరోటివాలా పారిశ్రామిక ప్రాంతంలోని ఒక వంతెన కూడా కొట్టుకుపోయింది. సిమ్లా, చండీగఢ్‌లను కలిపే సిమ్లా–కల్కా జాతీయ రహదారి (ఎన్‌హెచ్5)లోని కోటి సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డులోని కొన్ని ప్రాంతాలు దెబ్బతిన్నాయి. ఫలితంగా గంటల తరబడి రెండు నుండి మూడు కి.మీ.ల వరకు ట్రాఫిక్ స్తంభించింది. జిల్లాలోని బద్ది ప్రాంతంలో ఉన్న బాల్ద్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఝద్మజ్రీలోని శివాలిక్ నగర్‌లోని 20 ఇళ్లలోకి నాలుగు అడుగుల వరకు నీరు ప్రవేశించినట్లు వార్తలు వస్తున్నాయి. మండిలోని జుని ఖాడ్, బియాస్ నదిలో నీటి మట్టం పెరిగింది. నది ఒడ్డుకు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని స్థానిక పరిపాలన ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పండో ఆనకట్ట ఐదు స్పిల్‌వే గేట్లను ఆదివారం ఉదయం తెరవడంతో బియాస్ నదిలో నీటి మట్టం పెరిగింది. బిలాస్‌పూర్, చంబా, హమీర్‌పూర్, కాంగ్రా, కులు, మండి, సిమ్లా, సోలన్, సిర్మౌర్ మరియు ఉనా 10 జిల్లాల్లో సోమవారం వరకు ఒక మోస్తరు నుండి అధిక వరద ప్రమాదం ఉందని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరించింది.

**2020 తరువాత ఇదే తొలిసారి**

ఐఎండి అంచనా ప్రకారం... 2020 నుండి రుతుపవనాలు మొత్తం దేశాన్ని కవర్ ఇదే తొలిసారి. ఆ ఏడాదిలో జూన్ 26 నాటికి రుతుపవనాలు దేశ వ్యాప్తంగా విస్తరించాయి. జూన్ 27 సాధారణ తేదీ కంటే రెండు రోజుల తర్వాత రుతుపవనాలు ఢిల్లీలోకి ప్రవేశించాయని ఐఎండి తెలిపింది. ''రుతుపవనాలు ఆదివారంనాడు రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, హర్యానాలోని మిగిలిన ప్రాంతాలకు, మొత్తం ఢిల్లీకి మరింతగా విస్తరించాయని ఐఎండి ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర వాతావరణ శాఖ ప్రకారం, ఆదివారం ఉదయం 8.30 గంటలకు ముగిసిన గత 24 గంటల్లో చండీగఢ్‌లో 119.5 మి.మీ. వర్షం కురిసింది. పంజాబ్‌లోని ఇతర ప్రదేశాలతో పాటు, ఫిరోజ్‌పూర్, మొహాలి, లూథియానా, పాటియాలా, పఠాన్‌కోట్, రూప్‌నగర్‌లలో వర్షాలు కురిశాయి.

వాయువ్య, మధ్య, తూర్పు, ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో రాబోయే ఏడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. జులై 1 వరకు జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి ఆదివారం రెడ్ అలర్ట్ జారీ చేసిందని ఒక అధికారి తెలిపారు.

జార్ఖండ్ రాజధాని రాంచీలో జూలై 2 ఉదయం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అధికారి తెలిపారు. రాష్ట్రంలోని తూర్పు సింగ్‌భూమ్ జిల్లాలోని భారీ వర్షం కారణంగా నీట మునిగిన ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలో చిక్కుకున్న కనీసం 162 మంది విద్యార్థులను ఆదివారం పోలీసులు రక్షించారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆదివారం విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా పరిపాలన అధికారులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. జూన్ 1 నుండి 28 వరకు జార్ఖండ్‌లో 80 శాతం అదనపు వర్షపాతం నమోదైంది వర్షాధారణ వ్యవస్థ సాధారణంగా జూన్ 1 నాటికి కేరళపై ప్రారంభమై జూలై 8 నాటికి మొత్తం దేశాన్ని కవర్ చేస్తుంది. ఇది సెప్టెంబర్ 17 నాటికి వాయువ్య భారతదేశం నుండి తిరోగమనం ప్రారంభమవుతుంది, అక్టోబర్ 15 నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటుంది. ఈ సంవత్సరం, రుతుపవనాలు మే 24న కేరళకు చేరుకున్నాయి, 2009లో మే 23న వచ్చినప్పటి నుండి భారత ప్రధాన భూభాగంపై ఇది తొలిసారి.

## విజిలెన్స్ చర్యను ప్రశ్నించిన ఎమ్మెల్యేపై ఐదేళ్ల సస్పెన్షన్ వేటు



**చండీగఢ్:** మాజీ ఐపిఎస్ అధికారి, అమత్‌సర్ నార్త్ ఎమ్మె ల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ నుంచి ఐదేళ్ల పాటు స స్పెండ్ చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే కారణంగా పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. అకాలీదళ్ సీనియర్ నేత బిక్రమ్ మజిథియాపై విజిలెన్స్ కేసు వ్యవహారంలో ఆప్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై విజయ్ ప్రతాప్ బహిరంగ విమర్శలు చేసిన క్రమంలో ఆయనపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. దాడుల సమయంలో మజిథియా భార్య విజిలెన్స్ టీమ్‌తో గొడవ పడుతున్న వీడియోను సోషల్ మీడియాలో విజయ్ ప్రతాప్ పోస్ట్ చేశారు. విజిలెన్స్ ఆపరేషన్ తీరుపై విమర్శలు గుప్పించారు. 'మజిథియా జైలులో ఉన్నారు. ఆయనపై ఎలాంటి ఇన్వెస్టిగేషన్ చేపట్టలేదు. ఆయనను ప్రశ్నించడం కూడా జరగలేదు. ఆయన బెయిల్ పొందేందుకు అనుమతించాలి' అని అన్నారు. మజిథియా నివాసంపై తెల్లవారుజామున దాడులు జరగడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. రాజకీయ వేత్త అయినా, నటుడయినా, డబ్బున్న వాడు, పేదవాడు, మిత్రుడు, శత్రువు ఇలా ఎవరైనా కావచ్చు... ప్రతి కుటుంబానికి ఒక గౌరవం అంటూ ఉంటుంది. ఉదయమే ఇంటిలోకి చొరబడం తప్పు... అనైతికం... అని ఆయన తన ట్వీట్‌లో ఖండించారు. ఎవరు అధికారంలోకి వచ్చినా రాజకీయ కారణాలతో పోలీసులను, విజిలెన్స్ శాఖలను దుర్వినియోగం చేస్తున్నారని విజయ్ ప్రతాప్ ఆరోపించారు. సొంత ప్రయోజనాలకే ఆయా విభాగాలను వాడుకుంటున్నారనేది నిజమని, ఇందువల్ల ఎవరూ ప్రయోజనం పొందలేరని వ్యాఖ్యానించారు. దీంతో ఆయనపై ఆప్ చర్యలకు దిగింది. తద్వారా పార్టీలో అసమ్మతిని ప్రోత్సహించేది లేదని, ముఖ్యంగా పంజాబ్‌లో డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంశ చాలా కీలకమని, పార్టీ విధానమే శిరోధార్యమని సంకేతాలు పంపింది.

## 11ఏళ్లలో 29వేల మంది మృతి!

### ముంబై స్థానిక రైళ్లలో ప్రమాదాలు

### - ఇంకా 8వేల మందిని గుర్తించని వైనం



**ముంబై:** గడచిన పదకొండేళ్లలో ముంబై సబర్బన్ రైళ్లలో జరిగిన ప్రమాదాల్లో 29 వేల మంది మరణించారు. ఇందులో ఇంకా ఎనిమిదివేల మంది మృతదేహాలను గుర్తించనేలేదని రైల్వే గణాంకాలు వెల్లడించాయి. దేశ ఆర్థిక రాజధానిగా పిలిచే ముంబైలో సబర్బన్ రైళ్లు అత్యంత కీలకం. ఇది నిత్యం రద్దీగానే ఉంటాయి. ఈ రైళ్లలో ప్రతి రోజూ సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. కేవలం సెంట్రల్ రైల్వేలోనే నిత్యం 30 లక్షల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. అదే పశ్చిమ రైల్వే, సెంట్రల్ రైల్వేలో రెండింటిని కలిపి లెక్కిస్తే ప్రతి రోజు సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ మెయిన్‌లైన్, హార్బర్‌లైన్?, ట్రాన్స్‌హార్బర్‌లైన్లలో మూడు వేల రైళ్లను నడుపుతోంది. ప్రయాణికుల రద్దీని దష్టిలో ఉంచుకొని లోకల్ ఏసీ రైళ్లను కూడా నడుపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే 'పీక్' అవర్‌లో జనం ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ఉంటారు. ఇలా రైళ్ల రద్దీ కారణంగా ప్రమాదకరమైన ప్రయాణం చేయడం వల్ల గడిచిన పదకొండు సంవత్సరాల్లో 6500 మంది ప్రయాణికులు మరణించారు. మరోవైపు రైలు ప్రమాదాల నివారణపై సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. సురక్షిత ప్రయాణం చేయాలని కోరిన ఆయన, ఇంకా స్టేషన్లలో ప్రకటనల ద్వారా ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కదులుతున్న రైలు నుంచి ఎక్కడం, దిగడం, వంతెనలు ఉపయోగించకుండా పట్టాలు దాటడం వంటివి మానుకోవాలని సూచించారు. దాదాపు 15 వేలకు మందికి పైగా పౌరులు పట్టాలు దాటుతుండగా ప్రాణాలు కోల్పోయారని రైల్వే శాఖ చెబుతోంది. ఈ ప్రమాదాల్లో మతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోవడం వల్ల రైల్వే పోలీసులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అలాంటి సందర్భాల్లో మతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డు, వారు ధరించిన దుస్తులు, మొబైల్ ఫోన్ ఆధారంగా వారిని గుర్తిస్తున్నారని చెప్పింది.

## రెండో పెళ్లి చేసుకున్న బిజెపి మాజీ ఎమ్మెల్యే... పార్టీ నుంచి బహిష్కరణ



**డెహ్రాడూన్:** బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లో మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యేను ఆ పార్టీ నుంచి అధిష్ఠానం బహిష్కరించింది. బహుభార్యత్వానికి వ్యతిరేకంగా అమలు చేసిన యూనిఫాం సివిల్ కోడ్‌ను ఆయన ఉల్లంఘించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళితే... హరిద్వార్‌లోని జ్వాలాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సురేశ్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకున్నారు. సహరాన్‌పూర్‌కు చెందిన నటి ఊర్మిళా సనావర్‌ను తన రెండవ భార్యగా ఆయన పరిచయం చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఈ ఏడాది జనవరిలో బహుభార్యత్వానికి వ్యతిరేకంగా యూనిఫాం సివిల్ కోడ్‌ను ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే బీజేపీ నేత సురేశ్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'బీజేపీ తన సొంత నాయకులపై చట్టాన్ని అమలు చేయడం లేదు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా యూసీసీని ఒక ఆయుధంగా మాత్రమే ఉపయోగిస్తోంది' అని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో స్పందించిన బీజేపీ సురేశ్ రాథోడ్‌కు నోటీస్ జారీ చేసింది. ఆయన వివరణతో బీజేపీ నాయకత్వం సంతప్తి చెందలేదని తెలిపింది. 'మీరు పార్టీ క్రమశిక్షణ, సామాజిక ప్రవర్తన నిబంధనలను నిరంతరం ఉల్లంఘించారు. ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు మిమ్మల్ని ఆరు సంవత్సరాల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నాం' అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర బిష్ట్ ఒక లేఖలో పేర్కొన్నారు.

## 8మంది భారత జాలర్ల అరెస్టు



**కొలంబో :** శ్రీలంక నావికాదళ అధికారులు ఆదివారంనాడు ఎనిమిదిమంది భారతీయ జాలర్లను అరెస్టు చేశారు. భారత జాలర్లు శ్రీలంక సముద్ర జలాలలో ప్రవేశించి చేపలవేట చేస్తున్నారన్న ఆరోపణలపై జాలర్ల ట్రాలర్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర మన్నార్‌లో తనిఖీలు చేస్తున్న సందర్భంగా భారత జాలర్లను అరెస్టు చేసినట్లు కొలంబోలో అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటారని ప్రకటన పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున శ్రీలంక సముద్ర జలాల్లో భారత జాలర్లబృందం అక్రమంగా చేపలవేట చేస్తోందని, దీంతో సముద్రజలాల్లో గస్తీ నిర్వహించే శ్రీలంక ఉత్తర సెంట్రల్ కమాండ్ అధికారులు మోహరించి వారిని అదుపులోకి తీసుకుని ట్రాలర్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటనలో అధికారులు చెప్పారు. ఇటీవలికాలంలో తరచుగా భారత జాలర్లను శ్రీలంక అధికారులు అరెస్టు చేస్తున్నారు. రెండు దేశాల జాలర్లమధ్య చేపల వేటకు సంబంధించిన సమస్య ముదురుతున్నది. అంతర్జాతీయ సముద్రజల నిబంధనలు ఉల్లంఘించి భారత జాలర్లు తరచుగా తమ జలాలలోకి ప్రవేశిస్తున్నారని శ్రీలంక నావికాదళ గస్తీ అధికారులు ఆరోపిస్తున్నారు.

## అత్యాచార ఘటన... సొంత పార్టీ నేతలపై మహువా ఆగ్రహం

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో న్యాయ కళాశాల విద్యార్థిని (24)పై జరిగిన అత్యాచార ఘటన కాకరేపుతోంది. ఈ క్రమంలో బాధితురాలిదే తప్పంటూ అధికార టిఎంసి నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎంపి మహువా మొయిత్రా స్పందిస్తూ సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారత్‌లోని అన్ని పార్టీల్లో స్త్రీ ద్వేషులు ఉన్నారని రాసుకొచ్చారు. అలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు ఎవరు చేసినా తమ పార్టీ ఖండిస్తుందంటూ పేర్కొన్నారు. మరో పోస్టులో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. ఫిర్యాదు చేసిన 12 గంటల్లోపే పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను టీఎంసీ నేతత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏ మాత్రం సహించదన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై కూడా విమర్శలు చేశారు. ఈ అత్యాచార ఘటనపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, ఎమ్మెల్యే మదన్ మిత్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విద్యార్థినిపై ఆమె స్నేహితులు అత్యాచారం చేస్తే ఎవరేం చేస్తారని, పోలీసులు కళాశాలల్లో ఉంటారా అని కల్యాణ్ అనగా... ఆ విద్యార్థిని ఒంటరిగా కాలేజీకి వెళ్లకపోతే ఇలాంటి ఘటన జరిగి ఉండేది కాదని మిత్రా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమైనవని... పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

### మీడియాలో చూసే తెలుసుకున్నాం: లా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్

విద్యార్థినిపై... పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే దారుణానికి ఒడిగట్టిన ఘటనపై న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నయన ఛటర్జీ స్పందించారు. ఈ దారుణం జరిగినట్లు తమ దృష్టికే రాలేదని... మీడియాలో వార్తలు చూసే తాము విషయం తెలుసుకున్నామని చెప్పారు. అత్యాచారం జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిన మరునాడు పోలీసులు కళాశాలకు వచ్చారని... అయితే, ఈ విషయం గురించి తమకు సమాచారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. తాము వచ్చిన విషయం సెక్యూరిటీ గార్డుకు కూడా చెప్పవద్దని పోలీసులు తనను కోరినట్లు చెప్పారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెండు గదులను పోలీసులు సీజ్ చేశారని వైస్ ప్రిన్సిపాల్ అన్నారు. బాధితురాలు కూడా కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా తమ పూర్వ విద్యార్థి అని... కళాశాలలో బోధనా సిబ్బంది తక్కువగా ఉండడంతో కొన్ని నెలల క్రితం అతడిని తాత్కాలిక అధ్యాపకుడిగా నియమించినట్లు చెప్పారు. ఆమె వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలో ఇంత దారుణ ఘటన జరిగినా... అందులోని ఉన్నతస్థాయి అధికారులకే తెలియలేదంటే అక్కడి విద్యార్థుల గురించి వారు ఏం పట్టించుకుంటున్నారని మండిపడ్డారు. దర్యాప్తు వేగవంతం చేసి... నిందితులకు వెంటనే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిపై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు కళాశాల ప్రాంగణంలో అత్యాచారానికి పాల్పడిన ఘటన ఈ నెల 25న చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా(31) సహా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. మనోజిత్‌కు టీఎంసీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తోంది. నిందితులకు సెక్యూరిటీ గార్డు సహకరించినట్లు అనుమానించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



## ఆమెకు అండగా ఉన్నాం...బాధితురాలి ఆచూకీ అందించడంలో పోలీసులు విఫలం

### కోల్‌కతా అత్యాచార ఘటనపై ఎన్‌సిడబ్ల్యు



**కోల్‌కతా :** న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచార దురాగతం జరిగిన దక్షిణ కోల్‌కతాలోని న్యాయ కళాశాలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు అర్చన మజుందార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పోలీసులు బాధితురాలి ఆచూకీ తెలపలేదన్నారు. 'కమిషన్ ఆమె అండగా ఉంది... బాధితురాలికి ఆమె కోరుకున్నంత కాలం సహాయం చేయడమే ఎన్‌సీడబ్ల్యూ ఉద్దేశం' అని ఆమె అన్నారు. బాధితురాలి తల్లిదండ్రులతో కూడా మాట్లాడటం అవసరమని తెలిపారు. ఇది ఎన్‌సీడబ్ల్యూ ద్వారా జరిగే దర్యాప్తులో భాగమని... అటువంటి సందర్భాలలో బాధితురాలితో పాటు తల్లిదండ్రులతో కూడా ఎన్‌సీడబ్ల్యూ మాట్లాడుతుందని, వారికి ఏమి అవసరమో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుందని, ఆమె భద్రత, విద్యను ముందుకు తీసుకెళ్లడంలో సహాయం మొదలైన వాటితో సహా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. న్యాయ కళాశాలను సందర్శించిన సమయంలో మజుందార్ అక్కడ ఉన్న పోలీసు అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. కళాశాలలో ఉన్న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు కాకుండా ఆమెతో పాటు వచ్చిన మరో ఇద్దరు వ్యక్తుల మొబైల్ నంబర్లను నోట్ చేసుకున్న తర్వాత క్యాంపస్‌లోకి ప్రవేశించడానికి అనుమతించినట్లు చెప్పారు. 'వీడియోగ్రఫీ లేదా స్టిల్ ఫోటోగ్రఫీని లోపలికి అనుమతించలేదు' అన్నారు. మజుందార్ తరువాత క్యాంపస్‌లోకి ప్రవేశించి జూన్ 25న జరిగిన సంఘటన జరిగిన గార్డ్ రూమ్‌ను సందర్శించారు. 'నేను నా పనిని పూర్తి చేయలేకపోయానని నివేదిస్తాను' అని అన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రధాన నిందితుడు, పూర్వ విద్యార్థి, ఇద్దరు విద్యార్థులతో పాటు కళాశాల గార్డును శనివారం ఉదయం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి అసిస్టెంట్ కమిషనర్ హోదా అధికారి నేతత్వంలో ఐదుగురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఏర్పాటు చేసింది. బీజేపీ, వామపక్షాలు సహా ప్రతిపక్ష రాజకీయ పార్టీలు తణమూల్ కాంగ్రెస్ పాలిత పశ్చిమ బెంగాల్‌లో విద్యాసంస్థల్లో భద్రత లేదని ఆరోపిస్తూ సామూహిక అత్యాచార ఘటనపై నిరసనలు చేపట్టాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా సర్దార్ పుటం పురుషోత్తమ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది పెంటయ్య పటేల్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ జలవిహార్ ప్రాంగణంలో అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘం ఎన్నికలు జరిగాయి. కోశాధికారిగా కంచె సత్యనారాయణ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. సంఘం అధ్యక్షులుగా పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య, కోశాధికారి సత్యనారాయణల చేత ఎన్నికల ప్రధానాధికారి లక్ష్మీ నారాయణ ప్రమాణం చేయించి, పత్రాలు అందజేశారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులుగా వేణుగోపాల్ పటేల్, డాక్టర్ జే.ఎన్.వెంకట్ పటేల్, చల్లా హరిశంకర్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా బండి పద్మక్క పటేల్ ను అపెక్స్ కౌన్సిల్ నియమించి, వారికి పత్రాలు అందజేయడం జరిగింది.

### ఘనంగా కొనసాగుతున్న

# గోల్కొండ బోనాల జాతర



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల సందడి గత గురువారం అమ్మవార్లకు తొలిబోనం సమర్పణతో ప్రారంభమైన విషయం తెల్సిందే. చారిత్రాత్మక గోల్కొండ కోటలో బోనాల పండుగ మొదటి ఆదివారం రోజున జగదాంబిక, ఎల్లమ్మ అమ్మవార్లకు బోనాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు గోల్కొండకు కోటకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోల్కొండ కోట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. గోల్కొండ బోనాల జాతర ఘనంగా కొనసాగుతోంది. రెండో పూజ ఆదివారం కావడంతో గోల్కొండ కోటకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో గోల్కొండ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

**భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు..**

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గోల్కొండలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈ నెల 26వ తేదీ గురువారం నుంచి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు మొదలయ్యాయి. గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలిబోనం సమర్పించడంతో బోనాల జాతర మొదలైంది. ప్రతి గురు, ఆదివారాల్లో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నారు. అమ్మవార్లకు 9 పూజలతో గోల్కొండ బోనాలు జరుగుతాయి. గోల్కొండ కోటలో నెలరోజులపాటు బోనాల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గోల్కొండ కోటలో మొదలైన బోనాలు జులై 24న తిరిగి గోల్కొండ కోటలోనే వేడుకలు ముగియనున్నాయి.

**లష్కర్ బోనాల జాతరకు అంకురార్పణ..**

లష్కర్ బోనాల జాతరకు ఆదివారం అంకురార్పణ జరిగింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరలో తొలి ఘట్టమైన అమ్మవారి ఘటం ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి, ఆలయ ఫ్యామిలీ ట్రస్టు చైర్మన్ సురిటి రామేశ్వర్, కామేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి ఆభరణాలను అప్పగించడం ద్వారా ఘటం ఎదుర్కోలు ప్రారంభమవుతుందన్నారు. వచ్చే నెల 13వ తేదీన బోనాలు జరుగుతాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు చేస్తారని వారు చెప్పారు. 14న ఉదయం 8.30 గంటలకు రంగం (భవిష్యవాణి) కార్యక్రమం జరుగుతుందన్నారు.

### సిటీలో సుమారు 7 వేల మంది ఆర్‌టిసి డ్రైవర్లకు మంగళం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిలో ఏడు వేల మంది డ్రైవర్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ఆర్‌టిసిలో ఉన్న డీజిల్ బస్సులను పూర్తిగా ఉపసంహరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. దాని స్థానంలో ఏడాదిలోపు 3000 అద్దె ఎలక్ట్రిక్ బస్సులను చేస్తామని సిఎంతో పాటు రవాణా శాఖ మంత్రి తాజా ప్రకటనతో ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలాయ్యయన్నారు. సిటీలో ఆరీసి బస్సులు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది మాయమై ఆర్‌టిసి పేర నడిచే అద్దె బస్సులు, అద్దె డ్రైవర్లు మాత్రమే మిగిలి, కండక్టర్ల సంఖ్య దారుణంగా తగ్గి ఆర్‌టిసి అస్థిపంజరం అవుతుందని ఆరోపించారు. వాయు కాలుష్యంపై చిత్తశుద్ధి ఉంటే ఆర్‌టిసికి ఆర్థిక సహాయం చేస్తూ లేదా గ్యారెంటీలతో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు చేసి సంస్థ మనుగడకు దోహదపడాలని, రూపాయి ఖర్చు లేకుండా అద్దె ఎలక్ట్రిక్ బస్సులపై ఆర్భాటం చేయటం అనుచితమని ఎం.నాగేశ్వరరావు ప్రభుత్వ చర్యను నిరసించారు.

## వరంగల్ నాయకుల వ్యవహారాలలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుంది

### మహేష్ కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్ నాయకుల వ్యవహారాలలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జూలై 4న గాంధీ భవన్‌లో పిఏసి సమావేశం నిర్వహిస్తామని, అనంతరం టిపిసిసి విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని అన్నారు. దివంగత కాంగ్రెస్ నాయకుడు డి. శ్రీనివాస్ విగ్రహాన్ని బిజెపి నాయకునితో ప్రారంభిస్తే ఆయన(డిఎస్) ఆత్మ క్షోభిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మహేష్ కుమార్‌గౌడ్ జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'జై బాపు–జై భీమ్–జై సంవిధాన్' కమిటీ సమావేశంలో భాగంగానే హైదరాబాద్ లోని ఎల్.బి స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో భహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు 15వేల మంది హాజరవుతారని వివరించారు. దివంగత కాంగ్రెస్ నేత డి. శ్రీనివాస్ తన జీవితాంతం సెక్యూలరిస్టుగా ఉన్నారని, ఆయన కాంగ్రెస్‌లోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారని మహేష్‌కుమార్ గౌడ్ బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను డిఎస్ ఒప్పుకోరని చెప్పారు. డిఎస్ విగ్రహానికి స్థలాన్ని ఇచ్చేంది రాష్ట్ర ప్రభుత్వం అని, కానీ విగ్రహ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ నాయకులకు ఆహ్వానం లేదన్నారు. డిఎస్ బిజెపిలో ఎప్పుడూ లేరని, కొన్ని కారణాలతో ఆయన బిఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. జూబ్లిహిల్స్‌లో ఎన్నిక ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డిఎస్ కుమారుల కారణంగానే డిఎస్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. సంవత్సరన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్నదని, వాటిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు బురదజల్లే కార్యక్రమం పెట్టుకున్నాయని మండిపడ్డారు.

### కాంగ్రెస్ పార్టీ నుంచి రావి శ్రీనివాస్‌పై ఆరేళ్లు పాటు సస్పెన్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్ కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్‌ను టిపిసిసి క్రమశిక్షణ కమిటీ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరేళ్ళ పాటు సస్పెన్షన్ చేసింది. టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. రావి శ్రీనివాస్ తీరుపైన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది.

## మరింత సమర్థవంతంగా తెలంగాణ జాగృతి కార్యక్రమాలు

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి కార్యక్రమాలను వివిధ రంగాలలో మరింత సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ క్రమంలో పలు దేశాల్లో పలు దేశాల తెలంగాణ జాగృతి శాఖలకు నూతన అధ్యక్షులను మె ఆదివారం ప్రకటించారు. తెలంగాణ అభ్యున్నతికి, ఆయా దేశాలలో ఉన్న తెలంగాణీయుల సంక్షేమానికి కృషి చేయాలని కవిత సూచించారు. వివిధ దేశాలకు అధ్యక్షులు వివరాలు ఇలా ఉన్నాయి. న్యూజిలాండ్‌అరుణ జ్యోతి ముద్దం, గల్ఫ్ చెల్లంశెట్టి హరిప్రసాద్, ఖతర్ మూకల ప్రవీణ లక్ష్మి,అడ్వైజర్ గా నందిని అబ్బగోని, యూఎఈ పీచర వేంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్ గౌడ్, కువైట్ మర్క ప్రమోద్ కుమార్, సౌదీ అరేబియా మహమ్మద్ మొజ్జం అలీ ఇఫ్తెకార్, ఒమన్ గుండు రాజేందర్ నేత,యునైటెడ్‌కింగ్ డమ్ సుమన్ రావు బల్మూరి, ఇటలీ తానింకి కిశోర్ యాదవ్,ఫిన్లాండ ఐరెడ్డి సందీప్ రెడ్డి, పోర్చుగల్ ప్రకాశ్ పొన్నకంటి,మాల్టా పింటు ఘోష్, కెన్యా స్వప్న రెడ్డి గంట్ల, ఇరాక్, కుర్దిస్తాన్ మహ్మద్ సల్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా నాయక్వార్ రాం చందర్‌ను నియమించారు. అలాగే మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్ నుల్గేను నియమించారు.

## జాతిని తప్పతోవ పట్టిస్తున్నారు

### రాఫెల్ నష్టాల వ్యాఖ్యలపై కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత వైమానికదళం యుద్ధ విమానాలను కోల్పోయిందని ఇండోనేసియాలో ఇటీవల జరిగిన ఒక సెమినార్‌లో భారత నావికాదళాధికారి కెప్టెన్ శివ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్‌పార్టీ ఉటంకిస్తూ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తప్పుతోవ పట్టిస్తోందని విమర్శించింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా ఆదివారం నాడు ఒక పోస్టింగ్ పెడుతూ, అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించేందుకు, ఆ సమావేశానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయకుండా ఆ డిమాండ్‌ను ఎందుకు మోదీ తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. మే ఏడో తేదీన రాత్రి ఉగ్రవాద కేంద్రాలే లక్ష్యంగా భారత్ జరిపిన దాడుల్లో భారత వైమానిక దళం యుద్ధ విమానాలను కోల్పోయిందని కెప్టెన్ శివ్‌కుమార్ ఇటీవల ఇండోనేసియా సెమినార్‌లో చెప్పారని, ఐనప్పటికీ కూడా ఇండోనేసియాలో భారత దౌత్యకార్యాలయం మాత్రం ఎక్స్ వేదికగా ఆదివారంనాడు ఒక పోస్టింగ్ పెడుతూ, మీడియా తప్పుగా రాసిందని పేర్కొందనీ, శివ్ కుమార్ మాటల్లో అసలు ఉద్దేశం వేరుగా ఉందని పేర్కొందని అన్నారు. మొదట సింగపూర్‌లో జరిగిన ఒక సదస్సులో సాయుధ బలగాల ప్రధానాధిపతి, సిడిఎస్ చౌహాన్ భారత్ యుద్ధ విమానాలు కోల్పోయిందని చెప్పారని గుర్తు చేశారు. చాలా ముఖ్యమైన విషయం ఆయన మొదటిసారి బహిర్గతం చేశారని చెప్పారు. కానీ ప్రధానమంత్రిమాత్రం ఈ విషయాలన్నీ చర్చించడానికి, దేశంలో ప్రతిపక్షాలతో సమావేశంలో పాల్గొనడానికి తిరస్కరిస్తున్నారని జైరామ్ రమేశ్ విమర్శించారు.

ఈ అంశాలు చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయమని అడిగితే ఎందుకు ప్రధానమంత్రి తిరస్కరిస్తున్నారని ఆయన నిలదీశారు. అదేవిధంగా మరో కాంగ్రెస్ నాయకుడు పవన్‌ఖేరా కూడా మోదీని విమర్శించారు. యుద్ధ విమానాల నష్టంపై ప్రధానమంత్రి ఎందుకు నిజాలు చెప్పడంలేదని ప్రశ్నించారు.

## పాకిస్థాన్‌లో భూకంపం

**కరాచీ :** పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో ఆదివారంనాడు భూకంపం సంభవించింది. దీంతో ఐదుగురు గాయపడ్డారు. పెద్దగా నష్టం జరగలేదు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు రిచ్‌టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు అమెరికా భూభౌతిక సర్వే అధికారులు చెప్పారు. బార్కాన్ ప్రాంతంలో ఇంటి పైకప్పు కూలిపోయి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. మొత్తం 12కుపైగా ఇళ్ళు ధ్వంసమయ్యాయి. 2021లో హర్నాయ్ పట్టణంలో వచ్చిన భూకంపంలో 20 మంది మరణించారు. అంతకుముందు 2005లో 7.6తీవ్రతతో ఉత్తర పాకిస్థాన్‌లో వచ్చిన భూకంపంలో 73,000 మంది మరణించారు. 30.50 లక్షలమంది నిరాశ్రయులయ్యారు.

## రవీందర్ మృతదేహం తరలింపు

### రెండు రోజుల్లో ఇజ్రాయెల్ నుంచి ఇండియాకు చేరకోనున్న మృతదేహం



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల పట్టణానికి చెం దిన రేవెల్ల రవీందర్(57) ఈ నెల 16న ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య ఉద్రికత్తలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ప్రక్రియలో అవరోధాలు ఏర్పాడ్డా యి. మృతదేహాన్ని స్వదేశానికి తరలించే పనిలో తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర విదేశాంగ శాఖ సహాయంతో వేగంగా చర్యలు చేపట్టింది. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్, మాజీ మంత్రి రాజేశంగౌడ్ తెలంగాణ ప్రభు త్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇజ్రాయిల్‌లోని ఇండియన్ ఎంబసీతో సంప్రదింపు లు జరపడం, ఇజ్రాయిల్‌లోని తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు సోమ రవి సమన్వయంతో మృతదేహం తరలింపు ప్రక్రియ వేగవంతం అయ్యినట్లు తెలిసింది. రవీందర్‌కు భీమా పాలసీ లేకపోవడం వల్ల మృతదేహ రవాణా ఖర్చులను భారత రాయబార కార్యాలయం భరించాల్సిన పరిస్థితి ఏ ర్పడింది. మొదట ఆపరేషన్ సింధ్‌లో భాగంగా ఆయన మృతదేహన్ని విమాన మార్గంలో తరలించేందుకు ప్రయత్నించారు. అయితే కొన్ని ఆంక్షలు ఎదురవ్వడంతో అది వీలు కాకపోవడంతో యుద్ధ పరిస్థితుల వలన ఆలస్యం జరిగినప్పటికి, ఇప్పుడు కాల్పుల విరమణ నేపథ్యంలో మృతదేహం తరలింపుకు మార్గం సుగమం సులువైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రవీంధర్ మృతేహం కలిగిన శవపేటికను రోడ్డ మార్గంలో ఇజ్రాయిల్ నుంచి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌కు తరలించి అక్కడి నుండి విమాన మార్గంలో ఢిల్లీ, అనంతరం హైదరాబాద్‌కు పంపేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో రవీంధర్ మృతదేహం ఇజ్రాయిల్ నుండి జగిత్యాలకు చేరుకోనున్నట్లు సమాచారం.

## సుల్తానాబాద్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కం అదనపు జ్యుడిషయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రభుత్వం మంజూరి చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య, 43, తేదీ: 27 ద్వారా సుల్తానాబాద్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తూ ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాబాద్‌కు అదనపు కోర్టు మంజూరీ చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఎజిపి దూడం ఆంజనేయులు, న్యాయవాదులు గూడెపు దివాకర్ రావు, పబ్బతి లక్ష్మి కాంత రెడ్డి, ఆవుల లక్ష్మి రాజం, మాదూరి ఆంజనేయులు, ఆలూరి శ్రీనివాసరావు, భూసారపు బాల కిషన్ ప్రసాద్, ఆకారపు సరోత్తం రెడ్డి, పడాల శ్రీరాములు, వొడ్నాల రవీందర్ తో పాటు పలువురు సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్ఎస్ఎస్ నిజంగా భారత రాజ్యాంగాన్ని సమ్మతిస్తుందా?

### భారతదేశానికి సమాధానం కావాలి మోహన్ భగవత్‌ను నిలదీసిన సిపిఐ ఎంపి సందోష్‌కుమార్





**న్యూఢిల్లీ :** ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) నిజంగా భారత రాజ్యాంగాన్ని సమ్మతిస్తుందా? రాజ్యాంగ మౌలిక విలువలను సమ్మతిస్తుందా? అని రాజ్యసభలో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ)పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ ప్రశ్నించారు. ఈ విషయంలో భారతదేశానికి సమాధానం కావాలి తప్ప గందరగోళం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (నాగపూర్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్‌కు సందోష్ కుమార్ ఈ మేరకు ఒక లేఖ రాశారు. ఆ లేఖను ఆదివారంనాడు ఆయన పత్రికలకు విడుదల చేశారు. భారత రాజ్యాంగ పీఠికలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన లౌకికవాదం, సామ్యవాదాలను సమీక్షించాలని కేంద్రంలోని అధికార బిజెపి సైద్ధాంతిక ఉపదేశకుడు, ఆర్ఎస్ ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే గడచిన శుక్రవారం ఇచ్చిన పిలుపును తీవ్రంగా ఖండించారు. సీనియర్ ఆర్ఎస్ఎస్ నాయకులు ఇటీవల చేసిన ప్రకటనల నేపథ్యంలో నేను మీకు ఈ లేఖ రాస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ''చాలా స్పష్టంగా మిమ్మల్ని అడుగుతున్నాను, ఆర్ఎస్ఎస్ నిజంగా భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను సమ్మతిస్తుందా? లేక ప్రజాస్వామ్యం, సమానత్వం భారతదేశ సంస్కృతికి విరుద్ధమని ప్రకటించి, నాజీ జర్మనీ నియంత నమూనాకు కట్టుబడిన ఎం.ఎస్.గోల్వాల్కర్ రచనలనుండి స్ఫూర్తిని పొందిందా? రాజ్యాంగం పక్షాన నిలబడి రాజ్యాంగాన్ని సమ్మతిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ ఏనాడూ కనీసం లాంఛనంగా ఒక్క తీర్మానం కూడా ఎందుకు ఆమోదించలేదు? ఆర్ఎస్ఎస్ సభ్యులు ఎందుకని పదే పదే భారత రాజ్యాంగాన్ని కించపరచి తక్కువ చేసి మాట్లాడుతున్నారు? మతోన్మాద భావోద్వేగాలను ఎందుకు ఆర్ఎస్ఎస్ రెచ్చగొడుతున్నది? చరిత్ర వక్రీకరణలను ఎందుకు ప్రోత్సహిస్తున్నది? ఈ ప్రశ్నలన్నింటికీ భారతదేశానికి ఆర్ఎస్ఎస్ నుండి సమాధానాలు కావాలి తప్ప గందరగోళం కాదు.

దేశాన్ని మతం పేరుతో విభజించడంకోసం చర్చలు చేసేందుకు ఆజ్యం పోయడం ఆర్ఎస్ఎస్ ఇక మానుకోవాలి, అందుకు ఇదే తగిన సమయం. మన దేశ ప్రజలు, దళితులు, ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులవారు, మహిళలు, పేదలు అందరూ శాంతిని కోరుకుంటున్నారు. శాంతియుతంగా జీవించాలనుకుంటున్నారు, శాంతి, గౌరవ మర్యాదలు, ప్రగతికి కట్టుబడ్డారుగానీ విద్వేషాన్ని, భయాన్ని కోరుకోవడం లేదు, అందువల్ల రాజ్యాంగానికి తు.చ తప్పకుండా కట్టుబడి రాజ్యాంగ విలువలను కాపాడేందుకు వీలుగా మీ కార్యకర్తలలో చైతన్యాన్ని పెంపొందించేందుకు తగిన శిక్షణ ఇవ్వాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను, గురు గోల్వాల్కర్‌కు ఎంతో ఇష్టమైన నాజీ జర్మనీతో సహా యావత్ చరిత్రనుండి మనం గుణపాఠాలు నేర్చుకుందాం, నియంతృత్వంతో సమాజాలను విభజించి తాత్కాలికంగా అధికారాన్ని సంపాదింవచ్చు, కానీ అలాంటివాళ్ళంతా శిథిలాల్లో కలిసిపోతారు'' అని సందోష్ కుమార్ మోహన్ భగవత్‌కు రాసిన లేఖలో హెచ్చరించారు. ''రాజ్యాంగం పీఠికలో లౌకికవాదం, సోషలిజంలను చేర్చడాన్ని ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ సూత్రాలను రాజ్యాంగంలో ఏకపక్షంగా చొప్పించలేదు, భారతదేశంలో అణచివేతకు గురైన, దార్శనిక దృక్పథంతో కలలుగన్న మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డా.బి.ఆర్.అంబేద్కర్ వంటి అనేకమంది నాయకులు బహుళత్వంతో కూడిన గణతంత్ర వ్యవస్థను సృష్టించేందుకు తమ నిజ జీవితానుభవాల నుండి రూపుదిద్దుకున్న మౌలిక ఆలోచనలతో రాజ్యాంగ రూపకల్పన చేశారు. మనబోటి భిన్నత్వంతో కూడిన దేశంలో లౌకికవాదం ఐక్యతకు, బహుళత్వానికి భరోసా ఇస్తుంది, అదే సమయంలో సామ్యవాదం ప్రతి పౌరుడికీ న్యాయాన్ని, గౌరవాన్ని ఇస్తామని వాగ్దానం చేస్తుంది, వీటిని ప్రశ్నించడం అంటే, వలసవాదపాలకుల కాలంలో జరిగిన మన జాతి విముక్తి పోరాటం భారత ప్రజలకు ఇచ్చిన హామీలను అవహేళన చేయడం లేదా తిరస్కరించడమే అవుతుంది'' అని సందోష్ కుమార్ తన లేఖలో హెచ్చరించారు. ''స్పష్టంగా చెప్పాలంటే ఈ వ్యాఖ్యలు విని మేం ఆశ్చర్యపోలేదు. విప్లవకారులు, కార్మికులు, కర్షకులు,విద్యార్థులు, దేశభక్తియుతశక్తులు, వీరిలో భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఎంతోమంది ఎంతో ధైర్యసాహసాలతో బ్రిటీష్ వారిని ఎదుర్కొన్నారు, ప్రాణత్యాగాలు చేశారు. కానీ ఆర్ఎస్ఎస్ మాత్రం ఓ పక్కన నిలబడి ఇవన్నీ చూస్తూ కూర్చుంది. వలసవాద వ్యతిరేక పోరాట ఉద్యమంలో మేం ఎంతో క్రియాశీలమైన పాత్ర పోషించాం. ప్రజాపోరాటాలు పోటెత్తినప్పుడు అందులో భాగస్వామ్యం అయ్యాం, ఆ తర్వాత ఎంతో హృదయపూర్వకంగా రాజ్యాంగ రూపకల్పనకు మద్దతు ఇచ్చాం. మేం జాతీయ పతాకాన్ని ఎంతో గర్వంగా సమున్నతస్థానంలో ఉంచాం, భూసంస్కరణలకోసం కట్టుబడి పని చేశాం, రాజభరణాల రద్దుకు మద్దతు ఇచ్చాం, ప్రభుత్వ రంగ వ్యవస్థను రక్షించాం, బ్యాంకుల జాతీయాకరణ కోసం పోరాడాం, సామాజిక న్యాయాన్ని, కార్మిక హక్కులను వ్యవస్థాగతం చేసేందుకు కృషి చేశాం. కానీ ఆర్ఎస్ఎస్ అందుకు విరుద్ధంగా ప్రవర్తించింది. ఈ పోరాటాలను పరిహాసం చేసింది, జాతీయ పతాకాన్ని వ్యతిరేకించింది. భారత సమాజాన్ని ప్రజాస్వామ్యీకరణ చేసేందుకు ఉద్దేశించిన ప్రతి ప్రగతిశీల విధానాన్నీ చులకనగా చూసింది, మేం లౌకికవాదాన్ని కాపాడుతూ దాన్ని బలంగా అమలు చేసే చర్యలు చేపడుతూ ఉంటే, మీ సంఘపరివారం మాత్రం ఒక పద్ధతి ప్రకారం రాజకీయాలలో మతోన్మాదాన్ని చొప్పించేందుకు ప్రయత్నం చేసింది, ప్రభుత్వ వ్యవస్థలను లేకుండా చేసేందుకు కృషి చేసింది, కార్పొరేట్ అనుకూల ఎజెండా ముసుగులో జాతీయ ఉన్మాదంకోసం వాదనలు చేస్తోంది'' అని సందోష్ కుమార్ ఆ లేఖలో ఆర్ఎస్ఎస్‌ను దునుమాడారు.

## త్వరలో కర్ణాటక సిఎంగా డికె శివకుమార్!



**బెంగళూరు :** ప్రస్తుతం కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉన్న డికె శివకుమార్ 2,3 నెలల్లో సిద్ధరామయ్య స్థానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ ఏ ఇక్బాల్ హుస్సేన్ పేర్కొన్నారు. కొద్ది నెలలుగా కర్ణాటక లో ముఖ్యమంత్రిని అధిష్టానం మార్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. సెప్టెంబర్ తర్వాత కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయని ఈ మధ్యనే సహకార శాఖమంత్రి కెఎన్. రాజన్న సంచలన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలోనే డికె శివకుమార్ కు సన్నిహితుడైన ఇక్బాల్ హుస్సేన్ చేసిన తాజా ప్రకటన చర్చనీయాంశం అయింది. కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు డికె శివకుమార్ తీవ్రంగా కృషి చేశారన్న విషయం అందరికీ తెలుసునని, అధిష్టానం కూడా డికె శివకుమార్ పట్ల సానుకూల ధోరణితోనే ఉందని హుస్సేన్ తెలిపారు. ఊహాగానాల మీద తనకు నమ్మకం లేదని, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా హైకమాండ్‌కు తెలుసునని, తగిన సమయంలో కాంగ్రెస్ అధిష్టానం తగిన నిర్ణయం తీసుకుంటుందన్న పూర్తినమ్మకం తనకు ఉందని ఇక్బాల్ హుస్సేన్ వివరించారు.

2024 మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన తర్వాత సీఎం పదవికి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది. అధిష్టానం నచ్చచెప్పడంతో డికే శివకుమార్ డిప్యూటీ సీఎం పదవి చేపట్టారు. అప్పట్లోనే రొటేషన్ సిఎం ఫార్ములా అంటూ వార్తలు వచ్చాయి. అంటే రెండున్నర ఏళ్లపాటు సిద్ధరామయ్య, మరో రెండున్నర సంవత్సరాల పాటు డికే శివకుమార్ ముఖ్యమంత్రిపదవిలో కొనసాగుతారనే ప్రచారం సాగింది. అయితే,దీనిని అధికారికంగా పార్టీ నాయకత్వం ధ్రువీకరించలేదు. ముఖ్యమంత్రి మార్పు వార్తలను కేవలం ఊహాగానాలుగా సిఎం సిద్ధరామయ్య కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య తోసి పుచ్చారు. 2023లో కాంగ్రెస్ హైకమాండ్ సిద్ధరామయ్యను సీఎంగా ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

కాగా ప్రస్తుతం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా, డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉన్న డికె శివకుమార్ ఎన్నడూ తాను ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు సుస్పష్టంగా చెబుతూ వచ్చారు. 2023 లో సిద్ధరామయ్యను సిఎంగా నిర్ణయించిన కాంగ్రెస్ అధిష్టానమే త్వరలో డికె విషయంలోనూ కచ్చితంగా నిర్ణయం తీసుకుంటుందని,ఇక్బాల్ హుస్సేన్ ఇతరులు అంటున్నారు.

## త్రి భాషా విధానంపై వెనక్కి

### ఉత్తర్వులను ఉపసంహరించుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం



**ముంబయి :** ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో.. తాజాగా వెనక్కి తగ్గింది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానంపై ఎలా ముందుకెళ్లాలి, దాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్ లలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫార్సులు చేసేందుకు డా.నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం అని ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఎం ఫడ్నవీస్ తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని డా.రఘునాథ్ మషేల్కర్ కమిటీ చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్ధవ్ ఠాక్రే అంగీకరించారని, దాని అమలుపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 15తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది.

## పాల సంఘం చైర్మన్ యాదగిరి, సిద్దులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల, సుద్దాల మదర్‌డైరీ చైర్మన్ ల ఎన్నికల ఆదివారం జరిగింది. వెల్మజాల మదర్‌డైరీ పాలసంఘం చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనగందుల యాదగిరి మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుద్దాల గ్రామ మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన మలిగ సిద్దులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా సంపత్‌రెడ్డి, స్వప్న లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్లు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపుతానని అన్నారు. పాలక వర్గ సహకారంతో పాల సెంటర్ అభివృద్ధికి ముందుండి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పివైస్ చైర్మన్ పాండరీగౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య, బిఆర్ఎస్ అధ్యక్షులు మోగిలాల్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని డివిజన్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/కాప్రా :** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దీని కోసం సమస్యల విషయం ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకుని రావాలని కోరారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్‌లోని సుభాష్‌నగర్ కాలనీలో రూ.30.50 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసారు. ఎమ్మెల్యేగా గెలుపొంది వంద రోజులు పూర్తైన నేపథ్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో కాలనీ వాసులు గంగాధర్, తిరుమలయ్య, బాలనర్సింహ, పోచయ్య, కృష్ణ, భాను, లలితన మీరాబాయి. లక్ష్మి , ఉస్మాన్, వాసుగౌడ్ తదితరులతో కలిసి వంద కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసారు.



## సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** సిఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజుల రామారం చిత్తారమ్మ దేవాలయం ప్రాంగణంలో పలువురు లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూన అందజేశారు. నియోజకవర్గంలోని కొండడి యాదవ రావుకి రూ.60,000, కడలి సత్యనారాయణకి రూ.37,500, భల్లం ఉషారాణికి రూ.35,000, విజయరామ రాజుకి రూ.60,000ల చెక్కులను శ్రీశైలం గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలా పనిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గం ప్రజలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో శాంతి భద్రతలు




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజల సహకారంతో శాంతి భద్రతలు చేకూరుతాయని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లో సాయంత్రం సామాజిక భద్రత శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల(డ్రగ్స్) నుంచి దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. డ్రగ్స్ వాడకం వ్యక్తి భవిష్యత్తు నేలమట్టం చేస్తుందని అన్నారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే తెలియపరుచాలని వారి పేర్లను గొప్యంగా ఉంచుతామని చెప్పారు. గ్రామ శాంతి భద్రతలకు సిసి కెమరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను మరింత చేరువ చేయడానికి కమ్యూనిటి పోలీసింగ్ ఎంతో ముఖ్యమని తెలిపారు. మూడుచింతలపల్లికి చెందిన ర్యాకల రవీందర్‌గౌడ్ ఆలపించిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ సింగం అంజనేయులు, మాజి ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, ఎస్ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్ రెడ్డి, డిఐ రాజు, ఎస్ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ బండి జగన్నాథం, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కటికెల గోపి, సత్తయ్య, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రయోజనాలు అమెరికాకు తాకట్టు

### అమెరికా రాయబార కార్యాలయాన్ని ఎఐవైఎఫ్ ముట్టడి




**ప్రజాపక్షం/కాప్రా :** దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను నిలువరించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. దీనిలోని భాగంగా జూలై 2న ఎఐవైఎఫ్ తెలంగాణా రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి తలపెట్టామని మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన గోడపత్రికలను ఆదివారం ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, మోసిన్, ప్రదీప్, గిరి, ప్రభులతో కల్సి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని తిరోగమనదిశలో తీసుకొని వెళ్లే దిశలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులకు మడుగులెత్తుతున్న మోడి తీరు దేశ సార్వభౌమత్యాన్ని ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారు. మన ప్రధాని కంటె ముందే పాకిస్తాన్, భారత్ యుద్ధాన్ని ఆపేసాని ట్రంప్ ప్రకటించటం దీనికి నిదర్శనమన్నారు. ప్రజా ప్రయోజనాలకు తిలోధకాలిస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే లక్ష్యంగా ట్రంప్ ఆదేశాల మేరకు దేశ ప్రధాని నడుచుకోవటం సిగ్గుచేటన్నారు. అమెరికా రాయబార కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.

## సంక్షేమ పథకాలు ప్రజల ముందుకు తీసుకెళ్లాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గత ఏడాదిన్నర కాలంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకొని వెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపిచ్చారు. మల్కాజిగిరిలోని బాలాజి పంక్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని, జిల్లాలో గ్రామ స్థాయి నుండి మొదలెడితే ఎలాంటి ఎన్నికైనా కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు కార్యకర్తలందరూ సమిష్టిగా ప్రణాళి కాయుక్తంగా పని చేయాలన్నారు. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జిలు బండంగ్‌పేట మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, కార్పొరేటర్, జితేంద్రనాథ్, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్, పార్టీ శ్రేణులు అశోక్‌రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



### భగత్‌సింగ్ నగర్ కాలనీ గుడిసె వాసులకు

# పట్టాలు ఇచ్చే వరకూ పోరాటం

● ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించాలి : వి.ఎస్ బోస్ ● ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు, కోర్టు ఇచ్చిన నోటీసులకు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి : ఉమా మహేష్



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండలం కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌లు హాజరైనారు. స్వాతంత్ర సమరయోధురాలు తొలి దశ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి సుగుణమ్మ మరణం తీరని లోటు అని వారి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భగత్ సింగ్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాల నుండి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజల గుడిసెలు వేసుకొని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ భూమి పైన కోర్టులో అనేక న్యాయ పోరాటాలు చేసి ఈ భూమి పేద ప్రజలకు చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. భగత్ సింగ్ నగర్‌లో ఉంటున్న పేద ప్రజల గుడిసెల పైన కొంతమంది భూబకాసురుల కన్ను పడిందని, మరల కొంతమంది భూముల ధరలు పెరగడంతో కొంతమంది దురుద్దేశంతో పేద ప్రజలను ఇక్కడి నుంచి ఎలాగైనా పంపించివేయాలని ప్రభుత్వం ఇచ్చిన పట్టాల కూడా కోర్టు నుంచి నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. ఈ భూమిలో గత 20 సంవత్సరాల నుంచి పేద ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కావున ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే గుర్తించి ఇప్పటి వరకు వచ్చిన పట్టాలను, కొంత మంది పట్టాలు రాని పేదవాళ్లకు కూడా పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే స్వాతంత్ర సమరయోధురాలు తొలిదశ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి కామ్రేడ్ సుగుణమ్మ మరణం పార్టీకి తీరని లోటు అని వారి పోరాటాల నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి యొక్క ఆశయాలను కొనసాగించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, జె.లక్ష్మి, ధర్మేందర్, నిమ్మల నరసింహ, మండలం పార్టీ సీనియర్ నాయకులు విబి బాలరాజ్, మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మాధవి, కే.ప్రమీల, బాపరాజు, భూతం ఐలయ్య, కే.మహాలక్ష్మి, నర్సమ్మ, ఎండి.అన్వర్, ఘట్కేసర్ మండల్ సిపిఐ పార్టీ నాయకులు జై.చందర్, భగత్ సింగ్ నగర్ వాసులు జి.నాగరాజు, ఇస్తారు, సోమరాజు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అదృశ్యం

**హైదరాబాద్ :** ఆర్థిక సమస్యలతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీ స్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మియాపూర్ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ మాతృశ్రీ నగర్‌లో నివసించే దేవకుమార్(40) ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్నాడు. గర్భిణి అయిన భార్య ప్రస వం నిమిత్తం ఇంటికి వెళ్ళింది. అయితే ఆర్థిక స మస్యల కారణంగా దేవకుమార్ ఆదివారం ఉద యం తన సహచర ఉద్యోగులు కొందరికి వాట్సాప్ ద్వారా సందేశాలను పంపాడు. తదుపరి తాను ఇంట్లో నుంచి వెళ్ళిపోతున్నట్లు పేర్కొన్నాడు. తోటి ఉద్యోగులు దేవ్ కుమార్ ఆచూకీ కోసం వెతికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో దేవకుమార్ ఆచూకీపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# వానా నీ జాడెక్కడ?

ఊరిస్తున్న మేఘాలు... చిరుజల్లులతో సరిపెడుతున్న వరుణుడు

పెసరు, మినుము, జొన్న సాగు చేయొద్దంటున్న అధికారులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతన్న ఇంకా అకాశం వైపు చూడాల్సి వస్తుంది. పచ్చటి పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు వరుణుడి కరుణ లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. అకాశం మేఘవృతమవుతున్నా వాన జాడ కనిపించడం లేదు దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభంచారు. పొలాలను దున్ని విత్తు వేశారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో అందోళన చెందుతున్నారు. కొన్ని విత్తనాలు మొతకెత్తినా వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. వేలరూపాయలు వెచ్చించి పత్తి , జోన్న , కంది ,పెసర తదితర రకాల విత్తనాలు వేస్తే భూమిపాలయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే ఎకరాకు దాదాపు రూ.15వేల నుండి 20వేల వరకు ఖర్చైనట్లు రైతులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2.90లక్షల ఎకరాల్లో విత్తనాలు నాటరు. రోహిణి కార్తిలో లేదంటే మృగశిర కార్తిలో విత్తనాలు వేస్తారు. కానీ ఈ ఏడాది జున్ నెల మొత్తం కావస్తున్న ఇంకా 60 శాతం విత్తనాలే వేశారు 40శాతం విత్తనాలు ఇళ్లలోనే ఉన్నాయి. నెల రోజులు అయి పొయినందుకు, పెసర, మినుము, జోన్న పంటలు వేయకపోవడం మంచిది అని అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలో మొత్తం 5.61 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇప్పటివరకు 2.90 లక్షల ఎకరాల్లో మాత్రమే, విత్తనాలు వేశారు. ఓ పక్క మేఘాలు ఊరిస్తున్న సాగుకు సరిపడా మాత్రం కురవడం లేదు, ధైర్యం చేసి కొంతమంది రైతులు విత్తనాలు వేయగా అవి మొతకెత్తుతాయా లేదా అనే అందోళనలో రైతన్న ఉన్నాడు. కొన్ని చోట్ల మొలకెత్తాక కూడా ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల మొలకెత్తలేదు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 16 రకాల పంటలు సాగు చేస్తారు. వీటిలో సింహభాగం, పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలు, గతేడది క్వింటాలు పత్తి 8వేలకు పైగా అమ్ముడుపోవడంతో ఈ సారి పత్తి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.

పత్తి సాధారణ సాగు విస్తీ ర్ణం 2.5లక్షఎకరాల కాగా ఈ ఏడాది అంతుకు మించవచ్చని అధికారులు అంచనా వేశారు. వరి, కంది సాగు సైతం పెరిగె అవకాశం ఉందంటున్నా రు. వరుణుడు కోసం నెల రోజులుగా ఎదురు చూపులు తప్పడం లేదు, వర్షాకాలం ప్రారంభమైంది. మొదలు ఒక్కసారి వర్షాలు కురువగా సగం మంది రైతులు విత్తనాలు వేశారు. ఈ వెంట నే వర్షాలు మొహం చాటేశాయి. నెల రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా చిరుజల్లులకే పరిమితం అ వుతున్నాయి. పూర్తి స్థాయిలో విత్తుకు సరిపడా పదును కావడం లేదు, ఇప్పటికే రైతులు విత్తనాలు , ఎరువులు కొనుగోలు చేసి ఇళ్లకు తెచ్చుకున్నారు. జిల్లాలో 60మిల్లీ మీటర్ల మేర రెండు మూడు సా ర్లు వర్షాలు కురిస్తేనే విత్తుకు అనకులమని అధికారులు అంటున్నారు. అయితే రెండు మూడు మం డలాలు మినాహా తగినంత వర్షపాతం నమోదు కాలేదు, అదును అయ్యే వరకు విత్తనాలు వేయకపోవడంమే మేలని అధికారులు సూచిస్తున్నారు.

# నేటితో సన్న బియ్యం పంపిణీ లాస్ట్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఏక కాలంలో రేషన్ దుకాణాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల మొదటి తేదీ నుండి కొనసాగుతున్న మూడు నెలల కోటా సన్న బియ్యం పంపిణీ మేడ్చల్ జిల్లాలో నేటితో ముగియనుంది. తొంభై శాతానికి పైగా బియ్యం పంపిణీ పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నప్పటికి వివిధ కారణాలతో ఇప్పటి వరకు బియ్యం తీసుకోని రేషన్ కార్డు దారులు తమకు అందుబాటులో ఉన్న దుకాణాల వద్దకు చేరుకొంటున్నారు. గడువు చివరి తేదీ అయిన జూన్ 30 రాత్రి వరకు జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లోనూ సన్న బియ్యం అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో కుటుంబంలో ఉన్న మనిషికి ఆరు కిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని వర్షాకాలం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్‌తో పాటు జూలై, ఆగస్టు నెలల బియ్యం కోటాను జూన్ మాసంలో ఒకే సారి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన బియ్యాన్ని మేడ్చల్ జిల్లా పౌర సరఫరా అధికారులు సిద్దం చేసారు. దీని కోసం జిల్లాలో ఉన్న 618 రేషన్ దుకాణాలకు గాను 32933.198 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించారు. జూన్ ఒకటో తేదీ నుండి ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీలో రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్పటి జిల్లా కలెక్టర్ గౌతం సివిల్ సప్లయిస్ అధికారులు, ఏఎస్ఓలు, డిప్యూటి తహసీల్దార్లు, రేషన్ డీలర్లు, స్టేజి1,2 కంట్రాక్టర్లతో ముందస్తుగా పలు సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసారు.



### ప్రారంభంలో తలెత్తిన ఇబ్బందులు

సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైన తొలి నాళ్లల్లో రేషన్ దుకాణాల మూడు నెలలకు సంబంధించి లబ్దిదారుల నుండి మూడేసి చొప్పున వేలి ముద్రలు తీసుకోవాల్సి రావటం వల్ల అధిక సమయం ఒక్కొక్కరికి పడుతుండటం, బయో మెట్రిక్ యంత్రాలు మొరాయిస్తుండటం, మూడు నెలల కోటాను తూచి ఇవ్వటం తదితర కారణాలతో తీవ్రమైన జాప్యం ఏర్పడసాగింది. ఎలాగైనా తమ కోటా బియ్యం తీసుకోవాలన్న ఆశతో జిల్లాలోని దాదాపు రేషన్ దుకాణాల వద్ద తెల్లవారు జాము నుండే వేచి పెద్ద సంఖ్యలో చేరుకొంటుండటం, చాంతాడంత క్యూలు కట్టటం, తమ వంతు వచ్చే సరికి దుకాణం తెరచి ఉంటుందా లేదా,బియ్యం ఉంటాయా లేదా అని పలువురు తీవ్ర అసహానానికి గురయ్యారు. ఇలాంటి సమస్యలను అధిగమించే క్రమంలో మేడ్చల్ జిల్లా యంత్రాంగం టోకెన్ సిస్టం ప్రవేశపెట్టి రేషన్ దుకాణాలు తెరవటానికి ముందు నంబర్ల వారీగా టోకెన్లు ఇచ్చి వాటి ఆధారంగా బియ్యం పంపిణీ చేసారు. సన్న బియ్యం పంపిణీ ఏర్పాట్లు ప్రణాళికాయుక్తంగా కొనసాగించిన జిల్లా యంత్రాంగం రేషన్ దుకాణాల ద్వారా తీసుకొన్న సన్న బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చకలు జారీ చేసి నిఘా ఏర్పాట్లు చేసారు.

### బియ్యం తీసుకోని రేషన్ కార్డులు కట్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగించిన జిల్లాలో సన్న బియ్యాన్ని ఎంత మంది తీసుకొన్నారు. తీసుకోలేని పక్షంలో కారణాలేమిటన్న విషయాలపై అధికారులు ఆరా తీయనున్నారు. గత ఆరు నెలల నుండి తమ రేషన్ కార్డుల నుండి బియ్యం తీసుకోని లబ్దిదారులకు చెందిన రేషన్ కార్డులను తొలగించేందకు ప్రణాళికలు సిద్దం చేసినట్లు సమాచారం.

### భేదాభిప్రాయాలు, రాజకీయాలకు అతీతంగా

# అభివృద్ధి చేసుకోవాలి

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** భేదాభిప్రాయాలు, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ బృందావన్ కాలనీలో రూ.91 లక్షల వ్యయంతో పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మొక్కలను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ నాటారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి, నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయలను వెచ్చించామని తెలిపారు. బృందావన్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా మంజీరా నీటి సదుపాయం, వీధి దీపాలతో పాటు పార్కు అభివృద్ధి పనులను చేపట్టామని చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి 2023 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయాన్ని అందించిన ప్రజలకు వివేక్ కృతజ్ఞతలను తెలిపారు. నియోజకవర్గం ప్రజలకు నిరంతరం సేవలందిస్తానని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బృందావన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు రవిగౌడ్, వెంకటేశ్వర రావు, రమణ కుమార్, నవీన్, జోగారావు, రాజేష్, రమేశ్, శ్రీనివాస్, విశ్వనాథం, జిలాని, రాజశేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆషాఢమాసం.. బోనాల సంబరం

● ఏడుపాయల వనంలో కిక్కిరిసిన భక్తజనం ● డప్పు చప్పుళ్ళు, మేళ తాళాలతో బోనాలు, ఒడి బియ్యం సమర్పణ





**ప్రజాపక్షం/పాపన్నపేట :** మంజీరా నది ఏడు పాయలుగా చీలి ప్రవహిస్తున్న ప్రాంతం.. జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. దేశంలోనే రెండో వనదుర్గా మాత ఆలయం, ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, బండరాళ్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు, ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నా మనిపించే అనుభూతి, ఇది పాపన్నపేట మండలం ఏడు పాయల వనదుర్గామాత క్షేత్రం సొంతం, ఆషాడ మాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని వనదుర్గామాతను శాకంబరీ దేవి రూపంలో విశేషంగా అలంకరించారు. వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి రూపంలో అమ్మవారు శోభాయ మానంగా భక్తులను దర్శనమిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు మంజీరా నదీ పాయలు, చెక్ డ్యామ్ లో పుణ్య స్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ళు, మేళ తాళాలతో బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. చల్లంగా చూడమ్మా.. వన దుర్గమ్మ తల్లి.. అంటూ భక్తులు వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని షెడ్లు, పచ్చని చెట్ల కింద భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు.

## చందాలతో బోరు రిపేరు చేయించుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి మండల పరిధిలోని చిగురాల పల్లి గ్రామంలో మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో గత కొం తకాలంగా గ్రామంలోని మోటర్ కాలిపోవడంతో మంచి నీటీ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్‌కు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని తీవ్రంగా మండిపడతున్నారు. గత పదిసంవత్సర ల నుండి లేని సమస్య ప్రభుత్వం ఏర్పడిన నుండి గ్రామల్లో నీ టి సమస్య ఎక్కవగా ఉంది అని పలువు విమర్శిస్తున్నరు. రూ.100 చందా వెయవలసి పరిస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో తాగునీటి సమస్య ఎక్కడ రాలేదని , ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం రాగానే విద్యుత్ సమస్య ,మంచినీటి సమస్యలు గ్రామ గ్రామాన తీవ్రంగా ఉన్నాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## మీడియా సంస్థలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** మీడియా సంస్థలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిసిసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో మీడియా సంస్థలపై జరిగిన దాడికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా వ్యవహరించి..ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత మరోవిధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. మహా న్యూస్ చానల్ పై దాడులు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని, దాడి చేసిన వారిని ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసిసేన షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేష్, నాయకులు జయ శ్రీకాంత్, బాల్‌రాజ్, చందు, భాగ్యలక్ష్మి , స్రవంతి, బాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యల పరిష్కారానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ నివాసంలో కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించి సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి కాలనీల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, సభ్యులు ప్రసాద్, రామ్మోహన్ రావు, రామయ్య, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత నృత్య మహోత్సవం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హిందూ సేవా సమితి ఎద్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక, సామాజిక, సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. జరిగాయి. ఆదివారం నగరంలోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వేదికగా జరిగిన మహోన్నత సంగీత నృత్య మహోత్సవ కార్యక్రమానికి వివిధ దేశాల నుంచి భక్తులు, ప్రతినిధులు హాజరయ్యారు. దుర్గా మైత్రేయి నేతృత్వంలో 100 మంది వీణ కార్యక్రమం, 150 మంది భాగవద్గీత పారాయణం, 250 మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. గురు కుమారి కోకా విజయలక్ష్మి , ఎ.రవి కూచిపూడి, స్నేహ, పావని, కోమల్, శ్రీలక్ష్మి ల ఆశీర్వాదంతో ఈ ప్రదర్శనలు కొనసాగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంఎల్‌ఏ వేణుగోపాలాచారి, మాజీ ఎంఎల్‌సి నల్లూరి రామచంద్రరావు, భట్టి విజయ సారథి, గంగధార్ శాస్త్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందూ సేవా సమితి కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా డివి.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా బి.సి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా డి.నిర్మల, సంయుక్త కార్యదర్శిగా యు.లక్ష్మణ్, పి.నాగశిరోమణి బాధ్యతలు చేపట్టారు.

## స్మృతి, సిరిమా కూచిపూడి ప్రదర్శన



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** కూచిపూడిలో ప్రావీణ్యులైన నాట్యాచార్యులు, శ్రీ శారదా నృత్యనికేతన్ గురు శైలజ ప్రసాద్ సమక్షంలో అక్కాచెల్లెళ్లు స్మృతి, సిరిమా ఆదివారం రవీంద్రభారతిలో కూచిపూడి రంగ ప్రవేశం చేశారు. వీరిద్దరి ప్రదర్శన కుటుంబసభ్యులు, అతిథుల సమక్షంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఉమ్మడి ఎపి మాజీ సిఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ అలైఖ్య పుంజాల హాజరై, చిన్నారుల ప్రదర్శన చూసి అభినందించారు. శృతి ఇంటర్ సెకండియర్, సిరిమా తొమ్మిదో తరగతి చదువుతుంది. స్మృతి టెన్నిస్, చెస్‌లో, సిరిమా బాస్కట్‌బాల్ ప్లేయర్, ఎడిటింగ్‌లో రాణిస్తున్నారు. ప్రణమామ్యహం శివస్తుతితో మొదలై అన్నమాచార్య కీర్తన, భామాకలాపం, దేవి స్తుతి, తిల్లానా, మంగళంతో వీరిద్దరి నృత్య ప్రదర్శన ముగిసింది. మంతా శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ గణేశ్ గుప్తా, రిటైర్డ్ డిజిపి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీత యాదవరెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సమాజసేవలో అంకిత భావంతో పనిచేసే నాయకుడు, ప్రముఖ హ్యూమనిస్ట్ వంగూరి యాదవరెడ్డి డాక్టరేట్ అవార్డు అందుకోవడం అభినందనీయమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. అదివారం ఆర్‌కెపురంలో యాదవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భాస్కర్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ యాదవరెడ్డి సేవా దృక్పధం ప్రజల పట్ల నిబద్దత విలువలతో కూడిన జీవన శైలి ఆయనను ఈ గౌరవానికి అర్హుడిగా చేశాయన్నారు. అనంతరం యాదవరెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన తనకు ఏషియా ఇంటర్ నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో స్ఫూర్తి అకాడమీ అధినేత చెన్నారెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. నాకు ఈ అవార్డు రావడానికి సహకరించిన డాక్టర్ కొమ్ము వెంకన్నకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్నా గణేష్‌నేత, తాడేపల్లి వెంకటేశంగుప్త, ఆలయ కమిటీ ఛైర్మన్ సురేష్, తలాటి రమేష్‌నేత, మామిడి రామకృష్ణగౌడ్, లింగస్వామిగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎఫ్‌సిఐ కాలనీ ఎన్నికల్లో నరసింహారావు ఫ్యానల్ విజయం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించగా పోరెడ్డి వెంకట్‌రెడ్డి ఫ్యానల్‌పై ఆది నరసింహారావు ఫ్యానల్ ఘన విజయం సాధించారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్ ఎన్నికల అధికారులు ఎన్నికలు నిర్వహించగా పోరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆది నరసింహ రావు అధ్యక్షులుగా పోటీ చేశారు. దీంతో ఆది నరసింహారావు ఫ్యానల్ వెంకట్‌రెడ్డి ఫ్యానల్‌పై భారీ మెజార్టీతో గెలుపొందారు. నూతన కాలనీ అధ్యక్షులుగా ఆది నరసింహారావు, ఉపాధ్యక్షులుగా ఈరటి రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సలుకూటి చంద్రశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వేములపల్లి కృష్ణారావు, పల్లే వాణి, వడ్డేపల్లి సత్యానారాయణ, కార్యవర్గ సభ్యులుగా జక్క అనురాధరెడ్డి, గజ్జెల ఝాన్సీ లక్ష్మి , కందాళ యాదిరెడ్డి, కస్తూరి మురళిక్రిష్ణ, మల్లబోయిని మాల్యాద్రి, భత్తార్ రాఘవ చారి ఎన్నకల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆది నరసింహ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలుపించిన కాలనీ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం పాటుబడుతామని ఆయన పేర్కొన్నారు.

# పాత నగరాభివృద్ధికి మత రాజకీయాలు అడ్డు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాత నగరం అభివృద్ధికి మత రాజకీయాలు అడ్డుపడుతున్నాయని, పాతబస్తీ అభివృద్ధి చెందితే తమ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందనే భయంతోనే మతపార్టీలు అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి.నరసింహ ఆరోపించారు. సిపిఐ చంద్రాయణ గుట్ట నియోజకవర్గ నాలుగవ మహాసభ ఆదివారం స్థానిక మిల్లత్ ఫంక్షన్ హాల్‌లో మహమ్మద్ సలీం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటి నరసింహ మాట్లాడుతూ రెండు పార్టీలు పాత నగరాన్ని అభివృద్ధి కాకుండా అడ్డుకుంటున్నాయన్నారు. పాత నగరంలో అభివృద్ధి జరిగి, విద్యా, ఉద్యోగ రంగాలలో యువత అవకాశాలు పొందితే తమ మాట చెల్లుబాటు కాదనే దురుద్దేశంతోనే మత ఘర్షణలకు ప్రేరేపిస్తున్నాయని విమర్శించారు. పాత నగర అభివృద్ధి చెందాలని, ప్రజల సమస్యల పరిష్కారం కావడం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయన్నారు. రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారం అనేక డివిజన్‌లలో సంబంధిత అధికార కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయటం జరిగిందన్నారు. పాత నగరంలో మెట్రో రైలు ప్రారంభించాలని అనేక దఫాలుగా వివిధ పద్ధతులలో పోరాటాలు జరిపామని తెలిపారు. మత రాజకీయాలు చేస్తున్న ఎంఐఎం మెట్రోరైల్‌ను అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేసిందని విమర్శించారు. కానీ అఖిల పక్ష ఆధ్వర్యంలో సిపిఐ నాయకత్వం వహిస్తూ ప్రజలను చైతన్యం చేసి, ప్రజా ఉద్యమం ముందు మతతత్వ పార్టీలు తలవంచేలా చేశామన్నారు. మెట్రో రైల్ నిర్మాణ పనులు ఇప్పుడు వేగంగా జరగడానికి సిపిఐ పోరాటాలే కారణమన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ భవిష్యత్తులో పాత నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పాత నగర అభివృద్ధికి ప్రత్యేకించి, విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. బడ్జెట్ కేటాయించి నగరంతో సమానంగా అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేర్లకంటి శ్రీకాంత్, ఇన్సఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, ఇమ్రాన్, షహీన్, షబ్బీర్, గౌస్, శివకుమార్ పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...** సిపిఐ చంద్రయాణగుట్ట నియోజకవర్గ కన్వీనర్‌గా మహ్మద్ ఇమ్రాన్, సభ్యులుగా మహమ్మద్ సలీం, షహీనా బేగం, శివకుమార్, షబ్బీర్, సయ్యద్ అలీ, సాబీర్ ఖాన్, ఫైజులా బేగ్, సలీం తదితరులు ఎన్నికయ్యారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/షాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ నరేంద్రమోదీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జులై9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులపై, రైతులపై దాడులు చేయడం మొదలుపెట్టారని, కార్మికులు ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న 44రకాల చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారివర్గాలకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్‌లను మార్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేశారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌రంగానికి అప్పగిస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందని ఆరోపించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడటంతోపాటు వేలాది మంది కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయి జీవన విధానం అగమ్యగోచరంగా తయారైందని వివరించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, వడ్ల సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, బిఓసి జిల్లా కార్యవర్గ సభ్యుడు జయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై పోరాటం

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/తుర్కయాంజల్ :** ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటి రాగన్నగూడ సిపిఐ శాఖ మహాసభ జిల్లా సమితి సభ్యులు పి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరూ ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అంటే అది ప్రజల సిద్ధాంతమని, నిరంతరం ప్రజల సమస్యలపై పనిచేసే సిద్ధాంతం అని తెలిపారు. ప్రజల కష్టాలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్ర జెండా ఉంటుందన్నారు. రాగన్నగూడ శాఖ పరిధిలో డ్రైనేజ్, మంచినీటి, కాలనీ రోడ్డు సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాగన్నగూడ వార్డు పరిధిలో అనేక సమస్యలపై సిపిఐ పార్టీ పోరాడుతుందన్నారు. మత్తుకు బానిస కాకుండా విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం సిపిఐ రాగన్నగూడ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పల్లపు శివ కుమార్, సహాయ కార్యదర్శిలుగా శ్రీకాంత్, లోకేష్ లతో పాటు 9 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో జనార్ధన్, శ్రీనివాస్ గౌడ్, కొండిగారి శివకుమార్, శ్రీకాంత్, గోవర్ధన్, లోకేష్, పృధ్వి, వంశీ,నాగేశ్వర్ దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వారాంతంలో ప్రత్యేక డ్రంక్ డ్రైవింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ 372, త్రిచక్ర వాహనాలు నడిపే వారు 22 కాగా మరో 57 మంది నాలుగు చక్రాల వాహనాల వారితోపాటు భారీ వాహనాలు నడిపే ముగ్గురు తో కలిపి మొత్తం 454 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారి నుండి రక్తంలో ఆల్కహాల్ సాంద్రత (బి ఎ సి) స్థాయిల ఆధారంగా వర్గీకరించారు. అరెస్టు చేసిన వారిని సోమవారం న్యాయస్థానం ముందు హాజరు పడుతున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసు =లు పునరుద్ఘాటించారు. ఎవరైనా మద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, అటువంటి వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత,2023 (హత్యకు సమానం కాని నేరపూరిత నరహ) సెక్షన్ 105 కింద కేసు నమోదు చేయబడుతుంది. ఈ సెక్షన్ కింద గరిష్ట శిక్ష 10 సంవత్సరాల జైలు శిక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పౌరులందరూ బాధ్యతగా వాహనాలు నడపాలని, రోడ్డు భద్రతను నిర్ధారించాలని కోరారు.

# మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

### రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/షాబాద్ :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, క్రీడలను గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో పిఆర్‌ఆర్ స్టేడియంలో ఎఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మెన్ ఎలుగంటి అబిరాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌పిఎల్ 3 క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో యువతను అన్నిరంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. షాబాద్ ప్రాంత అభివృద్ధికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధుసూదన్ రెడ్డి, గుడ్డిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ చంద్రశేఖర్ కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకేసారి కాకుంగా దశల వారీగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. గ్రామీణ పేదలకు విద్య, వైద్యం అంధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుతూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని వివరించారు. బిజెపి, టిఆర్ఎస్ పార్టీలకు చెందిన 50మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసే కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని వివరించారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు షాబాద్ దర్శన్, సింగిల్‌విండో చైర్మన్ ప్రతాప్ రెడ్డి, పెద్ద మంగళారం పిఎసిఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మల్లేష్, జనార్ధన్‌రెడ్డి, నరేందర్, నరసింహారావు, రవీందర్, శ్రీనివాస్ గౌడ్, బోకుల లింగం, జంగయ్య, నరేందర్‌రెడ్డి, సర్థానగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కిశోర్‌నాయక్, గౌరీశ్వర్, రవీందర్ యాదవ్, అశోక్, జంగయ్య, చేవెళ్ల స్వామి, నరసింహారావు, మహ్మద్ అన్వర్‌పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గాడి తప్పిన ప్రజాసంక్షేమం

### మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**ప్రజాపక్షం/కొత్తూరు :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పూర్తిగా గాడి తప్పి పోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. ఆదివారం కొత్తూరు మండలం తిమ్మాపూర్ వద్ద మాజీ మంత్రి హరీష్‌రావుకు స్థానిక ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి భారీ కాన్వాయ్‌తో కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని పొడగుట్టతండాకు చెందిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ తండ్రి గోప్యానాయక్ దశదిన కర్మలో పాల్గొన్నారు. గోప్యనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పూర్తిగా అస్తవ్యవస్థంగా తయారయిందని విమర్శించారు. పంచాయతీల్లో పాలన గాడి తప్పిందని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు ప్రజా ప్రతినిధులు లేక ఏడాదిన్నర అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టించుకునే నాధులే లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా ఎక్కడి సమస్యలను అక్కడే ఉన్నాయని మండిపడ్డారు. న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తే కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ ఎన్నికలు గుర్తుకు రాలేదని ఆరోపించారు. ఇప్పటికైన రాష్ట్రం ప్రభుత్వం కళ్ళు తెరిచి పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీష్‌రావుకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వై.అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మాజీ ఎస్టి, ఎస్సీ కమిషన్ సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## మీడియాపై దాడులు సరికాదు




### టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర మఫిషియల్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** హుందాతం గా వ్యవహరించాలే తప్పా మీడియా సంస్థలపై దాడులు సరైన పద్ధతి కాదని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర మఫిషియల్ కమిటీ కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆదివారం షాద్‌నగర్‌లో మహాన్యూస్ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం ఇవ్వడంతోపాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుడిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలు అధికార పార్టీకి సూచనలు, సలహాలు ఇస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సి ఉంటుందని, కానీ ఉన్నది ఉన్నట్టుగా వార్తలు ప్రచురిస్తే జీర్ణించుకోలేక మీడియా సంస్థలపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పదేళ్ళు అధికారంలో ఉండి మీడియా సంస్థలను సర్వనాశనం చేయడమే కాకుండా నేడు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని ఏకంగా సంస్థలపైనే గుండాలతో దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చెక్కల శ్రీశైలం మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులు బయట పడుతుంటే చూసి జీర్ణించుకోలేక ఏకంగా మీడియా సంస్థలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య విధానానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించి వీధి రౌడిల్లాగా మహాన్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. షాద్‌నగర్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నరసింహా మాట్లాడుతూ అధికారంలో ఉండి చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే దాడులకు పాల్పడుతున్నారన్నారు. యంత్రాంగం మీడియా సంస్థపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు కొనియాల భాస్కర్, జిల్లా కార్యదర్శి ధన్నారం రమేష్,( జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్, అల్వాల దర్శన్, విష్ణు, నీరటి శివకుమార్, ఫయాజ్, ఇలియాస్, సమీ, సలీం, సాబేర్, శ్రీకాంత్, ఖాజసోయల్, శ్రావణ్ గౌడ్, మహ్మద్ రియాజ్, కార్తీక్, రమేష్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## టీమిండియా చేతిలో దారుణ ఓటమి

## ఇంగ్లాండ్ జట్టుకు జరిమానా!

స్వదేశంలో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత మహిళల జట్టు చేతిలో చిత్తుగా ఓడిన ఇంగ్లాండ్‌కు ఐసీసీ షాకిచ్చింది. స్లో ఓవర్ రేటు కారణంగా నాట్ సీవర్ బ్రంట్ నేతృత్వంలోని ఆతిథ్య జట్టుకు జరిమానా విధించింది. నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్‌బ్రిడ్జ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు ఇంగ్లండ్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం ఫైన్ వేసింది. రిఫరీ ఫిర్యాదు మేరకు నాట్ సీవర్ బ్రంట్ తన పొరపాటును అంగీకరించింది. అందుకు ఐసీసీ విధించే మ్యాచ్ ఫీజులో కోతకు కూడా ఆమె ఓకే చెప్పింది. తొలి టీ20లో భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఇంగ్లాండ్ బౌలింగ్ యూనిట్ జడుసుకుంది. పవర్ ప్లేలో ఓపెనర్లు స్మృతి మంధానా(112), షఫాలీ వర్మ(20)ల జోరుతో బెంబేలెత్తిపోయిన ఇంగ్లీష్ సారథి నాట్ సీవర్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. మంధాన, డియోల్ వీరకొట్టుడుకు డీలా పడిన ప్రత్యర్థి బౌలర్లు నిర్ణీత సమయంలోపు ఓవర్లు పూర్తి చేయలేకపోయారు. రెండు ఓవర్లు వెనకబడడంతో మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించింది ఐసిసి.

### తిప్పేసిన శ్రీచరణి

సొంతగడ్డపై ఆధిపత్యం చెలాయించాలనుకున్న ఇంగ్లాండ్‌కు భారత జట్టు ఊహించని ఓటమిని కానుకగా ఇచ్చింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గాయపడడంతో సారథిగా వ్యవహరించిన స్మృతి మంధాన విధ్వంసక సెంచరీతో కదం తొక్కింది. పొట్టి ఫార్మాట్‌తో మొదటి శతకంతో మంధాన గర్జించగా.. హర్లీన్ డియోల్(43) మెరుపు బ్యాటింగ్‌తో భారత్ 5 వికెట్లు కోల్పోయి 210 పరుగుల భారీ స్కోర్ చేసింది. భారత బౌలర్ల ధాటికి ఛేదనలో ఆది నుంచి ఇంగ్లండ తడబడింది. తెలుగమ్మాయి శ్రీ చరణి(412) తిప్పేయడంతో వరుసగా వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు 113కే ఆలౌటయ్యింది. కెప్టెన్ నాట్ సీవర్(66) అర్ధ సెంచరీతో పోరాడినా మిగతా వాళ్లు పెవిలియన్‌కు క్యూ కట్టగా టీమిండియా 97 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.






## హైబ్రిడ్ మోడల్‌లో ఆసియాకప్..

## జూలైలో షెడ్యూల్

ఈ ఏడాది జరగాల్సిన పురుషుల ఆసియా కప్ నిర్వహణపై అనిశ్చితి కొనసాగుతోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో టోర్నీ సాధ్యాసాధ్యాలపై ఆసియా క్రికెట్ మండలి మల్లగుల్లాలు పడుతోంది. అయితే.. ఇరుదేశాలు తటస్థ వేదికపై ఆడేందుకు అంగీకరిస్తాయనే ఉద్దేశంతో ఏసిసి షెడ్యూల్ విడుదలకు సిద్దమవుతోంది. జూలై రెండో వారంలో పూర్తి షెడ్యూల్ ప్రకటించేందుకు సన్నాహకాలు చేస్తోంది. దాయాది దేశాల బోర్డులు తమ పట్టుసడలిస్తే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌ను ప్రారంభించాలని మొహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని ఏసీఏ భావిస్తోంది. షెడ్యూల్ ప్రకారం భారత్ వేదికగా సెప్టెంబర్ రెండో వారం అంటే.. 10 వ తేదీన ఆసియా కప్ జరగాల్సి ఉంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్‌లతో పాటు అఫ్గనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏయూలు ట్రోఫీ కోసం పోటీ పడనున్నాయి. కానీ.. భారత్, పాకిస్థాన్ల మధ్య పరిస్థితులు ఇంకా చక్కబడలేదు. దాం తో, ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో ఆడించాలని ఏసీఏ యోచిస్తోంది. తమ గడ్డపై ఆసియా కప్ మ్యాచ్‌ల నిర్వహణకు యూఏఈ సిద్ధంగా ఉంది. అయితే.. షెడ్యూల్ విడుదలయ్యాక బీసీసీఐ ఆలోచన ఏమైనా మారుతుందా? అనే ఏసీఏ వేయి కళ్లతో ఎదురుచూస్తోంది.

### ఐసిసికి బిసిసిఐ లేఖ

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. అంతేకాదు ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తే లేదని.. ఇకపై తమను ఒకే గ్రూప్‌లో ఉండకుండా చూడాలని ఐసీసీకి బీసీసీఐ లేఖ రాసింది. దాంతో, అంతర్జాతీయ టోర్నీలో తప్ప ద్వైపాక్షిక సిరీస్‌లో దాయాది దేశాల ఆట చూడడం ఇక అసాధ్యమే. దాంతో, ఐసీసీ ఈవెంట్లు, ఆసియా కప్ వంటి టోర్నీల్లో భారత్, పాక్ తలపడితే చూడాలని అభిమానులు ఎంతో ఆత్రుతతో ఉన్నారు.

## బౌలర్లు సమష్టిగా రాణించాలి

### మాజీ కెప్టెన్ అజారుద్దీన్

ఇంగ్లాండ్ పర్యటనను ఓటమితో ఆరంభించిన భారత జట్టు సిరీస్ సమం చేయాలనే పట్టుదలతో ఉంది.



ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో గంటలకొద్దీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు టీమిండియా క్రికెటర్లు. అయితే.. సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌కు వర్క్‌లోడ్ కారణంగా పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉండడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యలో మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు ఎక్కువగా బుమ్రాపై ఆధారపడుతోందని.. అలాకాకుండా బౌలర్లు సమిష్టిగా రాణించాలని అజారుద్దీన్ అభిప్రాయపడ్డాడు. 'భారత జట్టు బౌలింగ్ యూనిట్‌లో బుమ్రాపై అతిగా ఆధారపడుతోంది. ప్రతిసారి అతడు మెరుగైన ప్రదర్శన చేయలేడు కదా. పైగా ఇంగ్లాండ్ పిచ్‌ల మీద అనుభవజ్ఞులైన బౌలర్లు ఉంటేనే వికెట్లు తీయగలం. అందుకే.. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలి. చైనామన్ బౌలర్ అయిన కుల్దీప్ వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించగలడు. ఈమధ్య అతడు గొప్పగా రాణిస్తున్నాడు' అని అజారుద్దీన్ తెలిపాడు. లీడ్స్ టెస్టులో అనూహ్య ఓటమిపై కూడా ఈ దిగ్గజ క్రికెటర్ స్పందించాడు.

# ఆరోగ్యం

## ఫోకస్

## క్యూబా విధానం.. అనుసరణీయం



విద్య, వైద్య రంగాలను జాతీయం చేయాలన్న డిమాండ్ మన దేశంలో ఎంతోకాలంగా వినిపిస్తున్నది. కానీ, అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. గత దశాబ్దకాలంగా ఈ రెండు రంగాల్లోనూ ప్రైవేటీకరణ మరింత బలంగా వేళ్లానుకుంటున్నది. ప్రభుత్వాలు నిజంగానే ప్రజల సంక్షేమాన్ని కోరితే, తప్పకుండా క్యూబా విధానాన్ని ఆచరించాలి. ప్రత్యేకించి అక్కడి వైద్య రంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకం. ఫిడేల్ కాస్ట్రో పాలనలో ఆరోగ్య రంగం అసాధారణమైన పురోగతిని సాధించింది. కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే సాధ్యమైనదిగా భావించే ఆరోగ్య ప్రమాణాలు క్యూబాలో ఉన్నాయంటే, అక్కడి వైద్య విధాన స్థాయిని అర్థం చేసుకోవచ్చు. అక్కడ సార్వత్రిక, ఉచిత ఆరోగ్య సేవలు ఆరున్నర దశాబ్దాలుగా అమలవుతున్నాయి. 1960 దశకాల్లో ప్రవేశపెట్టిన సార్వజనీన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అద్భుత ఫలితాలనిస్తున్నది. నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకూ, దేశ వ్యాప్తంగా ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది. అక్కడ అన్ని వయస్సుల వారికీ సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు, చికిత్స, శస్త్రచికిత్సలు, మందులు ఉచితంగా లభిస్తాయి. దేశవ్యాప్తంగా హాస్పిటళ్లు, ఆరోగ్య కేంద్రాల స్థాపన జరిగింది. మొబైల్ క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయి. పల్లెటూర్లకు నడుచుకుంటూ వెళ్లి, వైద్య సేవలు అందించే వ్యవస్థ అక్కడ ఉంది. లాటిన్ అమెరికన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఇఎల్ఎఎం) ప్రపంచవ్యాప్తంగా వచ్చే విద్యార్థులను ఉచితంగా వైద్య విద్య అందిస్తూ, ప్రపంచంలో అతిపెద్ద వైద్య కళాశాలగా వెలుగుతున్నది. క్యూబాలో ప్రతి 1000 మందికి దాదాపు 8 డాక్టర్లు ఉన్నారు. ఇది అమెరికా, యూరోపియన్ దేశాల కంటే ఎక్కువ. ప్రపంచంలోని పలు పేద దేశాలకు క్యూబన్ వైద్యులు సేవలు అందించడం విశేషం. కాగా, అక్కడ ప్రతి 150–200 కుటుంబాలకు ఒక కుటుంబ వైద్యుడిని నియమించడం ద్వారా ప్రతిరోజూ హెల్త్ మానిటరింగ్ సజావుగా సాగుతున్నది.



రోగం వచ్చిన తర్వాత చికిత్స కంటే, పూర్వ నిర్ధారణ, నివారణ వంటి అంశాలపైనే క్యూబన్ వైద్యులు దృష్టి పెడతారు. నవజాత శిశువు నుంచి పండు ముదుసలి వరకూ ప్రతి ఒక్కరికీ నిరంతర ఆరోగ్య పరిశీలన జరుగుతుంది. మిగతా దేశాల కంటే ఎంతో ముందుగానే, 1962 నాటికే క్యూబాను పూర్తిగా పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దారు. క్షయ నుంచి మీజిల్స్ వరకూ అనేకానేక వ్యాధులకు సమగ్ర వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుంది. ప్రపంచ అత్యధిక అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో అక్కడ శిశు మరణాల చాలా తక్కువగా ఉంది. హెబెర్ బయోటెక్, సిఐఎం వంటి సంస్థలు ప్రపంచ స్థాయి బయోటెక్ పరిశోధనలకు కేంద్రాలుగా ఎదిగాయి. దయాబెటిక్ ఫుట్ అల్సర్ చికిత్స కోసం రూపొందించిన హెబెర్‌ప్రోటీపీ (HeberprotP) అనే మందు, అనేక దేశాలకు ఎగుమతి అవుతోంది. క్యాన్సర్, హెపటైటిస్, మెనింజైటిస్ వంటి వ్యాధులపై అభివృద్ధి చేసిన వ్యాక్సిన్లను కూడా పలు దేశాలకు పంపుతున్నారు. క్యూబన్ వైద్యులు ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాల్లో సేవలు అందిస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, అత్యవసర బృందాలను పంపే 'హెన్రీ రీవ్ బ్రిగేడ్' (Henry Reeve Brigade) ప్రపంచ ఖ్యాతిని ఆర్జించింది. గడించింది. అక్కడి ప్రభుత్వం ఆహార భద్రత, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటుంది. మానసిక ఆరోగ్యం కోసం ప్రత్యేక కేంద్రాలు, సామాజిక సేవల బృందాలు ఉన్నాయి. క్యూబా ఆరోగ్య వ్యవస్థ తీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), యునెస్కో వంటి సంస్థలు ప్రశంసించాయి. వైద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన అంశాలపై ప్రపంచ దేశాలకు క్యూబా ఆదర్శంగా నిలుస్తున్నది. ఆ దేశం అనుసరిస్తున్న విధానాలను మిగతా దేశాలకు మార్గదర్శకాలు.

## ఆరోగ్యానికి కరివేపాకు

ప్రతి ఇంట్లో.. దాదాపు అన్ని రకాల వంటకాల్లో కరివేపాకు తప్పకుండా వాడతారు. చాలా మంది తినే సమయంలో దీనిని పక్కకు తీసేయడం కూడా సహజమే. అందుకే, నిర్లక్ష్యం చేశారు అన దానికి 'కరివేపాకులా తీసిపారేశారు' అనే సామెత కూడా ఉంది. అయితే, కరివేపాకు అపారమైన ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది చలువ చేస్తుంది. తాపాన్ని హరిస్తుంది. కుష్టు వంటి చర్మవ్యాధులను దరిచేరనియ్యదు. నులిపురుగులను నశింపచేస్తుంది. ఆకలిని పెంచుతుంది. మంచి జీర్ణకారి. నోటి దుర్వాసన పోగొడుతుంది. జిగటవిరేచనాలను అరికడుతుంది. ఈ సమస్యతో బాధపడేవారు కరివేపాకు రసం 20 గ్రాముల చొప్పున రోజుకి రెండు నుంచి మూడు సార్లు తాగితే మంచి ఫలితం ఉంటుందని అంటారు. వాంతులను కూడా కరివేపాకు హరిస్తుంది. జ్వరతాపంలో కరివేపాకు రసం తాగించడం వలన ఉపశమనం ఉంటుంది. కరివేపాకు ఎండబెట్టి పొడిచేసి ఒక చెంచా మోతాదులో రోజుకు రెండుసార్లు తింటే, రక్తపోటు అదుపులోకి వస్తుంది. మూత్రసంబంధ రోగాలలో కూడా కరివేపాకు పనిచేస్తుంది. కరివేపాకును నూరి ఆముద్దను పైన పట్టిస్తే, దురద, గజ్జి మొదలైన చర్మవ్యాధులు తగ్గుతాయి. అదేవిధముగా విషకీటకాల కాటు పైన కరివేపాకును ముద్ద చేసి కట్టు కడితే, విషదోషం తగ్గుతుంది. కరివేపాకు, ధనియాలు కలిపి దోరగా వేయించి నూనెతో తయారుచేసిన పొడిని ప్రతినిత్యం ఆహారంలో తింటే, జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఏ జబ్బులు రాకుండా ఆరోగ్యంగా ఉండడం సాధ్యమవుతుంది. ఇన్ని ఔషధ గుణములు కలిగిన కరివేపాకును మనం వాడుకలో నిర్లక్ష్యం చేయడం తగదు.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## నిర్వాసితులకు సింగరేణి ప్యాకేజీ

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్




**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు ఏరియాలోని జెకె 5 ఒసి వల్ల భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీ మాదిరిగానే జెకె 5 ఒసి పొడిగింపు ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్యాకేజ్ అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం 24 ఏరియాలోని కమ్యూనిటీ హాల్‌లో బొల్లి కొమరయ్య, కుమ్మరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సిపిఐ ఇల్లందు పట్టణ 18వ మహాసభలో ఆయన మాట్లాడారు. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందులో ఉపాధి అవకాశాలు లేక వెనుకబాటుతనానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లందుపై దృష్టి సారించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఇల్లందు నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించాలని కోరారు. ఇల్లందు ఏరియాలో బొగ్గు బావులు అంతరించిపోవడం జరిగిందని, కాచనపల్లి, గుండాల ప్రాంతాలలో బొగ్గు బావులు వెలుగు తీసి ఇల్లందుకు భవిష్యత్తు తీసుకురావాలని కోరారు. ఇల్లందు పట్టణంలోని 8వేల ఇండ్లకు 76 జిఒ ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిర్యాల రంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎండి నజీర్, ఎఐటియుసి ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉడుత ఐలయ్య, బంధం నాగయ్య, చాట్ల గణపతి, సుందర్, కమటం చంద్రకళ, అలుగు సరిత, తడికల శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## అసమానతలు లేని సమాజనిర్మాణమే లక్ష్యం

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఆర్థిక అసమానతలు, దోపిడీ లేని సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా సిపిఐ పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా రేగొండ సిపిఐ 17వ మహాసభలు రూపిరెడ్డి పల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పనిచేస్తుందన్నారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు కార్యకర్తలు కార్యోన్ముఖులై పనిచేయాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.వెంకటరాములు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేషన్ శక్తులకు లబ్ధి చేకూరుస్తుందని ధ్వజమెత్తారు. సభకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శాంతికుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నారపు రాజేందర్, అధ్యక్షత వహించగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి చంద్రమౌళి, సిపిఐ నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, రేగొండ మండలం కార్యదర్శి పెంట రవి, మార్క రామయ్య, చక్రపు ఆగయ్య, ప్రకాష్, పెరుమాండ్ల పద్మ, కడారి భవాని, కూరాకుల లలిత, బోట్ల చంద్రమౌళి, జమలాపురం బాబురావు, ఎడ్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రజాసమస్యలే అజెండాగా పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/డిండి :** ప్రజా సమస్యలే అజెండాగా, ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపనకు ఎర్రజెండా పోరాటం చేస్తుందని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం డిండి మండల 15వ మహాసభ మండల కేంద్రంలోని ఇజె గార్డెన్‌లో జరిగింది. మహాసభ సందర్భంగా పట్టణంలో సిపిఐ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి పోరాడే పార్టీ సిపిఐ అన్నారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడికి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా మళ్ళి సిలిండర్ ధర పెంచడం అన్యాయమన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర మరియు, ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్త శుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. దేవరకొండ నియోజకవర్గ ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి నియోజకవర్గాన్ని సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ కాంగ్రెస్ పొత్తును మిత్ర ధర్మంగా ప్రభుత్వ పథకాల్లో సిపిఐ కార్యకర్తలకు అవకాశం కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో సైతం పొత్తులో భాగంగా అవగాహన మేరకు ప్రాతినిధ్యం ఉన్న గ్రామాల్లో పొత్తులో భాగంగా పోటీ చేయాలని శ్రేణులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లలో పేదలకు ప్రాధాన్యం కల్పించాలని, ప్రజా పాలనలో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, శైలేష్, కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, వెంకటేశ్వర్లు, కేశవులు, శ్రీనయ్య, హుస్సేన్, లచ్చయ్య, మహిళా సమాఖ్య డివిజన్ ప్రధాన కార్యదర్శి మంజుల, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్‌ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నదన్నారు. కార్మికులు పనిచేసే కేంద్రాలలో సామాజిక భద్రత కల్పించి, కార్మికులందరికీ వెల్ఫర్ బోర్డు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు రూ. 9000 పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు 25 లక్షల రూపాయలు ఇవ్వాలని, కనీస వేతనాలు అందని కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం అందించాలన్నారు. రాష్ట్రంలో ఉపాధి కోల్పోయి ఆటో కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని, వారిని ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని, కనీస వేతన చట్టం అమలు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశానికి బత్తిని సదానందం అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్, రాజేష్ ఖన్నా, దుర్గా ప్రసాద్, అశోక్, రాస మల్ల కుమార్, గుంటి రాజేందర్, రాము, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు




## సెక్యులర్, సోషలిజం పదాలంటే బిజెపికి భయం

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** సెక్యులర్, సోషలిజం పదాలంటే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కి భయమని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సిపిఐ 22వ వార్డు పరిధిలోని కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీ శాఖ, కంకరబోర్డు శాఖ మహాసభలు చింతకుంట్ల వెంకన్న, రవిచంద్రబోస్ అధ్యక్షతన ఆదివారం జరిగాయి. సభలకు ముఖ్య అతిథిగా విజయసారథి హాజరై మాట్లాడుతూ గత 11ఏళ్ళుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కులాలు, మతాలు రెచ్చగొడుతూ పాలిస్తోందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న మారణహోమాన్ని ఆపాలని, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సెక్యులర్ పార్టీగా ఉన్న బారత కమ్యూనిస్టు పార్టీ బిజెపిని ఎదిరించి పోరాడుతుందన్నారు. సిపిఐ మహబూబాబాద్ జిల్లా మహాసభలు జూలై 5,6తేదీల్లో కురవి మండల కేంద్రంలో జరగబోతున్నాయని, మేధావులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , ఎండి మహ్మద్, మాలోతు రవీందర్, రవిచంద్రబోస్, కూరాకుల పాల్, తోట రమేష్, తండ శ్రీనాథ్, పూర్ణాచారి,ఓం ప్రకాష్, సోమయ్య, ఐలయ్య, చరణ్ తదితరతులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపాదికన బునాదిగాని కాల్వ పూర్తి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/వలిగొండ :** బునాదిగాని కాల్వను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి, ఈ ఖరీఫ్ పంటకు సాగునీరు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ వలిగొండ మండల 14వ మహాసభ వలిగొండ మండలం నర్సాపురం గ్రామంలో ఎలగందుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. మహాసభల సందర్భంగా సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని ప్రభాకర్ పేర్కొన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐకు ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్క దయాకర్ రెడ్డి, మరుపాక వెంకటేష్, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్ నాయకులు బాలగోని సత్యనారాయణ, పులిపల్పుల మల్లేశం, సల్వద్రి రవీందర్, బోడిగే సుదర్శన్, అంబటి అంజయ్య, మారోజు నరసింహ చారి, సుద్దాల సాయికుమార్, నార్కెట్పల్లి మచ్చగిరి, కట్ల యాదగిరి, మేడి దేవేందర్, పోశబోయిన బొందయ్య, చేగురి పాపయ్య, సాలిగంజి కృష్ణ కుమార్, బోడ సునీత, రేణుక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.మహాసభలో చర్చించి పలు తీర్మారాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వలిగొండ మండలంలో ఉన్నటువంటి సాగునీటి కాలువలు, భీమలింగం కాలువలను పూర్తి చేసి రైతులకు సాగనిరు అందించాలని, భీమలింగం కాల్వను వెల్వర్తి నుండి ఐదు మీటర్ల వెడల్పుతో చివరి ఆయకట్టు ఆయన దుపెల్లి ఎల్లమ్మ చెరువు వరకు పొడిగించి పూర్తి చేయాలని, వలిగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫారం మరమ్మతుల కేంద్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని, మూసి నది ప్రక్షాళన చేసి వ్యవసాయా రంగానికి స్వచ్ఛమైన నీరు అందించాలని, ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బాకాయిలను వెంటనే విడుదల చేసి, పని దినాలను పెంచాలని, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని మహాసభలో డిమాండ్ చేశారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## మంత్రికి సన్మానం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని వీరభద్ర స్వామి ఉత్సవ ఆలయ కమిటీ సభ్యులు, యాదవ నగర్ యూత్ ఆధ్వర్యంలో పశు సంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్, క్రీడలు, యువజన, మత్స్య శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరిని సన్మానించి, ఆలయ అభివృద్ధికి మంత్రిగా మీ వంతు తోడ్పాలని కోరడైనది. కార్యక్రమంలో కల్లూరు నాగప్ప, గుంతలి శివకుమార్, శివ కుమార్ మేస్త్రి, ఈసారి నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేకస్థానం

'ముడా' చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేక స్థానం ఉందని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని 29 వ వార్డు కుమ్మరివాడిలో సేవాదళ్ అసెంబ్లీ ఆధ్యక్షులు జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముడా చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ విభాగం ముందుండి పని చేస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సేవాదలకు ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. జిల్లాలో సేవాదళ్‌ను మరింతగా బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్ పాష, దేవరకద్ర అసెంబ్లీ ఇన్చార్జి వేణుకుమార్, నాయకులు సుబాష్ ఖత్రి, దేవన్న, శ్రీను, లోక్‌నాథ్, ఉమర్, అలీ, అల్లాఫ్, షబ్బీర్ అలీ, విజయలక్ష్మి, ప్రమీల, లింగమ్మ, శ్రీశైలం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దౌర్జన్యంగా ఇల్లు కూల్చేశారు



బాధితుడు ఆవేదన

**ప్రజపక్షం/మద్దూర్ :** రోడ్డు విస్తరణలో తన ఇల్లును మున్సిపల్ అధికారులు దౌర్జన్యంగా కూల్చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేనివాట్ల గ్రామంలో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ఆంజనేయులు ఇల్లు రోడ్డు విస్తరణలో తన ఇల్లు అడ్డుగా ఉందని కాంగ్రెస్ నాయకులు ఒత్తిడితో పోలీసులను అడ్డం పెట్టుకొని తన ఇల్లును దౌర్జన్యంగా కూల్చేశారని బాధితుడు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. బాధితుడు ఎంత వేడుకున్నా తన ఇల్లును కూల్చాలనే కుట్రలతో అధికారులు ధ్వంసం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం లేదా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అదే గ్రామానికి చెందిన శంకర్, ముదిరాజ్ నాయకులు కూర వెంకటయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులు తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ముదిరాజ్ సంఘాల నాయకులు హెచ్చరించారు.

## మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాలలో మూఢనమ్మకాలు, చేతబడులపేరుతో దళితులపైనదాడులు అధికమవుతున్నాయని వాటిని ఆరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు సదస్సులు గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వయంత్రాంగాన్ని కొమ్ముభరత్ డిమాండ్‌చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో చేతబడులపేరుమీద దళితులపైన అత్యధికంగా దాడులు జరుగుతున్నాయని, అంటరానితనం అస్పృశ్యత అమానుషంగా కొనసాగుతుందని వీటిని ఆరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సి ఎస్టి సభ్యులనిధులు, ఎస్సి కార్పొరేషన్ లోన్ రుణాలు, సబ్సిడి వాహనాలు 11 సంవత్సరాలుగా ఇవ్వడం లేదని, రాజీవ్‌యువశక్తి, ఇందిరమ్మ ఇండ్లు రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన దళితులందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బండిలక్ష్మి పతి, జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్, ఉషన్న, జిల్లా నాయకులు మండల బాధ్యులు లక్ష్మణ్, కృష్ణయ్య, మైసన్న, మహేష్, బంగారయ్య, అభిరామ్, బహుగుణ, అరవింద్, అర్జున్, వెంకటయ్య పాల్గొన్నారు.

## గొప్ప ఆత్మీయుడిని కోల్పోయాం

**ప్రజాపక్షం/వంగూర్ :** కాంగ్రెస్‌పార్టీలో గొప్ప ప్రజానాయకుడు నాకు అత్యంత సన్నిహితులు ఆత్మీయులు మంద పాండురంగారెడ్డి అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ భావోద్వానికి లోనయ్యారు. ఆదివారం ఆయన స్వగ్రామమైన మిట్టసదగోడు గ్రామంలో ఏర్పాటుచేసిన సంతాపసభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగాపాండురంగారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికోసం నిరంతరం పనిచేస్తూ ప్రజల్లో ఉన్న వ్యక్తి పాండురంగారెడ్డి అని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్‌పార్టీలో పాండు రంగారెడ్డి లేనిలోటు చాలా బాధాకరమని అన్నారు. ఆయనస్థానంలో ఆయన కుమారుడైన హర్షిత్‌రెడ్డికి కాంగ్రెస్‌పార్టీ అన్నివిధాలుగా అండదండలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్‌వైస్‌చైర్మన్ పండిత్‌రావు, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు అల్వాల్‌రెడ్డి,యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు క్యామమల్లయ్య, కట్టాఅనంతరెడ్డి, గోపాల్ రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణారెడ్డిమానస పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మొర

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో నీటి వసతి, విద్యుత్ భోజనం సరిగా లేదని పాఠశాల విద్యార్థినిలు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆదివారం ఆ పాఠశాల ముందు తమ పిల్లల్ని కలవడానికి పెద్ద సంఖ్యలో పేరెంట్స్ ఉండడాన్ని చూసి అటుగా వెళుతున్న ఎమ్మెల్యే ఆ పాఠశాలను సందర్శించారు ఆ సమయంలో మధ్యాహ్నం 1:30 గంటలకు పిల్లల్ని కలవడానికి అనుమతి ఉండడంతో పేరెంట్స్ అందరు గేటు దగ్గర ఎదురుచూస్తున్నారు.పాఠశాలలోకి వెళ్లి 1:00 గంటకి లోనికి అనుమతి ఇవ్వండని డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

# విలువలతో కూడిన విద్య అందించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ కళాశాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గీతం ఉన్నత పాఠశాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ అన్నింట్లో మొదటిస్థానంలో ఉంచాలన్నదే తన సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి మహబూబ్‌నగర్‌లోని విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపార వేత్తలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశాంత్, అంజద్ పాఠశాల కరస్పాండెంట్ సుధారాణి, డైరెక్టర్లు అనిల్, క్రిష్ణ, రిషి కళాశాల డైరెక్టర్ చంద్రకళ, వెంకటయ్య, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు మానుకోవాలి



నా రాజకీయ జీవితంలో అవినీతి చేయలేదు : మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని జడ్చర్ల ప్రేమ్ రంగా గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సూచించారు. మా మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. బాధ్యత గల వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయొద్దన్నారు. జడ్చర్ల రాజకీయాల్లో కుటుంబ సభ్యులను లాగడం ఎప్పుడు లేదన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. మాకు చేతనైన అభివృద్ధి చేశామన్నారు. తరువాత వచ్చిన వాళ్లు ఏదైనా తప్పులు ఉంటే సరిదిద్దుకుని ముందుకు వెళ్లాలన్నారు. మా అక్క మీద రెండు ఎకరాల భూమి ఎక్కడుందో నిరూపిస్తే ఇచ్చేస్తామన్నారు. వంద పడకల హస్పిటల్ నిర్మాణం కోసం రెండు ఎకరాలు కొని నిర్మాణం చేస్తే మా మీద ఆరోపణలు చేయడమేంటున్నారు. ఎమ్మెల్యే పక్కనే ఉన్న మరో రెండు ఎకరాలు కూడా హస్పిటల్‌కి ఇప్పించాలన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో చాలా చోట్ల అసైన్మెంట్ ల్యాండ్ తీసుకుని వారికి డబ్బులు ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో కూడా ఇదే విధంగా చేశామని తెలిపారు. హస్పిటల్ రోడ్డు నిర్మాణం కోసం అయ్యే ఖర్చు భరిస్తామని తెలిపారు. పాత బజారుకి భారీ వాహనాలు వెళ్లడానికి ఎటువంటి ఇబ్బంది లేదని అంబేద్కర్ చౌరస్తా వద్ద డివైడర్ ఓపెన్ ఉంటుందని తెలిపారు. స్లో అయ్యి రైట్ తీసుకుని వెళ్లొచ్చన్నారు. ఎర్రగుట్టలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు దక్కాలన్నారు. అర్హులైన వారికి కేటాయించి మిగతా వారిని ఖాళీ చేయిస్తే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల తరువాత ఇండ్లను కొంతమంది ఆక్రమించుకుంటే మాకేం సంబంధం అన్నారు. అయినా అధికారులు విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించాలన్నారు. ఉద్దండపూర్ పరిహారం విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కెసిఆర్‌ని ఒప్పించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ముప్పై శాతం పెంచామని గుర్తు చేశారు. మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు.

# బడుగు, బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం




పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందించి వారికి అండగా నిలబడిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి సలీం అన్నారు. ఆదివారం నారాణయపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డ్‌లో టిపిసిసి, ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికా రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డ్‌లో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీలతో పాటు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మహనీయులను కింద పరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను వార్డ్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా పేదలను మహిళలను దృష్టిలో ఉంచుకొని వారికి అనేక సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలను కోటీశ్వరులను చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణిక రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి ఏడాదిలోనే వేల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై అసవసర ఆరోపణ చేస్తున్నారన్నారు. అనంతరం వార్డు కమిటీని ఎన్నుకున్నారు. వార్డ్ అధ్యక్షుడిగా సిద్ధం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గా అవుట్ వీరేష్‌లతో పాటు కార్యదర్శిగా గొల్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సమీర్ షేక్‌లను అదేవిధంగా వార్డ్ మహిళ అధ్యక్షురాలుగా కుంటిమారి సుజాత, ఉపాధ్యక్షులుగా అవుటి. సిద్ధమ్మ, ప్రధాన కార్యదర్శి ప్రమీల, కార్యవర్గ సభ్యులుగా సనీం భాను, లక్ష్మి తదితరులను ఎన్నుకున్నా రు. ప్రజలకు పార్టీకి మధ్య వారధిగా ఉంటే పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వం అందజేసే పథకాలను ప్రజలకు అందించాలని కొత్తగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్వ మనోజ్, దొడ్డి కార్తీక్, బోయ వెంకటప్ప, మసి పవన్, హసనుద్దీన్, ఎరుకలి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల పాత్ర ఎంతో గొప్పది



**ప్రజాపక్షం/కొత్తకోట :** పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల పాత్ర ఎంతో గొప్పదని, ఇంట్లో తల్లిదండ్రులే పిల్లల మొదటి గురువులు, కుటుంబ వాతావరణమే ల్లల మొదటి అభ్యాస కేంద్రం మని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని బిపిఆర్. గార్డెన్ లో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కొత్తకోట వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్మా నాన్నలకు పిల్లల భవిష్యత్తుపై ప్రముఖ సైకాలజిస్ట్ డా.పి.లక్ష్మణ్ చే నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చిన్నారులు అక్షిత, అస్మిత పదవ తరగతి నందిని నాలుగో తరగతి విద్యార్థులచే భరతనాట్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ డా.పి.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రుల ప్రధాన లక్ష్యం తమ పిల్లల విజయవంతమైన భవిష్యత్తు కోసం, అత్యున్నత నాణ్యత గల విద్యను అందించడం , తల్లిదండ్రులే పిల్లల మొదటిగురువులు, కుటుంబ వాతావరణమే పిల్లల మొదటి అభ్యాస కేంద్రం అన్నారు. పిల్లల జీవితం భవిష్యత్తు విజయం అనేవి బాల్య దశలో ఏర్పడిన దిన చర్యలని అన్నారు. పిల్లల అలవాట్లు, శ్రమ గుణం, నిజాయితీ, బాధ్యత, నిర్ణయాధికారం, సామర్థ్యాలు వారి అంశాలపై ఆధారపడి ఉంటాయన్నారు. విద్య అంటే కేవలం పాఠ్య పుస్తకాలు వాటిలోని పాఠాలు మాత్రమే అనుకుంట మనం పొరపడ్డట్లేనని, అదో సముద్రం, ఎన్నో విషయాల సామాహారం, సాధారణ మనిషిని కూడా అసమాన ప్రతిభవంతునిగా తీర్చిదిద్దే సమగ్ర గ్రంథం మని, అందులో నాయకత్వం, సృజనాత్మకత, సర్దుకుపోయే గుణం, గెలుపు ఓటముల సమాన స్వీకరణ, కలుపుగోలు తనం, విలువలు, దేశ భక్తి వ్యక్తిత్వం లాంటివి పాఠ్యేతర కార్యకలాపాల ద్వారా రూపుదిద్దుకుంటాయని అన్నారు. తల్లిదండ్రుల ప్రభావం పిల్లల వ్యక్తిత్వంపై కేవలం బాల వరకే కాదని, వారి భవిష్యత్తు సంబంధాలు, కెరీర్ ఎంపికలు జీవితానికి సంబంధించిన మొత్తం విధానాన్ని ప్రభావితం చేస్తుందని, తల్లిదండ్రులు బోధించే విలువలు, జీవన నైపుణ్యాలు, సామాజిక అవగాహన, పోటీ ప్రపంచ గెలుపుపారాలు లాంటి ఎన్నో అంశాలు పిల్లల యుక్త వయస్సు గందరగోళాన్ని మంచి చెడుల విచక్షణాన్ని సంక్లిష్టతలను మార్గనిర్దేశం చేస్తాయని, సవాళ్లు అవకాశాల పట్ల వారి విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ మల్లేష్ గౌడ్, ప్రిన్సిపల్ పల్లవి, వైస్ ప్రిన్సిపల్ ఖదీర్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రవీందర్ , సుమన్ , సుందర్ , శివరాం, మల్లేష్ , సుధా, హలియా, అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




**నాగర్‌కర్నూల్ :** ఎగువ ప్రాంతంలోని కర్ణాటక జలాశయాల నుంచి వస్తున్న నీటి ఉధృతితో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం జూరాల అధికారులు 12 స్పిల్ వే గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటి మట్టం 318.516 అడుగులకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.300 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి సామర్థం 9.657 టిఎంసిలకు గాను ప్రస్తుత నీటి నిలువ 7.279 టిఎంసిలుగా నమోదైంది. జూరాలకు ఇన్‌ఫ్లో 1,50, 000 క్యూసెక్కులుగా ఉండగా 12 గేట్ల ద్వారా దిగువకు 1,16,424 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ కాలువకు సాగునీటిని యథావిధిగా విడుదల చేస్తున్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయొద్దు :ఎస్పీ



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేశాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ మొహరం పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో పీర్ల చావడిల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని నిరంతరం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ ఫార్వర్డు చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్ల పైన ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కావున ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకుని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డు చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో నారాయణపేట పోలీసు కంట్రోల్ రూమ్ 8712670399 కి లేదా డయల్ 100కి సమాచారమే వాళ్లని తెలిపారు.

## సిఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** పాన్‌గల్ మండలం మల్లాయిపల్లి గ్రామంలో శ్రీశ్రీ లక్ష్మి నర్సింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయడంతో గ్రామ ప్రజలు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కమిటీ ఆమోదం ద్వారా, దేవాదాయ శాఖ మంత్రి ఆమోదంతో మంత్రి జూపల్లి ప్రత్యేక కృషి ద్వారా మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మొదటివిడతగా రూ.25 లక్షల పనులు ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, కొండల్, శంకరయ్య, రాములు, శివారెడ్డి, డ్యావల్ల స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధూప, దీప, నైవేద్య సెలెక్ట్ కమిటీ మెంబర్‌గా పివి లక్ష్మీకాంత్ ఆచార్య



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ధూప దీప నైవేద్య సెలెక్ట్ పూజలు కమిటీ మెంబర్‌గా వనపర్తి జిల్లా డిడిఎన్‌ఎస్ అధ్యక్షులు పివి.లక్ష్మీ కాంత్ ఆచార్య ఎన్నికయ్యారు. పివి లక్ష్మీ కాంత్ ఆచార్యులకు ధూప దీప నైవేద్య సెలెక్ట్ కమిటీ నంబర్ గా ధృవపత్రాన్ని అందుకున్న అధ్యక్షులు ప్రస్తుతం వనపర్తి జిల్లా అర్చక సంఘం అధ్యక్షులుగా కొనసాగుతూ తనకు ఇచ్చిన జిల్లా అధ్యక్షుల హోదాలో కాకుండా నిరంతరం అర్చక సమస్యలపై పరితపిస్తూ తొలకని నిండు బిందెల మనస్తత్వం గల జిల్లా అధ్యక్షులు, అర్చకుల సమస్యలను జిల్లా స్థాయి అధికారులతో చర్చించి పరిష్కరించడంలో తనకు తానే సాటి అటువంటి వ్యక్తిని ధూప దీప నైవేద్య సెలెక్ట్ కమిటీలో మెంబర్‌గా ఎన్నుకోవడం మా జిల్లా అర్చకులు అందరికి చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలో ఉన్న గ్రామాలలో పురాతన దేవాలయాలు ఉన్నటువంటి గ్రామాలకు అర్చకులను నియమించే బాధ్యత అంతకరణ శుద్ధితో నిర్వర్తించే వ్యక్తికి ఈ బాధ్యత ఇవ్వడం చాలా సంతోషం. జిల్లా స్థాయిలో పరిఇతం కాకుండా భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా అధ్యక్షులు వారికి స్థానం ఇవ్వాలని దేవాదాయ ధర్మదాయ అధికారులను ధూప దీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్రస్థాయి వాసుదేవ శర్మకు జిల్లా అధికారులకు వనపర్తి జిల్లా అర్చక సమైక్య తరపున అభినందనలు తెలిపారు.

## మహాన్యూస్ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** మహాన్యూస్ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని టియూడబ్ల్యూజే ఐజెయు రాష్ట్రకార్యదర్శి గుండ్రాతిమధుగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో టియూడబ్ల్యూజే ఐజెయు అచ్చంపేట డివిజన్ జర్నలిస్టుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మహాన్యూస్ ఛానెల్‌పైదాడిచేయడం , స్వేచ్ఛ అనే జర్నలిస్టు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇటీవల పత్రికలపై దాడులు అధికమయ్యాయని ప్రభుత్వం వీటిపై స్పందించి చర్యలు తీసుకోవాలని లేనిచో జర్నలిజం ప్రశ్నార్థకం అవుతుందన్నారు. యూనియన్ విషయాలు మాట్లాడుతూ జర్నలిస్టు సంఘానికి ఐజెయు తల్లిలాంటిదని అందుకోసమే దేశం నలుమూలలతోపాటు రాష్ట్ర నలుమూలలో జర్నలిస్టులు యూనియన్‌లో ఉన్నారన్నారు. గ్రామీణప్రాంతాలకు అక్రిడేషన్ వ్యవస్థ యూనియన్ పోరాట ఫలితమని గుర్తుచేశారు. ఈయూనియన్‌పై ఎవరూ దాడి చేయలేరని గుర్తు చేశారు. వచ్చేనెల 8న నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే జిల్లాస్థాయి మహాసభలకు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జాతీయ కౌన్సిల్‌సభ్యులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్‌మెంబర్ మిర్యాల కర్ణయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, కోకన్వీనర్ ఎం.రాములు, రాష్ట్రకౌన్సిల్‌సభ్యులు కంచర్ల శ్యాంసుందర్ పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సిపిఐ డిండి మండల నూతన కమిటీ



**ప్రజాపక్షం/డిండి** : సిపిఐ డిండి మండల 15వ మహాసభ డిండి మండల కేంద్రంలోని ఈజే గార్డెన్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా సిపిఐ నల్లగొండ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి పాల్గొన్న ఈ మహాసభలో మహాసభ అనంతరం నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా శ్రీరామదాసు కనకాచారి, సహాయ కార్యదర్శులుగా బొల్లే శైలేష్, తిప్పర్తి విజేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బొడ్డుపల్లి రవీంద్రశర్మ, నూనె వెంకటేశ్వర్లు, హనుమాండ్ల కేశవులు, సోమిడి శ్రీనయ్య, ఎలిమినేటి హుస్సేన్, లచ్చయ్య, మంజుల ఎన్నికయ్యారు.



## విద్యుత్ మీటర్ల పంపిణీ

### పేద ప్రజలకు చేయూతనందిస్తున్న వైఎస్‌ఆర్ ఫౌండేషన్

### ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/మోటకొండూర్:** పేద ప్రజలకు యెల్లంల సంజీవరెడ్డి (వైఎస్‌ఆర్)ఫౌండేషన్ అదినేత యెల్లంల సంజీవ రెడ్డి స్వంత నిధులతో పిట్టల గూడెం ప్రజలకు విద్యుత్ మీటర్లు ఉచితంగా అందజేయడం గర్వించదగ్గ విషయం అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవ రెడ్డి తో కలిసి మోటకొండూరు మండలంలోని చాడ మధర పిట్టల గూడెంలో 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 43 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ అంచలంచెలుగా అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వైయస్సార్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు వైఎస్‌ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ముత్తి రెడ్డి గూడెం లో ఓ హోటల్ లో ఎమ్మెల్యే టీ తాగుతూ ప్రజలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు నెమ్మాని సుబ్రహ్మణ్యం, భూమండ్ల శ్రీనివాస్, జూకంటి మధు, అలేటి ఉమేష్, ఆకుల శ్రీను, గుర్రాల పాండు, నూనెముంతల సంతోష్, బచ్చ లింగస్వామి పాల్గొన్నారు.

## పిసి. మెహలోనోబిస్ 132వ జయంతి



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** 19వ జాతీయ అర్థగణాంక దినోత్సవ వేడుకలను ముఖ్య ప్రణలిక అధికారి ఎల్.కిషన్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి.సి. మెహలోనోబిస్ 132వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిసి మెహలోనోబిస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిసి మెహలోనోబిస్ అనువర్తిత గణాంకశాస్త్రవేత్త అని, భారత ప్రణాళిక పథానికి నిర్దేశకుడిగా భారతదేశ మొదటి ప్లానింగ్ కమిషన్లో సభ్యుడిగా పనిచేశారని, అదే విధంగా గణాంక అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రామచందర్‌రావు, డివిజన్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, గణాంక అధికారి పి.రమేష్, రిటైర్డ్ సిపివోఎస్‌సి ఎస్ రాజు, ఉపగణాంక అధికారులు రాజేష్, కోటేశ్వరరావు, రామారావు, లోక్య, విజయ్‌కుమార్, టిఎన్‌జివో జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బిసి బిల్లు ఆమోదించాలి

### దూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్



**ప్రజాపక్షం/నూతన్‌కల్:** బిసిలను రాజకీయంగా అభివృద్ధి చేయాలని బిజేపికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బిసి బిల్లు ఆమోదించాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఆ సంఘ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని శాసనసభలో బిల్లు ఆమోదింపచేసి కేంద్రానికి పంపి 3నెలలు కావస్తున్నా ఎలాంటి కదలిక లేకపోవడం బాధాకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బిసి బిల్లును పంపిన మూడు నెలల కాలంలో సుమారు ఏడుసార్లు కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగిందని కనీసం ఈ బిల్లుపై ప్రస్తావనే లేదని అన్నారు. బిసి బిల్లును షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని అందుకు కాంగ్రెస్, బిజేపి లు చిత్తశుద్ధితో కృషి చేయాలని, రిజర్వేషన్ల పరిరక్షణ షెడ్యూల్ సైన్ వల్లనే సాధ్యమవుతుందని, భారత రాజ్యాంగంలోని రిజర్వేషన్లు మౌలిక సూత్రాలకు అనుకూలమేనని, షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చడం వల్ల కోర్టులు సమీక్షంచవన్నారు. రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మూరగుండ్ల లక్ష్మయ్య, గీతపనివారాల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తొట్ల ప్రభాకర్ ఉన్నారు.

## భూ వివాదంలో మహిళ ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని బుగ్గబాయి గూడెం గ్రామంలో ఓ వివాహిత భూ వివాదంలో శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు కట్ట అనూష తెలిపిన వివరాల ప్రకారం బుగ్గబాయిగూడెం గ్రామ వాసి కట్టా పుతిలిబాయికి సంబంధించి మూడు గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన బుర్రి శ్రీనివాస్ రెడ్డి కబ్జా చేసి కంచె వేస్తున్న సమయంలో పుతిలిబాయి నా భూమిని వదిలి నీకు సంబంధించిన భూమిలో మాత్రమే కంచె వేసుకోమని మర్యాదపూర్వకంగా చెప్పిన వినకుండా బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఈ భూమి నేను డబ్బులు ఇచ్చి కత్తి వనజాత,సుధాకర్ రెడ్డిల దగ్గర కొన్నానని బెదిరించాడు. దానికి పుతిలిబాయి సుధాకర్ రెడ్డి దగ్గర కొన్న పొలం ఎకరం ఐదు (1.05) గుంటలు మాత్రమే మిగతా మూడు గుంటల భూమిని వదిలి కంచవేసుకోమని వాపోయింది. అయినా వినకుండా వనజాత సుధాకర్ రెడ్డి లతోపాటు బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు వృద్ధురాలు అయినా పుతిలిబాయిపై మాటల యుద్ధానికి దిగారు. వనజాత ఆమె భర్త సుధాకర్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అసభ్యకరంగా బూతులు తిట్టారు. దాంతో మనస్థాపం చెందిన అనూష పురుగుల మందు తాగింది. అక్కడే ఉన్న పలువురు ఆమెను గమనించి 108 అంబులెన్స్ లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనూష ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

## సాగర్‌కు నెమ్మదిగా... శ్రీశైలంకు వేగంగా...

### క్రస్ట్‌గేట్లకు సంబంధించిన పనులు పూర్తి..

### ఆందోళన కలిగిస్తున్న స్పిల్ వేపై గుంతలు..



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులు నిండటంతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతుంది దీనితో శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టడంతో సాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్ ఫ్లో వచ్చి చేరుతుంది దీనితో రిజర్వాయర్ నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతుంది. ఈ ఏడాది సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్ కి చేరుకోక ముందే మరి కొద్ది రోజులలో రిజర్వాయర్ జలకళనుసంతరించుకునే లా కనిపిస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు ముందుగానే అప్రమత్తమై ప్రాజెక్టు క్రస్ట్ గేట్లకు సంబంధిన అన్ని పనులు పూర్తి చేసుకుని 26 క్రస్ట్ గేట్లను డ్రై రన్ నిర్వహించడం జరిగింది.అయితే అంతా బాగానే ఉన్నా ప్రాజెక్టువిషయంలోస్పిల్ వే పై ఏర్పడ్డ గుంతలు భద్రతపై అందరిని వొకింత ఆందోళకు గురి చేస్తుంది.ఈ విషయంలో జాతీయ ఇంజనీర్ల బృందం తమ అసంతృప్తిని తెలియజేస్తూ 2023/24 లో పూర్తిచేసిన స్పిల్ వే మరమ్మతులు నాసిరకంగా ఉండటంతో వరద ఉధృతికి స్పిల్ వే పై మళ్లీ గుంతలు ఏర్పడ్డాయని ఇలా నాశిరకం పనులతో స్పిల్ వే పై గుంతలు నిత్యం పునరావృతమైతే ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఎంత దూరంలో లేదని వారన్నారు. రాబోవు వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు అధికారులు గేట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం**

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ఇది 312.50 టి ఎం సీ లకు సమానం. ప్రస్తుత నీటిమట్టం 514.20అడుగులు ఉండగా ఇది 138.9118 టి.ఎం.సి ల కు సమానం. కుడి, ఎడమ కాలువల ద్వారా ఎటువంటి నీటి విడుదల కొనసాగడం లేదు ఎస్ఎల్ బిసి ఏఎంఆర్పి ద్వారా 450 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదలవుతూ ఉంది.రివర్స్ పంప్ ద్వారా 4213 క్యూసెక్కుల నీరు వస్తూ ఉండటంతో అదే నీటితో ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ప్రభుత్వ విద్యా రంగాన్ని పటిష్ట పరచడంలో టియస్ యుటిఎఫ్ సంఘ సభ్యులు ముందు ఉండాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి యం.రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారి అధ్యక్షత న జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ సంఘ ఉపాధ్యాయులు పనిచేసే ఆయా ప్రాంతాలలో పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలో స్టడీ అవర్ నిర్వహణకు అదనపు సమయం కేటాయించాలని కోరారు.ఈవిద్య సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు సకాలంలో అందించి నందుకు, ఈసారి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా నోటు పుస్తకాలు అందించి నందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల అవసరమేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని అలా కాకుండా జిల్లా కేంద్రానికి, హైవే లకు దగ్గరలో గల ప్రాంతాలకు ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం డిప్యుటేషన్లు చేయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీరు మారకపోతే ప్రత్యక్ష చర్యలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం,ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, బి అరుణ కోశాధికారి వడిత్య రాజు, ఎడ్ల సైదులు,రామలింగయ్య, గేర నరసింహ, యాట మధుసూదన్ రెడ్డి, రమాదేవి, నలపరాజు వెంకన్న, చిన వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు



మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల** : మునుగోడు నియోజవర్గంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేస్తానని మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల మండలం అంతంపేట గ్రామంలో గల్లిగల్లి తిరుతూ గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు రాని అర్హులైన నిరుపేదలకు రెండవ జాబితాలో ఇల్లు ఇప్పించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. కాయకష్టం చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్న రాములు ఇంటికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 5లక్షలతో పాటు ఇల్లు పూర్తి అవ్వడానికి మిగిలిన ఆర్థిక సాయం చేసి ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు 11 కేవి కరెంట్ లైన్ ను వెంటనే తొలిగించాలని విద్యుత్ ఎఇని ఆదేశించారు. గ్రామంలో అవసరమున్న చోట డ్రైనేజీ ,సిసి రోడ్ల నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. గ్రా మాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతానని అన్నారు. అంతంపేట నుండి దేవుల తండా, రాజ్యతండ లో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు, అంతంపేట నుండి నామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. అర్హులైన నిరు పేదలందరికి సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందించే బాధ్యత నాది అని అన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేసే వాళ్లే సర్పంచులుగా , ఎంపిటిసిలుగా పోటీ చేయాలని ,గ్రామాలలో అటువంటి వారినే ప్రజలు గెలిపించుకోవాలని సూచించారు. గట్టుప్పల తహసీల్దార్ రాములు , విద్యుత్ ఏఈ , కాంగ్రెస్ గట్టుప్పల మండల అధ్యక్షుడు నామని జగన్నాథం , మేతరి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మూడు నెలల బాలుడు మృతి

### సూర్యాపేట ప్రైవేటు హాస్పిటల్‌లో ఘటన

### వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ ఆసుపత్రి ఎదుట ఆందోళన

### ఆగ్రహంతో ఆసుపత్రి అద్దాలు ధ్వంసం

### రంగంలోకి దిగిన పోలీసులు






**ప్రజాపక్షం/సూర్యాపేట:** అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడునెలల బాలుడు మృతిచెందగా వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన ఆదివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మృతి చెందిన బాబు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తుంగతుర్తి మండలం గుడితండా గ్రామానికి చెందిన జాటోతు జయచందర్‌మనీషాలు తమ మూడునెలల బాబుకు వాంతులు అవుతుండగా నాలుగురోజు క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఉన్న ప్రైమ్ పిల్లల ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకవచ్చారు. బాబును పరీక్షించిన వైద్యుడు ఆసుపత్రిలో చేరిక చేసుకుని చికిత్స అందిస్తున్నాడు. తమ బాబుకు ఏమైందని తల్లిదండ్రులు ఆసుపత్రి వైద్యుడు ఎం.మహిందర్‌రెడ్డిని అడగగా మొదట ఊపిరితిత్తుల్లో పాలు పోయాయని, మరుసటి రోజు నిమ్ము వచ్చిందని, మూడవరోజు అక్సిజన్ అందక ఇబ్బంది పడుతున్నాడని, తాను అందించే చికిత్సతో బాగు అవుతుందని వారికి చెప్పినట్లు వారు మీడియా ముందు వాపోయారు. నాల్గవ రోజు పరిస్థితి విషమించదంటూ మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని చిన్న పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించగా, తాము హైద్రాబాద్‌కు తీసుకపోతామని చెప్పిన పట్టించుకోకుండా సదరు డాక్టర్ ఖమ్మంకు బలవంతంగా పంపించినట్లు తెలిపారు. అక్కడ బాబును పరిక్షించిన వైద్యులు ఇంతకు ముందు వైద్యం అందించిన వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాబు ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని చెప్పి, తిరిగి చికిత్సను అందించారు. ఆదివారం చికిత్స పొందుతున్న బా లుడు మృతి చెందాడు. అతని మృతదేహన్ని సూర్యాపేటలోని ప్రేమ్ పిల్లల ఆసుపత్రికి వద్దకు తీసుకవచ్చి వైద్యుడితో వాగ్వివాదానికి దిగి ఆసుప త్రి ఎదుట బైఠాయించి సదరు వైద్యునిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

**ఆగ్రహించి ఆసుపత్రి అద్దాలు ధ్వంసం**

ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాబు కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని అతన్ని పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సదరు వైద్యుడు బాబు తమ ఆసుపత్రిలో మృతి చెందలేదని, తనకు ఎలాంటి సంబంధం లేదంటూచెప్పాడంతో ఆగ్రహించిన వారు రాళ్లతో ఆసుపత్రి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌ఛార్జి సిఐ రాజశేఖర్ లు మృతి చెందిన బాబు కుటుంబ సభ్యులతో, వైద్యం అందించిన వైద్యునితో మంతనాలు జరుపుతున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఆసుపత్రి వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. రాళ్లు రువ్వి ఆసుపత్రి అద్దాలను పగులగొట్టిన బాబు తాత శ్రీనునాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే బాబు బాబాయ్ మహేందర్ వైద్యుడి నిర్లక్ష్యంతోనే తమబాబు మృతి చెందాడని ఆవేదన చెందుతూ తనవంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించి అక్కడున్న వారు అడ్డుకున్నారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. రాళ్ల దాడిలో విధులు నిర్వహిస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ గుగులోతు నరేష్ తలకు రాయి తగిలి గాయమైంది. ఆసుపత్రి వైద్యుడు, మృతిచెందిన కుటుంబ సభ్యులు, బంధువులు రాజీ చేసుకునేందుకు రాత్రి పొద్దుపోయేంత వరకు మంతనాలు జరుపుతున్నారు.







## అంధకారంలో దళిత కార్పొరేట్ బెస్ట్ అవైలబుల్ విద్య

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు ప్రభుత్వం ఫీజులు చెల్లించనందున విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడి వెంకట్‌రెడ్డి తో బాధను వెల్లిబుచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ పాఠశాలలో అందిస్తున్న విద్యకు గత నాలుగు సంవత్సరాల నుండి ఫీజ్ బకాయిలను విడుదల చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపంతో పాఠశాల యాజమాన్యలు విద్యార్థులను ఫీజ్‌లు చెల్లిస్తేనే పాఠశాలకి రావాలని మానసికంగా ఇబ్బందికి గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఈసందర్భంగా ఉన్నత అధికారులకు తెలియజేసిన ఫలితం శూన్యమన్నారు. ఇప్పటుకైనా తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ , ఎస్టీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ప్రవైట్ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు IIT,NEET,CBSE ఉచిత విద్య అందించి ప్రభుత్వం పెండింగ్ ఫీజులను చెల్లించి వారి చదువుకు ఆటంకం లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మామిడి జగన్, బచ్చలకూరి కార్తీక్, దామెర రవికుమార్, నాగరాజు, బండారు శంకర్, కట్ట నవీన్, దార్ల రాజు, పులిమెల అరుణ , కంచనపల్లి నవ్య, శివరాజు, నరసింహ తదితరులు పాల్గోన్నారు.

## మీడియా ముసుగులో ఆసత్య ప్రచారం

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మీడియా ముసుగులో మాజీ సిఎం కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ లపై ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది మీడియా వారు స్లాటర్ (కబేళాలు) హౌస్‌లు నడుపుతున్నారని అన్నారు. వారు మీడియా హౌస్‌లు కాదన్నారు. కెసిఆర్, కెటిఆర్‌ల వ్యక్తిత్వాలను హననం చేసే దాడులు జరుగుతున్నాయని అన్నారు. దానిని చూసి కెసిఆర్ అభిమానులు ఎవరు ఊరుకోరని అన్నారు. మీడియా దాడులకు మేము ప్రతి దాడులు చేస్తే తట్టుకోలేరని హెచ్చరించారు. సంవత్సరన్నర కాలంగా మీడియాను అడ్డంపెట్టుకుని కెసిఆర్‌పై కుట్రలు పన్నుతున్నారని అన్నారు. తమను ఇబ్బందులు పెట్టే వారిని ఎవరిని వదిలిపెట్టమని చెప్పారు. ఏపి చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్ లను చూసి మురుస్తున్న వారికి భవిష్యత్‌లో ఎవ్వరు కాపాడలేరని అన్నారు. తెలంగాణను ఆంధ్ర నుండి విడదీశారనే అక్కసుతోనే కెసిఆర్‌పై కుతంత్రాలు మొదలయ్యాయని అన్నారు. తమపై జరుగుతున్న దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారే తప్ప ఏమీ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పైగా తమపైనే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ప్రజాకోర్టులో శత్రువులకు శిక్ష తప్పదని అన్నారు. రాజకీయ పార్టీలుగా మేము మేము తేల్చుకుంటామని, మీడియా ఆసత్య ప్రచారాలు చేస్తుందని ప్రశ్నించారు.ఉద్యమం నుంచి వచ్చినవాళ్లం కేసులకు ఎలా భయపడతామని అన్నారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడి చేశారని కొందరు ముసలి కన్నీరు కారస్తున్నారని, అదే పనిగా పెట్టుకుని తమపై ఆసత్య ప్రచారం చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రందాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాసగౌడ్, మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ పాల్గొన్నారు.

# రీల్

## జులై 3 నుంచి ఎఐఆర్ సిరీస్



సందీప్ రాజ్ షో రన్నర్‌గా హర్ష రోషన్, భాను, జయతీర్థ ప్రధాన పాత్రల్లో జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ ఎఐఆర్(ఆల్ ఇండియా ర్యాంకర్స్). జులై 3 నుంచి సిరీస్ ఈటీవి విన్ లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోలు శివాజీ, సుహాస్ ట్రైలర్ లాంచ్ కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శివాజీ మాట్లాడుతూ చదువు అనేది చాలా అవసరం. ఆల్ ఇండియా ర్యాంకర్స్.. ఈ టైటిల్ వినగానే ఈటీవీలో #90కి మించి మరో పెద్ద బ్లాక్ బస్టర్ సిరీస్ రాబోతుందని నాకు అనిపించింది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ దీనికి కనెక్ట్ అవుతారు. చదువు అనేది నేచురల్ గా చదవాలి. కేవలం ర్యాంక్స్ కోసం చదవడం అనేది ఒక రకమైన హింస. ఈ సిరీస్ అలాంటి తల్లిదండ్రులకి ఒక గుణపాఠం కావాలి. ఈటీవీ సమాజం పట్ల చాలా బాధ్యతగా ఉంటుంది. ఈటీవీ విన్ కోట్లకరంగా కథల్ని చెప్పాలని ప్రయత్నం చేస్తుంది. ఇది కూడా చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందని అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ ఇందులో పని చేసిన రోషన్ భాను, మిషన్ ఇంపాజిబుల్ నుంచి తెలుసు. చాలా మంచి యాక్టర్స్. ఈ సిరీస్ కి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు సంజీత్. డిఓపి వర్క్ కూడా చాలా బాగుంది. డైరెక్టర్ జోసెఫ్ కి ఆల్ ది బెస్ట్. ఇందులో పనిచేసిన అందరికీ కంగ్రాజ్యులేషన్స్. ఈటీవీ నుంచి అద్భుతమైన కంటెంట్స్ వస్తున్నాయి. ఈ సిరీస్ కోసం నేను ఎంతో ఎదురు చూస్తున్నాను అని చెప్పారు. ఈ కార్యక్రమంలో షో రన్నర్ సందీప్ రాజ్, డైరెక్టర్ జోసెఫ్, నటి చాందిని, ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్, నటుడు హర్ష రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## రామ-కర్ణ-రుద్ర.. ప్రభాస్‌కు కలిసొచ్చిన జూన్




ఇండియన్ స్క్రీన్ పై ప్రస్తుతం ప్రభాస్ హవా నడుస్తోంది. ఏ ముహూర్తాన బాహుబలి హిట్ అయిందో ఆ రోజు నుంచి ప్రభాస్ కు పాన్ ఇండియా స్థాయిలో తిరుగులేకుండా పోయింది. బాలీవుడ్ హీరోలను సైతం బాక్స్ ఆఫీస్ వద్ద బోల్తా కొట్టిస్తున్న పరిస్థితుల్లో ప్రభాస్ ఎలాంటి పాత్రలు పోషించినా అవి హిట్ అవుతున్నాయి. గత మూడేళ్ళుగా ప్రభాస్ సినిమాలను చూస్తే యాధృచ్ఛికంగా కొన్ని పాత్రలు ప్రభాస్ కలిసి వచ్చాయని చెప్పవచ్చు. వరుసగా మూడేళ్ళ మైథలాజికల్ పాత్రలు బాగా కలిసొచ్చాయి. జూన్ నెల ప్రభాస్ కెరీర్ లో గుర్తుండిపోయే నెలగా చెప్పుకోవచ్చు. వరుసగా మూడు సంవత్సరాలు ప్రభాస్ నటించిన మైథలాజికల్ మూవీస్ జూన్ నెలలోనే జనం ముందుకు వచ్చాయి. 'ఆది పురుష్' సినిమాలో ప్రభాస్ రాముడిగా నటించారు. బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 16 జూన్ 2023లో విడుదలైంది. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద పెద్దగా ఆడలేదు. కానీ 2024 జూన్ 27న తేదీన విడుదలైన 'కల్కి' సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. అమితా బచ్చన్, కమల్ హాసన్ లాంటి స్టార్స్ ఉన్నప్పటికీ ప్రభాస్ ఇమేజ్ కు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా దర్శకుడు నాగ్ అశ్విన్ కల్కి సినిమాను తెరకెక్కించారు. కల్కి సినిమాలో ప్రభాస్ కర్ణుడిగా కనిపించారు. రాబోయే కల్కి 2 కథ మొత్తం కర్ణుడి చుట్టూ తిరుగుతుందనేది దర్శకుడు స్పష్టం చేశారు. డాక్టర్ మంచు మోహన్ బాబు నిర్మాతగా మంచు విష్ణు టైటిల్ పాత్రలో నటించిన సినిమా 'కన్నప్ప'. ఈ సినిమా కూడా 2025 జూన్ 27న విడుదలైంది. కన్నప్ప సినిమాలో ప్రభాస్ కేవలం అతిథి పాత్రలో రుద్రగా కనిపించారు. మహా భారత్ సీరియల్ ను తెరకెక్కించిన బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ కన్నప్ప సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో అతితక్కువ సమయం స్క్రీన్ పై కనిపించినా ప్రభాస్ ఉన్నంతవరకు సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేశారు. కన్నప్ప సినిమాలో ద్వితీయార్థంలో ప్రభాస్ పాత్ర రావడంతో ఈ సినిమాకు ప్రాణం పోసినట్లయింది. సరిగ్గా ఏడాది తేడాతో కల్కి, కన్నప్ప ఒకే తేదీన జనం ముందుకు వచ్చాయి. 2023 నుంచి 2025 వరకు ప్రభాస్ చేసిన మూడు మైథలాజికల్ పాత్రలు జూన్ నెలలోనే జనాన్ని అలరించాయి. రామ్, కర్ణ, రుద్రగా ప్రభాస్ ప్రేక్షకులను మెప్పించారు. ఆది పురుష్ లో ప్రభాస్ సరసన సీతగా కృతి సనన్ నటిస్తే, కల్కి సినిమాలో శృతి హాసన్, దీపికా పదుకోన్ నటించారు. కన్నప్ప సినిమాలో ప్రభాస్ కేవలం అతిథి పాత్ర కాబట్టి ప్రభాస్ కు ఇందులో హీరోయిన్ లేదు. ప్రభాస్ కెరీర్ లో మాత్రం ఈ మూడు పాత్రలు, మూడేళ్ళ, మూడు జూన్ నెలలు జీవితాంతం గుర్తుండిపోతాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

## 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ఆ రోజే..



పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హెరాయిన్‌గా నటించిన సినిమా హరి హర వీర మల్లు . ఈ సినిమా ట్రైలర్‌ను జులై 3న విడుదల చేయడానికి ముహూర్తం పెట్టారు. పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తివంతమైన చారిత్రక యోధుడు 'వీరమల్లు' పాత్రలో కనువిందు చేయనున్నారు. మొఘల్ శక్తిని ధిక్కరించిన ఓ ధైర్యవంతుడి ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి నుంచి 'హరి హర వీరమల్లు' చిత్ర దర్శకత్వ బాధ్యతలు అందుకున్న దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు.

## కొత్త టాలెంట్ కోసం దిల్ రాజు డ్రీమ్స్



తెలుగు తెరపై ఇప్పటివరకు పలువురిని వివిధ రంగాల్లో పరిచయం చేసిన ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఇప్పుడు పూర్తిగా కొత్త టాలెంట్ కొరకు వెతుకులాట మొదలెట్టారు. నటుడు, నటి, కథ, ఫోటోగ్రఫీ , సినిమా వ్యాపారం, పంపిణి , నిర్మాణం ఇలా అన్ని రంగాల్లో కొత్త వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశయంతో దిల్ రాజు డ్రీమ్స్ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్ సైట్ ను హీరో విజయ్ దేవరకొండ, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ దిల్ రాజు డ్రీమ్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ వేదిక కొత్తగా సినిమా పరిశ్రమకు రావాలనుకునే వారికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఈ ప్లాట్ ఫామ్ కేవలం కొత్తవారికోసమే తాయారు చేశామన్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్ రాజు ప్రొడక్షన్స్ వంటి బ్యానర్లపై సినిమాలు తీస్తున్నా, ఇప్పుడు దిల్ రాజు డ్రీమ్స్ పేరుమీద కూడా సినిమాలు నిర్మిస్తామన్నారు. ఈ వెబ్ సైట్‌ను ఆపరేట్ చేయడానికి పద్నాలుగు మందితో కూడిన బృందం పని చేస్తోందని చెప్పారు. దిల్ రాజు డ్రీమ్స్ కార్యక్రమాలు అధికారికంగా జులై 1 నుంచి ప్రారంభమవుతుయని తెలిపారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ శేఖర్ కమ్ముల సినిమా కోసం నేను ఆడిషన్స్‌కు వెళ్లినట్టు ఈ వెబ్ సైట్ ద్వారా అనేకమంది దిల్ కాంపౌండ్‌కు వస్తారని, అలాంటి వారిలో ఒక్కరు ఎదిగినా ఈ ప్రాజెక్ట్‌కు సార్థకత వచ్చినట్టేనని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన ఒకరు ఎలా స్టేజిమీద నిలబడి మాట్లాడే రోజు ఖచ్చితంగా వస్తుందని, అలాంటి రోజు కోసం ఎదురు చూస్తానని అన్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఫెయిల్యూర్స్ ఖచ్చితంగా వస్తాయని, దాన్ని తట్టుకుని ఎదిగితేనే ఇండస్ట్రీలో భవిష్యత్తు ఉంటుందన్నారు. యూ అంటావా మావ ఊఉ అంటావా మావ అనే పాటను ఒక హాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ కాపీ కొట్టారని, ఈ విషయం తెలిసి ఎంతో సంతోషపడ్డానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నిర్మాత శిరీష్ కూడా పాల్గొన్నారు.

## 'జిగ్రీస్' ఫస్ట్ లుక్ రిలీజ్



కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ బ్యానర్ పై ఓ యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌ని నిర్మిస్తున్నారు. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ చిత్రానికి జిగ్రీస్ అనే టైటిల్ ఖరారు చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా జిగ్రీస్ టైటిల్, ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేసి టీంకి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఒక వింటేజ్ మారుతీ 800 కారు పక్కన నిలబడ్డ నలుగురు ఫ్రెండ్స్‌ని పై నుంచి చూపించడం ఇంట్రెస్టింగ్‌గా ఉంది. బోల్డ్ ఆరెంజ్ బ్యాక్‌డ్రాప్ తో సినిమా అడ్వెంచరస్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ ఫస్ట్ లుక్, టైటిల్ సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేసింది.

## 'అలలు లేని సముద్రం' ట్రైలర్



వసంత్, భాగ్య లక్ష్మి, రమ్య హీరో హీరోయిన్లుగా టి.రాము దర్శకత్వంలో రూపొందిస్తున్న మూవీ 'అలలు లేని సముద్రం'. ఈ చిత్రాన్ని రాం రెడ్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో 'అలలు లేని సముద్రం' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన నిర్మాత బాలాజీ నాగలింగం మాట్లాడుతూ దర్శకుడు రాము నాకు బాగా పరిచయం. ఆయన ఈ సినిమా చేస్తున్నానని చెప్పినప్పుడు ఇండస్ట్రీలో చిన్న చిత్రాలకు పరిస్థితులు అంత బాగా లేవని చెప్పాను. అయినా పట్టుదలగా ఆయన మూవీ రూపొందించారు. అలలు లేని సముద్రం మూవీ ట్రైలర్ బాగుంది. ఈ సినిమాకు నా వంతు సపోర్ట్ చేస్తా అన్నారు. ఈ ట్రైలర్ కార్యక్రమంలో కర్నూలు జిల్లా బీజేపీ నాయకులు సుబ్బా రెడ్డి, నటీనటులు వసంత్, భాగ్యలక్ష్మి, రమ్య, సురభి ప్రియాంక, సురభి వీణ, సురభి అరుణాదేవి, సురభి శేషకుమారి, సురభి జ్యోతి, సుందరమ్మ, రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

## 'విరాటపాలెం పిసి మీనా రిపోర్టింగ్' సక్సెస్ మీట్



విరాటపాలెం పీసి మీనా రిపోర్టింగ్ వెబ్ సిరీస్ జీ5లో టాప్ ప్లేస్‌లో నడుస్తోంది. సోషల్ మీడియా సెన్సేషన్ అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన 'విరాటపాలెం పిసి మీనా రిపోర్టింగ్' సిరీస్‌కు పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై కేవీ శ్రీరామ్ ఈ సిరీస్‌ను నిర్మించారు. ఈ సిరీస్ జూన్ 27 నుంచి జీ 5లో టాప్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ క్రమంలో టీం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా జీ5 తెలుగు బిజినెస్ హెడ్ అనురాధ మాట్లాడుతూ.. జీ తెలుగు సంస్థకు ఇది 20వ వసంతం. ఈ ప్రయాణంలో మాకు మీడియా ఎంతో అండగా నిలబడింది. మా టీం సహకారం వల్లే ఇంత సక్సెస్ ఫుల్‌గా సాగుతున్నాం. మేం వంద శాతం ఒరిజినల్ కంటెంట్, షోలను తీసుకు వచ్చాం. మేం ఎన్నో ఐకానిక్ షోలను చేశాం. మేం వేసిన బాటలో ఎంతో మంది నడిచారు. మేం ఎన్నో ఒరిజినల్ ఐడియాస్‌ను క్రియేట్ చేశాం. 'ఆరంభం ఒక్క అడుగు'తో అంటూ ఇక్కడి వరకు వచ్చాం. ఓటీటీ సంస్థల్లో మేం స్టాండరడ్స్‌ను సెట్ చేశాం అన్నారు.

# 95 కోట్లమందికి పథకాలతో లబ్ధి

### నెలవారీ 'మన్ కీ బాత్' రేడియో బ్రాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం

### 2015 నాటికి కేవలం 25కోట్ల కంటే తక్కువ మందికి మాత్రమే పథకాల ప్రయోజనం చేకూరిందని వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం దాదాపు 95కోట్ల మంది ప్రజలు ఏదో ఒక సామాజిక భద్రతా పథకం ద్వారా లేదా మరొక ప్రయోజనం పొందుతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. 2015నాటి వరకు చూస్తే ప్రభుత్వ పథకాలు 25కోట్లకంటే తక్కువ మందికి మాత్రమే చేరాయన్నారు. ఆదివారంనాడు 'నెలవారీ మన్ కీ బాత్' రేడియో బ్రాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ సందర్భంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదికను ప్రస్తావించారు. భారతదేశ జనాభాలో 64 శాతం కంటే ఎక్కువమంది ఇప్పుడు ఏదో ఒక సామాజిక రక్షణ ప్రయోజనాలను లేదా మరొకటి పొందుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం భారతదేశంలోని చాలా మంది ప్రజలు ఏదో ఒక సామాజిక రక్షణ ప్రయోజనాన్ని లేదా మరొకటి పొందుతున్నారు. ఇటీవల అంతర్జాతీయ సంస్థ నుంచి చాలాముఖ్యమైన ఒక నివేదిక వెలువడింది. భారతదేశ జనాభాలో 64శాతం కంటే ఎక్కువమంది ఇప్పుడు ఖచ్చితంగా కొంత సామాజిక రక్షణ ప్రయోజనాన్ని పొందుతున్నారని ఆ నివేదిక తెలియజేసిందని మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద కవరేజీలలో సామాజిక భద్రత ఒకటి అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా చెప్పారు. 'నేడు దేశంలోని 95కోట్లమంది ప్రజలు ఏదో ఒక సామాజిక భద్రతా పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. అయితే 2015 వరకు ప్రభుత్వ పథకాలు 25 కోట్ల కంటే తక్కువ మందికి మాత్రమే చేరేవి' అని మోదీ వివరించారు. ఆరోగ్యం మొదలు సామాజిక భద్రత వరకూ దేశం ప్రతీ రంగంలోనూ సంతృప్తి భావనతో ముందుకు సాగుతోందని మోదీ చెప్పారు. ఇది కూడా సామాజిక న్యాయానికి సంబంధించిన ఒక గొప్ప చిత్రం. ఈ విజయాలు రాబోయే కాలంలో మరింత మెరుగ్గా ఉంటాయనే నమ్మకం కలిగించాయి. భారతదేశం ప్రతీ అడుగులోనూ బలంగా మారుతోందన్నారు. భారతదేశాన్ని ట్రకోమా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రకటించడం 'ఒక గొప్ప మైలురాయి' అని ఆయన ప్రశంసించారు. ఈ విజయానికి ఆరోగ్య కార్యకర్తల కృషి ప్రశంసనీయం అన్నారు. ట్రకోమా అనేది చాలా అంటువ్యాధి కలిగిన బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్. ప్రపంచవ్యాప్తంగా నివారించగల అంధత్వానికి ట్రకోమా ఒక ప్రధాన కారణం. 'దీనిని నిర్మూలించేందుకు 'స్వచ్ఛ్ భారత్ అభియాన్' కూడా సహాయపడింది. అంతేకాకుండా ఈ విజయంలో 'జల్ జీవన్ మిషన్'దీ గణనీయమైన పాత్రే. ఏరోజైతే ప్రతీ ఇంటికీ పరిశుభ్ర నీరు కుళాయిల ద్వారా అందుతున్నదో అప్పటి నుంచే అలాంటి వ్యాధుల వల్ల కలిగే నష్టం చాలావరకు తగ్గిపోయింది' అని మోదీ చెప్పారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధిని రూపుమాపేందుకు భారత



దేశం చేసిన కృషిని ప్రశంసిందన్నారు. భారతదేశం దాని మూలకారణాలను అన్వేషించి సమూలంగా నిర్మూలించగలిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. వివిధ మత యాత్రలకు వెళ్తోన్న అదృష్టవంతులైన భక్తులు అందరికీ ప్రధాని మోదీ తన శుభాకాంక్షలు తెలియజేశారు. చాలాకాలం తర్వాత కైలాస మానస సరోవరం యాత్ర శుభ ప్రదంగా పున: ప్రారంభం అయ్యిందని ఆయన సంతోషం వ్యక్తపరిచారు. పవిత్ర అమర్‌నాథ్ యాత్ర జూలై 3నుంచి ప్రారంభం కాబోతున్నదని పవిత్ర మాసం 'సవాన్' కూడా మరికొద్ది రోజుల ముందే ఉందని ఆయన చెప్పారు. ఆహారంలో 10శాతం నూనెను తగ్గించి ఊబకాయాన్ని తగ్గించుకోవాలని ప్రధానమంత్రి తన పిలుపును పునరుద్ఘాటించారు. మీరు ఎప్పుడైతే ఫిట్‌గా ఉంటారో అప్పుడే మీ జీవితంలో మరింత సూపర్‌హిట్ అవుతారని సూచించారు.

## జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ మీట్–2025 క్రికెట్ టోర్నీ విజేత మీడియా టీమ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ మీట్–2025లో భాగంగా ఆదివారం నాగోల్ బండ్లగూడలోని జిహెచ్‌ఎంసి స్టేడియంలో కార్పొరేటర్లు – మీడియా కేటగిరీలో జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో జిహెచ్‌ఎంసి మీడియా జట్టు 38 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన మీడియా టీమ్ బ్యాటింగ్ ఎంచుకుంది. బరిలోకి దిగిన మీడియా జట్టు బ్యాట్ మెన్స్ 14 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 121 పరులు భారీ లక్ష్యాన్ని కార్పొరేటర్ల టీమ్ ముందు ఉంచింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కార్పొరేటర్ల టీమ్ 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. మీడియా టీమ్ నుంచి ఓపెనర్ గా వచ్చిన సదానంద్ గౌడ్ ఫస్ట్ డౌన్‌లో వచ్చిన శ్రవణ్‌లతో పాటు ఆ తరువాత వచ్చిన రత్నకుమార్, రాజేందర్ గౌడ్‌లు మెరుగ్గా రాణించి జట్టుకి భారీ స్కోర్ అందించారు. ఇక కార్పొరేటర్ల టీమ్‌లో లచ్చిరెడ్డి, దర్శన్, శ్రవణ్, విజయ్ కుమార్ గౌడ్‌లు జట్టుకి భారీ స్కోర్ అందించినప్పటికీ మీడియా టీమ్ బౌలర్ల దాటిని తట్టుకోలేకపోయారు. మీడియా టీమ్ ప్లయర్‌లు ఫీల్డింగ్ లోనూ అదరగొట్టారు. కెప్టెన్ శ్రవణ్‌తో పాటు రత్నాకర్, గణేష్, బాపురావు, మల్లం వెంకటేశ్, బస్వరాజ్, నిరంజన్, మహేష్‌లు అద్భుతమైన ఫీల్డింగ్ చేశారు. ఇక బౌలింగ్‌లో సదానంద్, మంచె మహేష్, శ్రవణ్, రత్నకుమార్, రాజేందర్ గౌడ్‌లతో పాటు మల్లం వెంకటేశ్ అద్భుతమైన బౌలింగ్‌తో టీమ్‌ని గెలిపించారు. దీంతో విన్నర్‌గా మీడియా టీమ్ నిలవగా, రన్నర్‌గా కార్పొరేటర్ల టీమ్ నిలిచింది. మీడియా టీమ్ గెలుపొందిన సందర్భంగా కార్పొరేటర్లు దర్పల్లి రాజశేకర్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, శ్రవణ్, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డిలతో శుభాకాంక్షలు తెలిపారు.

## గుడ్ల వినియోగంలో భారత్ వెనుకంజ



**న్యూఢిల్లీ:** కోడిగుడ్ల తలసరి వినియోగంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లను భారత్ అధిగమించింది. ఆదాయం పెరగడంతో పాటు పోషకాహారంపై అవగాహన పెరగడమే దీనికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్ ఇంకా చాలా వెనుకబడే ఉందన్నారు. 'అవర్ వరల్డ్ ఇన్ డేటా' గణాంకాల ప్రకారం.. తలసరి గుడ్ల వినియోగంలో భారత్ 2018లో పాకిస్థాన్‌ను అధిగమించింది. మూడు దశాబ్దాలకు పైగా మనకంటే ముందున్న పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి అప్పటి నుంచి ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. 2022 నాటికి, భారత్‌లో వార్షిక తలసరి గుడ్ల వినియోగం 4.6కిలోలుగా నమోదు కాగా, పాకిస్థాన్‌లో ఇది 3.7కిలోలుగా ఉంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లో 3.6కిలోలు, శ్రీలంకలో 3.7కిలోలు, నేపాల్‌లో కేవలం 2కిలోలుగా నమోదైంది. దక్షిణాసియాలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ప్రపంచ సగటుతో పోల్చినప్పుడు భారత్ వినియోగం చాలా తక్కువ. 2022లో ప్రపంచవ్యాప్తంగా తలసరి గుడ్ల వినియోగం 10.4 కిలోలుగా ఉంది. అంటే, ప్రపంచ సగటులో మనం సగం కంటే తక్కువే తింటున్నామని స్పష్టమవుతోంది. భారత ప్రభుత్వ గణాంకాల మంత్రిత్వ శాఖ (202324) నివేదిక ప్రకారం, భారతీయుల ఆహార ఖర్చులో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు తమ నెలవారీ ఖర్చులో 11.1%, గ్రామీణ ప్రాంతాల్లో 9.8% కూల్ డ్రింకులు, చిప్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్ కోసమే వెచ్చిస్తున్నారు. పాలు, కూరగాయల కన్నా వీటికే ఎక్కువ ఖర్చు చేస్తుండటం గమనార్హం. గుడ్ల వినియోగం పెరగడం మంచి పరిణామమే అయినా, ప్రాసెస్డ్ ఫుడ్ వైపు మొగ్గు చూపడం ఆహార అలవాట్లలోని మరో కోణాన్ని తెలియజేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ట్రంప్ యత్నాలు ముమ్మరం!

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా పర్యటనపై పూర్తి వివరాలు చెప్పడానికి సంబంధిత అధికారులు ఇష్టపడలేదు. ఐతే కాల్పుల విరమణ గురించి మాట్లాడటానికి నేతన్యాహూకు చెందిన అగ్రశ్రేణి సలహాదారు, ఇజ్రాయెల్ వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి రోన్‌డెర్మెర్ ఈ వారంలోనే అమెరికా వెళుతున్నారు. అదేవిధంగా నేతన్యాహూపై స్వదేశంలో అవినీతి ఆరోపణలపై కూడా ట్రంప్ ఇప్పటికే జోక్యం చేసుకున్నారు. ఆయనపై ఆరోపణలు, కేసులను మంత్రగత్తె వేటగా అభివర్ణించారు. ఈ కేసులు ఉపసంహరించాలని ఆయన ఇప్పటికే ఇజ్రాయెల్‌ను కోరారు. దీనిపై ఆ దేశంలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఇదిలా ఉండగా గాజాలో ఆదివారంనాడు ఐడి ఎఫ్ చేసిన దాడుల్లో 40 మంది మరణించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక మొదట ఎనిమిదివారాలు కాల్పుల విరమణ అమలు జరిగింది. తర్వాత మార్చి 18న మళ్ళీ ఇజ్రాయెల్‌యుద్ధం ప్రారంభించాక 5000 మందిపైగా పాలస్తీనియన్లు మరణించారు. ఇప్పటికే గాజాలో 56,000 మంది మరణించగా మరో 14000 మంది దేహాలు శిథిలాల్లో చిక్కుకుని ఉన్నాయని అంతర్జాతీయ అధ్యయన సంస్థలు అంచనావేశాయి.

## పోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. నమ్మించి మోసం చేయడం.. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు.. 69 బిఎన్ఎస్, 108 బిఎన్ఎస్ సెక్షన్ల కింద చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. స్వేచ్ఛ కూతురు స్టేట్మెంట్) ఆధారంగా అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో తనతో కూడా పూర్ణచందర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు స్వేచ్ఛ కూతురు శనివారం మీడియాతో పాటు పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చింది. దీంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఓ న్యూస్ ఛానల్లో న్యూస్ యాంకర్‌గా పనిచేసే స్వేచ్ఛ గత శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్వేచ్ఛ తండ్రి శంకర్ కథనం ప్రకారం 2017లో భర్తతో విడిపోయిన స్వేచ్ఛ కొంతకాలంగా పూర్ణచందర్‌తో ఉంటున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య విభేదాలు మొదలైనట్లు శంకర్ తెలిపారు.

## ధీర వనిత సుగుణమ్మ

(మొదటి పేజీ తరువాయి)

జీవితాన్ని గడిపారని కొనియాడారు. ఉద్యమాలను ఎలా చేయాలో రాబోయే తరాలకు సుగుణమ్మ బాట వేశారన్నారు. ఆమె జీవితం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాలతోనే ముడిపడిందన్నారు. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన సుగుణమ్మ ఉద్యమ కాలంలో ఎన్నో కష్టాలను అనుభవించారని, ఆమె భర్త ఎస్‌వికె ప్రసాద్‌కు తోడుగా ఉద్యమంలో పాల్గొన్నారని, కమ్యూనిస్టులు ఏకం కావాలన్నదే ఆమె చివరి కోరిక అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలవాలని ప్రజలు బలంగా కోరుతున్నారని, సుగుణమ్మ కోరిక కూడా అదేనన్నారు. కర్రగుట్ట, ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం ఊచకోత కోస్తుంటే ఎందుకు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని, తుపాకీతో కేంద్రాన్ని పడగొట్టే సత్తా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై చర్చించాలని, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యత దిశగా చర్చలు కొనసాగాలని శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. సిపిఐ, సిపిఐ (ఎం) చీలిపోవడం ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. సిపిఐ, సిపిఐ (ఎం) ఎందుకు చీలిపోయాయో ఎవరికీ తెలియదని, ఈ రెండు పార్టీలు కలవాలని తీర్మానం చేసుకున్న తర్వాత కూడా ఇంత వరకు కలవలేదన్నారు. పార్టీల కంటే ముందుగా ప్రజాసంఘాలను కలిపేందుకు సర్క్యులర్‌ను జారీ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు.

సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే సుగుణమ్మ ఉద్యమ బాట పట్టారని, ఆమె త్యాగాలు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. కమ్యూనిస్టులు లేని సమాజం చూడలేమని సుగుణమ్మ అనేక సార్లు అనేవారని గుర్తు చేశారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభ జరిగే వరకు సుగుణమ్మ బతికిఉండే బాగుండేదన్నారు. భవిష్యత్తులో శక్తివంతమైన ఉద్యమం రావాలంటే సుగుణమ్మ స్ఫూర్తితో వామపక్ష పార్టీల ఐఖ్యతను తీసుకురావడానికి ఆచరణలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పది మందిలో చైతన్యం తీసుకొస్తూ సుగుణమ్మ ఉద్యమాలను నడిపించారని గుర్తు చేశారు. సుగుణమ్మను 15 రోజుల క్రితం సిపిఐ నాయకులు రత్నాకర్‌తో కలిసి తాను పరామర్శించానని, ఆ రోజు ఆమెతో మాట్లాడిన చివరి మాటలను పల్లా వెంకట్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఏ ఆశయంతో భూస్వామ్య కుటుంబం నుంచి సుగుణమ్మ వచ్చిందో, ఆ ఆశయ సాధన దిశగా మునుముందు పనిచేస్తామన్నారు. మహిళా ఉద్యమాలు తగ్గుతున్నాయని, కొత్తగా యువత ముందుకు రావడం లేదని, ఉద్యమాలను ముందుకు తీసుకుపోయేందుకు కార్యచరణ చేపట్టాలని సుగుణమ్మ తన చివరి క్షణం వరకు ఎంతో తపన పడ్డారని పల్లా అన్నారు.

సి.ఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, సిపిఐ సీనియర్ నాయకురాలు ప్రేమ్‌పావని, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, సి.ఆర్ ఫౌండేషన్ పాలిక్లినిక్ డైరక్టర్ డాక్టర్ కె.రజని, తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి, సుగుణమ్మ కూతురు డాక్టర్ శాకమూరి శోభ, కుమారులు డాక్టర్ శాకమూరి రవి, శాకమూరి రమేష్, సుగుణమ్మ సంరక్షకులు జిలాని తదితరు



లు సుగుణమ్మ ఉద్యమ చరిత్రను గుర్తు చేశారు. ఆమె ఆశయాల సాధన కోసం మునుముందు ఉద్యమాలను బలోపేతం చేస్తామన్నారు. అంతకు ముందు సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఎంఎల్‌సి పి.జె చంద్రశేఖర్‌రావు, సిపిఐ సీనియర్ నాయకురాలు డాక్టర్. బి.వి.విజయలక్ష్మి , సి.ఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరక్టర్ జె.కల్పన, ఎన్‌ఆర్‌ఆర్ రీసర్చ్‌సెంటర్ డైరక్టర్ డాక్టర్ టి.సురేష్, సభ్యులు కె. జ్యోష్న, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com